

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ



fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 239 | విజయవాడ, మంగళవారం 29 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00

డోక్లాంపై అంగీకారం

న్యూఢిల్లీ: డోక్లామ్ నుండి భారత్ తన దళాలను ఉపసంహరించుకోడానికి అంగీకరించి, ఉపసంహరణ ప్రారంభించడంతో కొద్ది మాసాలుగా రెండు దేశాల మధ్య ఏర్పడిన సరిహద్దు ప్రతిష్టంభన తొలగిపోయింది. ప్రధాని నరేంద్ర మోడీ కొద్ది రోజుల్లో బ్రిక్స్ సమావేశంలో పాల్గొనడానికి చైనా పర్యటనకు వెళుతున్న సందర్భంలో భారత్ తన దళాలను ఉపసంహరించుకోవడం ప్రారంభించింది. దీనిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రకటన ఈ విధంగా పేర్కొంది: "డోక్లామ్ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి భారత్ చైనాలు గత కొద్ది వారాలుగా దైత్యపరమైన చర్చలు జరిపాయి. ఈ చర్చల సందర్భంగా మేము మా అభిప్రాయాల వెల్లడించాము. మా ప్రయోజనాలను గురించి, ఆందోళనలను గురించి తెలియజేశాము. దీని ప్రాతిపదికగా డోక్లామ్‌లోని ప్రతిష్టంభన ప్రాంతం నుండి సరిహద్దు దళాలను వెంటనే ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్నాము, ఉపసంహరణ జరుగుతోంది."

"డోక్లామ్ నుండి దళాల ఉపసంహరణ అవగాహన" అన్న శీర్షికతో మిగతా 9లో

చైనా కంపెనీలు భారత్‌కు రావాలి : నీతి అయోగ్ 8



నంద్యాల విజేత భూమా




ఉపఎన్నికల్లో విజయం సాధించిన భూమా బ్రహ్మనందరెడ్డికి ధృవీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేశ్

- వైసిపి అభ్యర్థి శిల్పాపై 27,466 ఆధిక్యతతో జయకేతనం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రావ్యాప్తంగా ఉత్కంఠ రేపిన నంద్యాల ఉపఎన్నికల్లో టిడిపి విజయం సాధించింది. సోమవారం ఉదయం ప్రారంభమైన కౌంటింగ్‌లో మొదటి రౌండ్ నుంచి టిడిపి ఆధిక్యత కొనసాగింది. టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందారెడ్డి వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిపై 27,466 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 2,18,000 ఓటర్లు ఉన్న నంద్యాల నియోజకవర్గంలో ఈనెల 23న జరిగిన పోలింగ్‌లో 1,73,187 (79.20 శాతం)ఓట్లు మిగతా 2లో



అభివృద్ధి సంక్షేమానికే పట్టం 9



అధికార దుర్వినియోగంతోనే గెలిచారు 9

కలిసొచ్చిన కుల సమీకరణలు 2



20 ఏళ్ల జైలు

- రూ.30 లక్షలు జరిమానా
- శిక్ష ఖరారు చేసిన సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి జగ్దీప్ సింగ్
- రోహ్‌తక్‌లోని సునారియా జైలులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులో ప్రకటన
- హర్యానా, పంజాబ్, రోహ్‌తక్‌లలో మూడంచెల భద్రత

రోహ్‌తక్ : డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు 2002 నాటి అత్యాచార కేసులో ప్రత్యేక సిబిఐ కోర్టు సోమవారం శిక్ష ఖరారు చేసింది. గుర్మీత్ సింగ్‌ను దోషిగా నిర్ధారించిన సిబిఐ ప్రత్యేక కోర్టు రెండు అత్యాచారం కేసుల్లో వేర్వేరుగా 10 సంవత్సరాల చొప్పున మొత్తం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. జైలు శిక్షతో పాటు రూ.15 లక్షలు చొప్పున రూ.30లక్షలు కోర్టు జరిమానా విధించింది. సునారియా జైలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోర్టు రూంలో సిబిఐ న్యాయమూర్తి జగ్దీప్ సింగ్ తీర్పు ప్రకటించారు. సిబిఐ ప్రత్యేక కోర్టు శుక్రవారం గుర్మీత్‌ను దోషిగా నిర్ధారించడంతో చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనల నేపథ్యంలో ఆయనను రోహ్‌తక్ శివార్లలోని సునారియా జైలుకు తరలించారు. గుర్మీత్‌కు శిక్ష ఖరారు చేసి ప్రకటించేందుకు సునారియా జైలు అనువైనదిగా పేర్కొంటూ పంజాబ్, హర్యానా హై కోర్టు సూచనల మేరకు జైలులోనే ప్రత్యేక కోర్టు రూంను ఏర్పాటు చేశారు. గుర్మీత్‌కు శిక్ష ప్రకటించడానికి ముందు న్యాయమూర్తి జగ్దీప్ అటు ప్రాసిక్యూషన్, ఇటు డిఫెన్స్ న్యాయవాదుల వాదనలు విన్నారు.

గుర్మీత్‌కు శిక్ష ప్రకటించనున్న క్రమంలో రోహతక్‌లోనూ, సునారియా జైలు పరిసర ప్రాంతాల్లోనూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. పోలీసులు, 23 కంపెనీల పారా మిలటరీ బలగాలు పటిష్టమైన బందోబస్తు నిర్వహించాయి. సైన్యం కూడా పహారా నిర్వహించింది. సునారియా జైలుకు వెళ్ళే మార్గాలన్నిటిని మిగతా 8లో

నేడు 'కాకినాడ' పోలింగ్

- పూర్తయిన ఏర్పాట్లు

2





ఆశారామ్ బాపు కేసులో గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం మొట్టికాయలు



న్యూఢిల్లీ : ఆశారామ్ బాపు అత్యాచార కేసులో గుజరాత్ ప్రభుత్వానికి సోమవారం సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసింది. ఆయనపై నమోదైన అత్యాచారం కేసు విచారణ నత్తనడకన నడవడంపై ప్రశ్నించింది. ఈ కేసులో ఇప్పటి వరకు బాధితులను ఎందుకు ప్రశ్నించలే దంటూ న్యాయమూర్తులు ఎన్.వి. రామన్న, అమితవ రాయ్‌లతో కూడిన ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనికి సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కేసు తదుపరి విచారణను దీపావళి అనంతరం చేపట్టనున్నట్లు తెలిపింది. ఆశారామ్ బాపుపై నమోదైన అత్యాచారం కేసులో ప్రాసిక్యూషన్ తరపుసాక్షుల వ్యాఖ్యలను త్వరితగతిన నమోదు చేయాలని గుజరాత్‌లోని ట్రయల్ కోర్టును ఏప్రిల్ 12న సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో సూరత్‌కు చెందిన సిస్టర్స్ ఆశారామ్ బాపుపై దాఖలు చేసిన పిటిషన్‌కు సంబంధించి బాధితులతో సహా ప్రాసిక్యూషన్ తరపున మిగిలిన 46 మంది సాక్షుల వ్యాఖ్యలను నమోదు చేయాలని సూరత్ ట్రయల్ కోర్టును కోరింది. అంతకుముందు జనవరి 30న రాజస్థాన్, గుజరాత్‌లలో ఆశారామ్‌పై దాఖలైన రెండు వేరువేరు అత్యాచార కేసుల్లో ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఆశారామ్ బాపు బెయిల్ కోసం తప్పుడు పత్రాలను సమర్పించారని పేర్కొంది. తప్పుడు పత్రాలను తయారు చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది.

భారీగా కోతలు

- 26 వేల కోట్లకు కేంద్రం ఇచ్చింది 3,377 కోట్లే
- పోలవరంపై 134 అభ్యంతరాలు
- గతేడాదితో పోల్చితే వచ్చింది సగమే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రం నుంచి రావాల్సిన నిధులు గణనీయంగా తగ్గిపోయాయి. గతేడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు వచ్చిన నిధుల్లో ఈ ఏడాది కేవలం సగమే రాగా, ఈ ఏడాది రావాల్సిన నిధుల్లో కేవలం 12 శాతమే రాష్ట్రానికి చేరాయి. నాలుగు ప్రధాన శాఖలకు చెందిన నిధుల్లో ఒక్క పైసా కూడా రాకపోవడం, పోలవరం నిధులపై పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ నిధులను నిలిపివేయడం, ఉపాధి హామీ నిధుల్లోనూ పాత అడ్వాన్సుల పేరిట కోత విధించడం వంటి అంశాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభావాన్ని చూపిస్తున్నాయి.

కేంద్రం నుంచి అగస్టు వరకు వచ్చిన నిధుల వివరాలు (రూ. కోట్లలో)

విభాగం	బడ్జెట్ అంచనా	వచ్చింది
రెవెన్యూ లోటు (2014-15)	3,100	0
రెవెన్యూ లోటు (ఫైనాన్స్ కమిషన్)	4,430	1,846
రాజధానికి	1,500	0
పోలవరం	7,000	433
ఇఎపి గ్రాంట్లు	3,500	0
వెనుకబడిన ప్రాంతాలకు	350	0
ఉపాధిహామీ	6,340	1,098
మొత్తం	**26,220**	**3,377**

ఈపరిస్థితిపై అధికారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు నెలలు గడచిపోయినందున ఇకనైనా మిగిలిన నిధులను రప్పించుకునే ప్రయత్నాలు చేయాలని అధికారులు యోచిస్తున్నారు.కేంద్రం నుంచి తొమ్మిది కీలక రంగాల్లో గతేడాది రూ. 17,775 కోట్ల బడ్జెట్ అంచనాల్లో ఆగస్టు వరకు రూ. 6,455 కోట్లు రాగా, ఈ ఏడాది 26,220 కోట్ల అంచనాలో కేవలం 3,377 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. లోటు నిధులను పరిశీలిస్తే గత ఏడాది రూ. 3వేల కోట్లు వస్తాయని బడ్జెట్‌లో ప్రతిపాదించగా కేవలం రూ. 1,177 కోట్లే వచ్చాయి. ఈసారి రూ. 3,100 కోట్లు అంచనా వేస్తే, ఇప్పటివరకు ఒక్క పైసా కూడా చేతికందలేదు. రాజధాని నిర్మాణానికి గతేడాది రూ. వెయ్యి కోట్లు రావాల్సి ఉండగా కేవలం రూ. 450 కోట్లిచ్చి, కేంద్రం చేతులు దులుపుకొంది. ఈ ఏడాది 1,500 కోట్ల అంచనాలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఇఎపి గ్రాంట్లు రూ. 3,500 కోట్లు, వెనుకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన రూ. 350 కోట్లలో కూడా ఇంతవరకు నిధులేవీ విడుదల చేయలేదు. పోలవరం ప్రాజెక్టు కోసం గత ఏడాది రూ. 3,500 కోట్లు బడ్జెట్‌లో పొందుపరచగా, అందులో రూ. 2082 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఈ ఏడాది రూ. ఏడు వేల కోట్లు బడ్జెట్‌లో పెట్టగా, ఇప్పటివరకు రూ. 433 కోట్లు మాత్రమే చేతికందాయి. జాతీయ ఉపాధి హామీ నిధులకు సంబంధించి గతేడాది రూ.4,400 కోట్లు బడ్జెట్‌లో పెట్టగా, రూ. 3,752 కోట్లు విడుదలయ్యాయి. ఈ ఏడాది రూ. 6340 కోట్లు వస్తాయని అంచనా వేసి బడ్జెట్‌లో మిగతా 9లో

అధికార పార్టీలదే గెలుపు

- దేశవ్యాప్తంగా నాలుగు ఉప ఎన్నికలు
- గోవాలో బిజెపి, ఢిల్లీలో ఆప్, రాష్ట్రంలో టిడిపి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 23న జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పక్షానికే చెందిన అభ్యర్థులే విజయం సాధించారు. సోమవారం ఈ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. గోవాలో రెండు స్థానాలు పనాజీ, వాల్పోయి నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో స్థానికంగా అధికారంలో వున్న బిజెపి విజయం సాధించింది. ఇందులో పనాజీ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ విజయం సాధించగా, వాల్పోయిలో రాష్ట్ర మంత్రి విశ్వజీత్ రాణే గెలుపును అందుకున్నారు. ఈ నియోజకవర్గాల్లో మార్చిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికైన ఎమ్మెల్యేలు మిగతా 8లో

ముద్రగడ పాదయాత్రకు విరామం

- 30న తేలనున్న భవిష్యత్ కార్యాచరణ
- పోలీసుల వలయంలోనే కిర్లంపూడి
- కొనసాగుతున్న ఆంక్షలు



ముద్రగడ ఇంటి వద్ద మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

మాజీమంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం 32 రోజులుగా పాదయాత్రకు ప్రయత్నిస్తున్నప్పటికీ పోలీసులు ఆంక్షలు విధిస్తుండటంతో సోమవారం నుంచి పాదయాత్రకు విరామం ప్రకటించారు. ఈనెల 30న రాష్ట్రంలోని 13 జిల్లాల కాపు జెఎసి నేతలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించాలని ముద్రగడ నిర్ణయించారు. పోలీసులు అనుమతించకపోయిన ప్పటికీ ఆదివారం ఆయన వేలాదిమందితో సుమారు మూడు కిలోమీటర్లు పాదయాత్ర చేసిన విషయం విదితమే. చంద్రబాబు కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారానికి వచ్చిన నేపథ్యంలోనే ముద్రగడ పోలీసు వలయాన్ని ఛేదించి పాదయాత్రను ప్రారంభించడంతో ప్రభుత్వం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వేలాదిమంది పాదయాత్రలో పాల్గొనడంతో కిర్లంపూడి, రామవరం తదితర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులేర్పడ్డాయి. ముద్రగడకు పాదయాత్ర చేసే ఉద్దేశ్యం లేదని, గేటు దాటి వెళ్లలేరా అని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప సవాల్ చేశారు. సిఎం సవాల్‌కు ప్రతిసవాల్ చేయడం కోసమే పాదయాత్ర చేపట్టి తన సత్తా చూపించానని ముద్రగడ స్పష్టం చేశారు. సిఎం అలా మాట్లాడి ఉండకపోతే తాను రోడ్డెక్కేవాడిని కాదని సోమవారం మీడియా సమావేశంలో ఆయన ప్రకటించారు. పద్మనాభంను రాయవరం కూడలి మిగతా 9లో



దీపక్ మిశ్రా ప్రమాణం

న్యూఢిల్లీ : భారత 45వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ ఖేహార్ స్థానంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రాను నియమించారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం ఉదయం జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. సుప్రీం కోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన మిశ్రా 14 నెలలు ఈ పదవిలో కొనసాగుతారు. అక్టోబరు 2018లో పదవీ విరమణ చేస్తారు. 1977లో అడ్వకేట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన మిశ్రా మిగతా 8లో



ప్రజ్ఞ

1. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో స్వర్ణం గెలుచుకున్న క్రీడాకారిణి ఎవరు?
2. అత్యాచారం కేసులో దోషి గుర్మీత్ రామ్ రహీమ్‌ను ఏ జైలులో ఉంచారు?
3. ఏ హాకీ క్రీడాకారుడి జయంతిని జాతీయ క్రీడాదినోత్సవంగా నిర్వహించుకుంటాం?
4. పౌష్టికాహారలోపంతో 52 మంది శిశువులు మృతిచెందడంతో వార్తల్లోకెక్కిన ఆస్పత్రి ఏది?
5. ఎలక్ట్రానిక్ వ్యర్థాల కోసం 'ఈ వేస్టు డిస్పోజల్' పథకాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్రం ఏది?

సమాధానాలు 7లో

కలిసొచ్చిన కుల సమీకరణలు

- రూ.1500 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ఆగిపోతాయనే మైండ్ గేమ్
- ముఖ్యమంత్రిపై జగన్ దూషణలూ మైనస్
- టిడిపిలో కదనోత్సాహం
- నీరుగారిన వైసిపి - కోలుకోని కాంగ్రెస్



భూమా బ్రహ్మనందరెడ్డికి అభినందనలు తెలుపుతున్న మంత్రి అఖిలప్రియ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రతిష్టాత్మకంగా జరిగిన నంద్యాల ఉప ఎన్నికలలో ప్రజలు టిడిపికే పట్టం కట్టారు. వైసిపి నుంచి గెలుపొంది టిడిపిలో చేరిన భూమా నాగిరెడ్డి ఆకస్మిక మరణంతో జరిగిన ఈ ఎన్నికలను అధికార టిడిపి, ప్రధాన ప్రతిపక్షం వైసిపి, గత ఎన్నికల్లో ఓటమి చెందిన కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గతంలో ఎవరైనా ఎమ్మెల్యే మృతి చెందితే వారి కుటుంబ సభ్యులు ఏకగ్రీవంగా పోటీ చేసే సంప్రదాయాన్ని టిడిపి ముందుకు తెచ్చింది. నంద్యాల నియోజకవర్గంలో సామాజిక సమీకరణలు వైసిపి వైపు ఎక్కువగా ఉండటంతో భూమా కుటుంబానికి ఏకగ్రీవంగా ఇచ్చేందుకు ఆ పార్టీ తిరస్కరించిన విషయం తెలిసిందే. నంద్యాల నియోజకవర్గంలో వైసిపికి ముస్లిం, క్రైస్తవ, మైనార్టీ, రెడ్డి, దళితులు గట్టి మద్దతుదారులుగా ఉన్నారు. దీంతో వైసిపి ఈ ఉప ఎన్నికల్లో గెలుపొందడం ద్వారా 2019 ఎన్నికల నాటికి టిడిపిని ఆత్మ రక్షణలో పడేయాలన్న లక్ష్యంతో ఎన్నికల బరిలోకి దిగింది. శిల్పా మోహన్‌రెడ్డికి కండువా వేసి వైసిపి అభ్యర్థిగా ప్రకటించింది. వైసిపికి సరైన అభ్యర్థే లేరని, పోటీ పెట్టినా తాను ఏకపక్ష విజయాన్ని అందుకుంటామన్న అంచనాతో ఉన్న టిడిపికి సొంత పార్టీ నుండే శిల్పా బ్రదర్స్ ప్రత్యర్థులుగా మారారు. దీంతో టిడిపికి దిక్కుతోచని స్థితి ఏర్పడింది. వ్యూహాత్మకంగా టిడిపి అధినేత చంద్రబాబు నంద్యాల అభివృద్ధిని తెరముందుకు తెచ్చారు. మూడేళ్లపాటు ఒక్క పనీ చేపట్టని తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికలు అనివార్యమని తేలడంతో ఏకంగా రూ.1500 కోట్ల నిధులను కేటాయించి వీధి వీధినా పనులకు శ్రీకారం చుట్టింది. మూడు దశాబ్దాలుగా జరగని రోడ్డు విస్తరణ పనులను చేపట్టింది. 13 వేల ఇళ్లను మంజూరు చేసింది. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలోనూ ఇవ్వని విధంగా రేషన్ కార్డులు, పెన్షన్లను మంజూరు చేసింది. తెలుగుదేశం గెలవకపోతే ఈ పనులన్నీ ఆగిపోతాయేమోనన్న ఆందోళనను నంద్యాల ప్రజల్లో కల్పించింది. ముఖ్యమంత్రి ఎలాగైనా టిడిపి అభ్యర్థిని గెలిపించుకోవాలన్న లక్ష్యంతో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే నాలుగు రోజులు మకాం వేసి కుల సమీకరణల ఆధారంగా సమీక్షించారు. ప్రచారంలో భాగంగా రెండు రోజులు మకాం వేసి సమీకరణలు చేశారు. బిజెపితో పొత్తు ఉన్నా ప్రచారంలో ఎక్కడా బిజెపి జెండా, నాయకులు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ముస్లిం మైనార్టీలను, క్రిస్టియన్లను తనవైపు తిప్పుకోవడంలో బాబు సఫలమయ్యారు. మరో కీలక సామాజిక వర్గమైన బలిజలకు రూ.3 కోట్లతో కమ్యూనిటీ హాల్, యాదవులకు కృష్ణ దేవాలయ నిర్మాణానికి ఏడు సెంట్ల స్థలాన్ని ఇప్పించారు. రెడ్డి సామాజిక తరగతి వైసిపికి అనుకూలంగా ఉండటంతో కడప జిల్లాకు చెందిన ఆది నారాయణరెడ్డిని అనంతపురం నుంచి జెసి దివాకర్‌రెడ్డిని, చిత్తూరు నుంచి అమరనాథ రెడ్డిని నెల్లూరు నుంచి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని రంగంలోకి దింపారు. గోస్పాడు మండలంలో వైసిపికే అనుకూలమైన వాతావరణం వస్తుందన్న అంచనాతో దాదాపు 40 ఏళ్ల పాటు భూమా కుటుంబంతో ముఠా రాజకీయాలు నడిపిన గంగుల ప్రతాపరెడ్డిని టిడిపిలోకి ఆహ్వానించి రెడ్డి సామాజిక తరగతికి సంబంధించిన ఓట్లను తమవైపు తిప్పుకున్నారు. అడుగడుగునా అధికార పార్టీ తన అధికార దర్పాన్ని ప్రదర్శించి ఎన్నికల్లో పైచేయి సాధించింది. నియోజకవర్గంలో మెజార్టీ ఓట్లు సాంప్రదాయంగా తమకు అనుకూలమైనవే అయినా ఓటర్లను మెప్పించడంలో వైసిపి అధినేత జగన్మోహనరెడ్డి వ్యూహం ఫలించలేదు. 14 రోజులపాటు నంద్యాలలో మకాం వేసి ఇంటింటి ప్రచారం చేసినా సంస్థాగతంగా పోలింగ్ కేంద్రాల వారీగా క్యాడర్‌ను సమకూర్చుకోవడంలో విఫలం చెందిన వైసిపి ఓటమి పాలైందని విశ్లేషకుల అంచనా. నంద్యాల నియోజకవర్గంలో కీలకంగా ఉన్న పట్టణంలోని మధ్య తరగతి ప్రజలు జగన్ ప్రచార సభల్లో వాడిన భాష పట్ల షాక్‌కు గురయ్యారు. ముఖ్యమంత్రిని నడిరోడ్డుపై కాల్చి వేసినా తప్పులేదని, బట్టలూడదీయాలని, ఉరితీయాలని చేసిన వ్యాఖ్యలు జగన్‌కు బాగా నష్టం చేకూర్చాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అభ్యర్థి శిల్పాకు స్వతహాగా నంద్యాల పట్టణంలో సొంత క్యాడర్ ఉన్నా వ్యూహ రచన చేయడానికి అవకాశం లేకుండా 13 రోజుల పాటు అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని జగన్ వెంట పెట్టుకోవడం నష్టం చేకూర్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ముఖ్యమంత్రి ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు నే వేయించిన రోడ్లపై తిరుగుతూ, నేనిచ్చే పెన్షన్ తీసుకుంటూ నా కెందుకు ఓట్లు వేయరు. అవసరమైతే ఓటుకు రూ.5వేలు ఇవ్వగలనన్న వ్యాఖ్యలను వైసిపి సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లలేకపోయిందనే అభిప్రాయం సర్వత్రా నెలకొంది. ఇక ఎమ్మెల్యే రోజా భూమా అఖిలప్రియపై చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీకి నష్టం చేకూర్చాయన్నది మరో చర్చ. బరిలో ఉన్న భూమా బ్రహ్మానందరెడ్డి, మంత్రి అఖిలప్రియతోపాటు భూమా కుమారుడు జగత్ విఖ్యాత్‌రెడ్డి, మరో కూతురు నాగమౌనికారెడ్డి చిన్న పిల్లలు కావడం అంతా 25 సంవత్సరాలకు అటు ఇటుగా ఉండటం, తల్లీతండ్రిలేని పిల్లలు అన్న సానుభూతి కూడా టిడిపికి కలిసి వచ్చింది. వైసిపి ఓటమి స్వయంకృతాపరాధం కాగా తెలుగుదేశం పక్కా వ్యూహరచనతో తెచ్చుకున్న విజయంగా పరిశీలకులు పేర్కొంటున్నారు.

2014 సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో తీవ్ర ఓటమి మూటగట్టుకున్న కాంగ్రెస్ నంద్యాల ఉప ఎన్నికల్లో డిపాజిట్ తెచ్చుకుని పునర్వైభం తెచ్చుకోవాలని ఆశించినా నంద్యాల ఓటర్లు ఆ అవకాశం ఇవ్వలేదు. 2014లో పోటీ చేసినప్పుడు 2,452 ఓట్లను తెచ్చుకున్న కాంగ్రెస్ నేడు కేవలం 1,382 ఓట్లను మాత్రమే తెచ్చుకుంది. వైసిపి, టిడిపిలు ఒకే సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులను బరిలో దింపడం, ముస్లిం మైనార్టీ ఓట్లే దాదాపు 60 వేలు ఉండటంతో కనీసం డిపాజిట్ అయినా వస్తుందని మైనార్టీ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్‌ను రంగంలోకి దింపింది.

పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి, ఉపాధ్యక్షులు తులసిరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించినా ఓట్ల శాతం పెరగక పోగా మరింత పడిపోవడం కాంగ్రెస్ శ్రేణులను పూర్తిగా నైరాశ్యంలోకి నెట్టేసింది. ప్రత్యేక రాయలసీమ సెంటిమెంట్ బలంగా ఉందని రాయలసీమ పరిరక్షణ సమితి(ఆర్‌పిఎస్) అధ్యక్షులు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నంద్యాల నియోజకవర్గంలో బంధువుల పరంగా గణనీయంగా ఓట్లను తెచ్చుకుని రాయలసీమ జిల్లాల్లో పెద్ద ఎత్తున అలజడి సృష్టించాలనుకున్నారు. ఆర్‌పిఎస్ అభ్యర్థి భవనాశి పుల్లయ్యకు 154 ఓట్లు వచ్చి నిరాశే మిగిల్చింది. మొత్తంగా నంద్యాల ఉప ఎన్నికలలో సోషల్ ఇంజనీరింగే కీలక పాత్ర పోషించిందన్నదే సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-1 మెయిన్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 17 నుంచి ప్రారంభమైన పరీక్షలకు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలతో పాటు అనంతపురంలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 3,900 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించగా, అన్ని పేపర్‌లలో సగటున 62 శాతం హాజరు నమోదైంది. గత ఏడాది డిసెంబర్‌లో 78 పోస్టులలో నోటిఫికేషన్ విడుదలైంది. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా 93,482 మంది దరఖాస్తు చేసుకున్నారు. మే 7వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించగా, 1:50 చొప్పున 3,900 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించారు.

నేడు షార్‌లో శాస్త్రవేత్తల సమావేశం

పిఎస్‌ఎల్‌వి-సి36 ప్రయోగంపై పరిశీలన

ప్రజాశక్తి-సూళ్లూరుపేట (నెల్లూరు)

భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 31న పిఎస్‌ఎల్‌వి-సి36 రాకెట్ అంతరిక్షంలోకి పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాకెట్ ప్రయోగ విషయమై లాంఛ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశం షార్‌లో నేడు జరగనుంది. సోమవారం షార్ డైరెక్టర్ కున్నికృష్ణన్ శాస్త్రవేత్తలతో కలిసి రాకెట్‌ను పరిశీలించారు. తర్వాత రాకెట్‌ను ట్రాక్‌పై నెమ్మదిగా రెండో ప్రయోగ వేదికపైకి చేర్చారు. వివిధ రకాల పరీక్షలను నిర్వహించారు. అన్ని పరీక్షలు చేసిన తర్వాత అధికారికంగా రాకెట్ ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. ప్రయోగానికి 29 గంటల ముందు కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. ఇది నిరంతరాయంగా 29 గంటల పాటు కొనసాగిన పిదప పిఎస్‌ఎల్‌వి-సి36 రాకెట్‌ను ఈ నెల 31 న సాయంత్రం 4:59 గంటలకు నింగిలోకి పంపనున్నారు. ఇది 14 కిలోల బరువున్న ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది.

(మొదటి పేజీ తరువాయి)

పోలయ్యాయి. రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదు కావడంతో అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేశారు. ఫలితం భిన్నంగా వెలువడింది. విజేత భూమా బ్రహ్మానందారెడ్డికి 97,076 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి 69,610 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్‌కు ధరావత్తు దక్కలేదు. కేవలం 1,382 ఓట్లే వచ్చాయి. రాయలసీమ పరిరక్షణ సమితి అభ్యర్థి బవనాసి పుల్లయ్యకు కేవలం 154 ఓట్లు వచ్చాయి. నోటాకు 1,231 ఓట్లు పడ్డాయి. మిగతా అభ్యర్థులందరికీ వచ్చిన ఓట్లు మూడంకెలు దాటలేదు.

టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి చివరి 19వ రౌండ్ ముగిసే సరికి తన ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిపై 27,466 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుండి హోరా హోరీగా సాగిన ఎన్నికల ప్రక్రియలో టిడిపి భారీ మెజార్టీతో గెలుపొందింది. వైసిపికి మెజార్టీ వస్తుందనుకున్న నంద్యాల రూరల్, గోస్పాడు మండలాలోను టిడిపి తన ఆధిక్యతను ప్రదర్శించింది. కౌంటింగ్ మొదలయ్యాక ఉద్యోగులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ల ఓట్లు 255తో ఏ ఒక్క అభ్యర్థికి ఓటు వేయకపోవడం చర్చనీయాంశమైంది. మొదటి రౌండ్ నంద్యాల రూరల్ మండలం నుంచి సాగింది. మొదటిరౌండ్‌లోనే టిడిపికి దాదాపు 1,198 ఓట్ల మెజార్టీ రావడంతో వైసిపి శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. తమకు మెజార్టీ వస్తుందనుకున్న గ్రామాల్లో టిడిపికి వచ్చింది. అలాగే మొదటి రౌండ్‌లోనే దాదాపు గ్రామం అంతా కన్వర్టెడ్ క్రైస్తవులు ఉన్న పోలూరులోనూ, పూర్తిగా క్రైస్తవులు, రెడ్డి సామాజిక వర్గం అధికంగా ఉండే నంద్యాలలోని ఎస్‌పిజి కాంపౌండ్, ఎన్‌జిఒస్ కాలనీ, సంజీవరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో వైసిపి కంటే టిడిపికే ఆధిక్యత ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి 9వ రౌండ్ ముగిసేటప్పటికి కౌంటింగ్ కేంద్రం నుంచి బయటికి వెళ్లారు. మొత్తం 19 రౌండ్లకు గాను 16వ రౌండ్ మినహా అన్నింటిలోనూ టిడిపికే మెజార్టీ వచ్చింది. 16వ రౌండ్‌లో గోస్పాడు మండలం దీబగుంట్ల వైసిపి నాయకుడు పిపి నాగిరెడ్డి స్వగ్రామంలో వైసిపి మెజార్టీ సాధించింది. అక్కడ వైసిపికి టిడిపిపై 654 ఓట్ల ఆధిక్యం లభించింది. వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి నివాసం ఉండే పరిసరాల్లో ఓటర్లు కూడా టిడిపికి ఓటేయడం చర్చనీయాంశమైంది.

నంద్యాల విజేత భూమా

నాన్నగారి త్యాగానికి ఓటేశారు : అఖిలప్రియ

నంద్యాల ఉప ఎన్నికల్లో గెలుపు నంద్యాల ప్రజలదే. ప్రతిపక్షపార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, శిల్పా బ్రదర్స్ తమను చిన్న పిల్లలు అనే కనికరం లేకుండా పోటీ పెట్టి దుష్ప్రచారం చేసినా నంద్యాల ప్రజలు నాన్నగారి (భూమా నాగిరెడ్డి) త్యాగానికి ఓట్లేశారు.

ఎన్టీఆర్‌ట్రస్ట్ భవన్‌లో సంబరాలు

నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం (ఎన్టీఆర్‌ట్రస్ట్ భవన్)లో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కల్చి, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అమరనాథ్‌బాబు, కార్యక్రమాల కమిటీ కార్యదర్శి బుచ్చిలింగం తది తరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరనాథ్ బాబు మాట్లాడుతూ నంద్యాల ప్రభావం తెలంగాణ లో కూడా ఉంటుందని అన్నారు.

త్యాగానికి ఓట్లేశారు : భూమా



నంద్యాల ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, తమ చిన్నాన భూమా నాగిరెడ్డి ఆశించిన కలలను నెరవేర్చుతూ నంద్యాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి గెలిపించినందుకు ఓటర్లకూ, టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం : శిల్పా



నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తాం. భూమా నాగిరెడ్డి చనిపోవడం వల్ల ఏర్పడ్డ సానుభూతి, టిడిపి విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయడం వల్ల ఓడిపోయాం. అంతేతప్ప నంద్యాలలో చేసిన అభివృద్ధి వల్ల కాదని అన్నారు.



కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీని పరిశీలిస్తున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయమిశ్రా

నేడు 'కాకినాడ' ఎన్నికల పోలింగ్

పూర్తయిన ఏర్పాట్లు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అధికారులు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో 241 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని పరీక్షించుకోనున్నారు. ఇప్పటికే పోలింగ్‌కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 48 డివిజన్లకు సంబంధించి 2,29,373 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరి కోసం 196 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు 196 ఇవిఎంలను, అదనంగా మరో 20 ఇవిఎంలను రిజర్వులో ఉంచారు. పోలింగ్ కేంద్రాల వద్ద వందమీటర్ల పరిధిలో 144 సెక్షన్ విధించారు. 1,346 మంది పోలీసులను, 8 పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్ట్రైకింగ్ ఫోర్సును సిద్ధంగా ఉంచారు.

విద్యుత్ పంపిణీని ప్రైవేటీకరిస్తే మరో ఉద్యమం

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు
- విద్యుత్ అమర వీరులకు వామపక్ష నేతల ఘన నివాళి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

నీతి ఆయోగ్ సిఫారసు మేరకు విద్యుత్ పంపిణీని ప్రయివే టీకరిస్తే వినియోగదారులపై మరిన్ని భారాలు పెరుగుతాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ సిఫారసులను రాష్ట్రాలపై రుద్ద బోతున్నారన్నారు. ఇది అన్ని రాష్ట్రాలకూ అత్యంత ప్రమాదకరమని, తెలుగు రాష్ట్రాలు ఈ సిఫారసులకు లొంగొద్దని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే బషీర్‌బాగ్ తరహాలో మరో పోరాటం చేపడతామని ఆయన హెచ్చరించారు. విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ చౌరస్తాలోని స్థూపం వద్ద వామపక్షాల నేతలు అమరవీరులకు నివాళులర్పించారు. అమరులు బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిలకు జోహార్లర్పించారు. 2000 సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిన విద్యుత్ విధానాల ఫలితంగా ప్రజలపై పడ్డ భారాలు, వామపక్షాలు, ప్రజా సంఘాలు, ఇతర విపక్షాలు చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఆనాటి పోరాట ఫలితంగా విద్యుత్ ఛార్జీలు పెరక్కుండా, పెంచకుండా చాలా వరకు నిరోధించగలిగామని చెప్పారు. నీతి ఆయోగ్ సిఫారసులు అమలైతే ప్రయివేటు, కార్పొరేట్ శక్తులు పంపిణీ వ్యవస్థను హస్తగతం చేసుకుంటాయని హెచ్చరించారు.



బషీర్‌బాగ్‌లోని విద్యుత్ పోరాట అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి అనంతరం ప్రసంగిస్తున్న రాఘవులు

స్వేచ్ఛను హరిస్తున్న పాలకులు : సురవరం

నాడు చంద్రబాబు ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను ఉక్కు పాదంతో అణచివేసిందని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు ప్రభుత్వాలు నిరసన తెలిపే హక్కులను కూడా హరించి వేస్తున్నాయని విమర్శించారు.

ప్రైవేటీకరిస్తే ప్రతిఘటనే : మధు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి, టిడిపి పాలనలో ప్రైవేటీకరణ వేగం పుంజుకుంటోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం. మధు విమర్శించారు. ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల్లో ప్రతిఘటన ప్రారంభమైందని తెలిపారు. విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభలో ముందుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పాటూరు రామయ్యతో కలిసి మధు అమరవీరులకు పూలమాలల వేసి నివాళులర్పించారు. ప్రస్తుతం భోగాపురం విమానాశ్రయాన్ని, విజయవాడ, విశాఖపట్నం రైల్వే స్టేషన్లను ప్రైవేట్‌కు అప్పజేప్పేందుకు సాగుతున్న చర్యలకు ప్రతిఘటన ప్రారంభమైందని మధు తెలిపారు. దేశంలో పిపిపి పద్ధతిలో ప్రారంభించిన అనేక ప్రాజెక్టులు దివాళా తీస్తున్నాయని వివరించారు. వీటికి పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చిన ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా నేడు దివాళా తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్నీ కార్పొరేటీకరణ చేసేందుకు రైతాంగ విధానాలను ప్రభుత్వం పూర్తిగా మారుస్తోందని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, గిట్టుబాటు ధరలు కల్పించేందుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలని, వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాయన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో అధికార దుర్వినియోగం జరిగిందని, టిడిపి గెలుపు గెలుపు కాదని మధు వ్యాఖ్యానించారు. సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షత వహిస్తూ పరిశ్రమల పేరిట దళితుల భూములను ప్రభుత్వం లాక్కొనేందుకు పూనుకుంటోందని, అమరవీరుల స్ఫూర్తితో పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి కృష్ణయ్య, సిహెచ్ బాబూరావు, ఎంవిఎస్ శర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు బి తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో సిపిఎం రాష్ట్ర కార్యలయంలో విద్యుత్ పోరాట అమరవీరులకు నివాళులర్పిస్తున్న మధు, రామయ్య, తదితరులు

అర్హులైన కార్మికులను నియమించాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్,ఎంప్లాయిస్ రాష్ట్ర ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్, హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో అర్హులైన మున్సిపల్ కార్మికులను నియమించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్,ఎంప్లాయిస్ రాష్ట్ర ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సామ్రాజ్యం, కె ఉమామహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని వివిధ పురపాలక సంఘాలలో ఖాళీగా ఉన్న 582 జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్, హెల్త్ అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీకి గత గురువారం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. శాశ్వత ప్రాతిపదకన కాకుండా, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే పారిశుధ్యం, ఇంజనీరింగ్ తదితర విభాగాల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కార్మికుల్లో ఐటిఐ, పాలిటెక్నిక్, ఫార్మసీ వంటి టెక్నికల్ విద్యార్హత కలిగిన వారు ఉన్నారనీ, వీరంతా వారికున్న విద్యార్హతకు తగినట్టుగా కాకుండా స్వీపర్లు, డ్రైవర్లు, పంపు ఆపరేటర్లుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం భర్తీ చేయనున్న 582 పోస్టుల్లో వీరిని నియమించాలని, అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని కోరారు.

పదోన్నతులు కల్పించడంపై సిఎంకు జెఎసి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తహసీల్దార్లకు, డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించడంపై అమరావతి జెఎసి నాయకులు వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. 43 మంది తహసీల్దార్లకు, సిసిఎల్‌ఎలో పనిచేస్తున్న ఐదుగురు సూపరింటెండెండ్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు జెఎసి నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. 76 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతుగా కల్పించాలని కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పదోన్నతి పొందిన తహసీల్దార్ల స్థానాల్లో రెండు రోజుల్లోగా డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించేందుకు సిఎం సమ్మతించినట్లు పేర్కొన్నారు. ఈ పదోన్నతులకు సంబంధించి మంగళవారం ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అంజు ప్రసాదరావు, కోశాధికారి జి కేశవనాయుడు తదితరులున్నారు.

19 నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సెప్టెంబర్ 19 నుంచి పాఠశాలలకు దసరా సెలవులిస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. సెప్టెంబర్ 11 నుంచి 18 వరకు సమ్మేటీవ్-1 పరీక్షలు జరుగుతాయని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్లకు, జిల్లా విద్యాశాఖాధికారులకు ఎస్సీఈఆర్‌టి డైరెక్టర్ రాజ్యలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక పాఠశాలలకు సెప్టెంబర్ 14 నుంచి 18 వరకు సమ్మే టీవ్ పరీక్షలు జరుగుతాయి. 19 నుంచి దసరా సెలవులిస్తారు. అక్టోబర్ 1 ఆదివారం, అక్టోబర్ 2న గాంధీ జయంతి సెలవులున్నందున అక్టోబర్ 3న తిరిగి పాఠశాలలు ప్రారంభమవుతాయి.

త్వరలోనే విభజన సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర విభజన సమస్యల్ని త్వరలోనే పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనీ (డిఓపిటి) కార్యదర్శి అజయ్ మిట్టల్ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్లో ఏపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉద్యోగుల విభజన, సెక్షన్ ఆఫీసర్ల కేటాయింపు, తెలంగాణకు చెందిన నాలుగో తరగతి ఉద్యోగుల కేటాయింపులు, ఇరు రాష్ట్రాలకు పరస్పర అంగీకార బదిలీలతో పాటు 9, 10 షెడ్యూల్లోని వివిధ సంస్థల విభజనపై ప్రధానంగా చర్చించినట్టు తెలిసింది. ఏపి స్థానికత ఉన్న సెక్షన్ ఆఫీసర్లను తెలంగాణకు కేటాయించారని, వారిని తిరిగి ఏపీకి కేటాయించాలని కోరారు. తెలంగాణ స్థానికత ఉన్న 40 మంది నాలుగో తరగతి ఉద్యోగుల్ని కమలనాథన్ కమిటీ ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిందని, వారిని తిరిగి తెలంగాణకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సిఎస్ ఎస్పీ సింగ్ విజ్ఞప్తి చేశారు. అలాగే తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు పరస్పర అంగీకారంతో బదిలీలు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఇదేసమయంలో పరస్పర అంగీకార బదిలీలకు తాము కూడా సిద్ధమేనని, తమకెలాంటి అభ్యంతరం లేదని ఎపి సిఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఎన్‌సిటిఇని వివరణ కోరిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఉపాధ్యాయ విద్యా సంస్థలు కచ్చితంగా జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సిటిఇ) జారీ చేసే అక్రిడేషన్ పొందాలన్న చట్ట సవరణ నిబంధనను సవాల్ చేసిన వ్యాజ్యాలపై సోమవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. పలు రాష్ట్రాల హైకోర్టుల్లోని ఈ తరహా కేసుల్ని ఢిల్లీ హైకోర్టుకు బదలాయించాలని తాము సుప్రీంకోర్టులో కేసు వేశామని, అందువల్ల ఈ కేసు విచారణ చేపట్టరాదని ఎన్‌సిటిఇ స్టాండింగ్ కౌన్సిల్ కె.రమాకాంత్‌రెడ్డి అభ్యర్థించారు. ఎన్‌సిటిఇ గుర్తింపు తమకు ఉందని, అయితే ఆ వెబ్‌సైట్‌తో తమ విద్యా సంస్థ లింక్ అవ్వాలంటే రూ.1.50 లక్షలు చెల్లించాలనడం అన్యాయమని పిటిషనర్ల లాయర్లు వాదించారు. ఆ మొత్తం చెల్లింపు లేకుండా వెబ్‌సైట్‌తో లింక్ అయ్యే అవకాశం ఉందేమో తెలపాలని ఎన్‌సిటిఇని హైకోర్టు వివరణ కోరింది. ఈ కేసు విచారణ వచ్చే గురువారానికి వాయిదా పడింది.

'వంశధార' నిర్వాసితుల పట్ల నయవంచన



దుగ్గిపురంలో పోలీసు బందోబస్తు మధ్య అధికార యంత్రాంగం చదును చేయించిన పంట భూములు

- పరిష్కారంకాని పునరావాస, పరిహార సమస్యలు
- డి-పట్టా భూములకు జరగని చెల్లింపులు
- పలు కుటుంబాలకు వర్తించని యూత్ ప్యాకేజీ
- సమస్యలను వినేందుకు అవకాశమివ్వని వైనం
- పోలీసు బందోబస్తు మధ్య పనులు
- న్యాయం చేయాలని అడిగిన వారిపై దాష్టీకం

వంశధార ప్రాజెక్టు కోసం సర్వస్వం ధారపోసిన నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తి స్థాయిలో కల్పించడంలో ప్రభుత్వం వంచనకు పాల్పడుతోంది. యూత్ ప్యాకేజీ సమస్యను కూడా పరిష్కరించలేదు. ప్రభుత్వం మాత్రం అన్ని సమస్యలనూ పరిష్కరించినట్లు ప్రకటనలు గుప్పిస్తోంది. నిర్వాసితులకు మరేమీ ఇచ్చేది లేదని తెగేసి చెప్తోంది. సమస్యలు పరిష్కారం కాక ఆవేదనతో ప్రాజెక్టు పనులను అడ్డుకున్న వారిని జైల్లో పెట్టి మరీ పోలీసు బందోబస్తు మధ్య పనులను కొనసాగిస్తోంది. ప్రభుత్వం చెప్తున్న మాటలకు భిన్నంగా క్షేత్రస్థాయి పరిస్థితులున్నాయి. వంశధార నిర్వాసిత గ్రామాల్లో ఒకటైన హిరమండలం మండలం దుగ్గుపురం గ్రామంలో 'ప్రజాశక్తి' పరిశీలనలో అనేక సమస్యలు వెలుగు చూశాయి. డి-పట్టా భూములకు పరిహారం చెల్లించలేదు. యూత్ ప్యాకేజీ చెల్లింపుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయి. గ్రామానికి చెందిన 12 మంది అర్హులైన యువతీయువకులకు వివిధ కారణాలతో డబ్బులను నిలుపుదల చేశారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

హిర మండలం దుగ్గుపురంలో 2006లో ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 430 కుటుంబాలున్నాయి. మరో 12 కుటుంబాలు సర్వేలో నమోదు కాలేదు. సర్వేలో నిర్ధారించిన కుటుంబాలను తరలింపు కుటుంబాలుగా (పిడిఎఫ్) ప్రభుత్వం గుర్తించింది. ఆ కుటుంబాలకు హిరమండలం మండలం సుభలయ్, కొత్తూరు మండలం మెట్టూరు ప్రాంతాల్లో 2009-2010 కాలంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. నివాసయోగ్యంకాని చోట ఇళ్ల పట్టాలివ్వడంతో 570 మంది పట్టాలను తిరస్కరించారు. 60 మంది పట్టాలు అందుకున్నా, వారు ఇళ్లు నిర్మించుకునే స్థోమత లేక దుగ్గుపురంలోనే ఉంటున్నారు. గతంలో ఎవరైతే పట్టాలు తీసుకోలేదో అటువంటి వారందరికీ రూ.ఐదు లక్షలు ఇచ్చి వదిలించుకునేందుకు గతేడాది జులై నాల్గో తేదీన జిఒ నంబరు 460ని విడుదల చేసింది. ఇంటి నిర్మాణానికి గతంలో రూ.53 వేలు ఇచ్చిన వారికి ఆ మొత్తాన్ని మినహాయించి మిగతా రూ.4.47 లక్షలు చెల్లించి చేతులు దులుపుకుంది.

ఇంటి పరిహారంలో వ్యత్యాసం

ఇంటి పరిహారం పంపిణీలో కూడా చాలా వ్యత్యాసాలున్నాయి. పక్కపక్కనే ఒకే విధంగా నిర్మించుకున్న ఇళ్లకు వేర్వేరుగా విలువను నిర్ణయించి పరిహారం చెల్లించారు. ఇటువంటి కారణాలతో ఆ గ్రామంలో 300 మంది డబ్బులు తీసుకోలేదు. డబ్బులు తీసుకునేందుకు ముందుకు వచ్చేలా ఇటువంటి వారిని అధికారులతో ప్రభుత్వం భయపెట్టిస్తోంది. పొలాలను ధ్వంసం చేసినట్టుగానే ఇళ్లను కూడా కూల్చేస్తారంటూ ప్రచారం మొదలు పెట్టించింది. ఆ డబ్బులు కూడా దక్కవనే ఆందోళనతో ఇష్టం లేకపోయినా కొందరు డబ్బులు తీసుకుంటున్నారు.

18 గ్రామాల్లోనూ ఇటువంటి సమస్యలే

నిర్వాసితుల సమస్యలు ఒక్క దుగ్గుపురం గ్రామానికే పరిమితం కాలేదు. వంశధార ప్రాజెక్టుకు సంబంధించి ముంపునకు గురయ్యే మొత్తం 18 గ్రామాల్లోనూ ఇటువంటి సమస్యలున్నాయి. గ్రామాల్లోని నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పైగా, 'మీవి గొంతెమ్మ కోర్కెలు' అంటూ నిందిస్తూ వారి సమస్యలను వినే ప్రయత్నం చేయడం లేదు. మీ సమస్యలన్నీ తీర్చేశామంటూ వారి భూములను స్వాధీనం చేసుకోవడానికి పచ్చని పొలాలను ధ్వంసం చేయడం మొదలుపెట్టింది. అడ్డుకున్న నిర్వాసితులపై హత్యా యత్నం కేసులు నమోదు చేయించింది. భారీగా పోలీసు బలగాలను పెట్టి పనులను సాగిస్తోంది.

కాంట్రాక్టర్లకో నీతి, నిర్వాసితులకు మరో నీతా?

ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని నిర్వాసితులు అంటున్నారు. సమస్యలను పరిష్కరిస్తే స్వచ్ఛందంగా గ్రామాలను తామే ఖాళీ చేస్తామని చెప్తున్నారు. పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం, ప్యాకేజీలు అమలు చేయాలని కోరుతున్నారు. పెరుగుతున్న ధరల పేరుతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం ఎప్పటికప్పుడు పెంచుతూ కాంట్రాక్టర్లకు ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోంది. ప్రస్తుతం భూములు తమ ఆధీనంలోనే ఉన్నప్పటికీ తమకు 2013 భూసేకరణ చట్టాన్ని వర్తింప జేయబోనని ప్రభుత్వం మొండికేస్తోందని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.53 ఇచ్చి చేతులు దులుపుకున్న ప్రభుత్వం



దుగ్గుపురం గ్రామానికి చెందిన భార్యభర్తలు బొమ్మాళి అప్పలమ్మ (75), అప్పయ్య (80) అత్యంత నిరుపేదలైన దళితులు. చట్టం ప్రకారం వీరికి ఇంటి స్థలం ఇచ్చి, ఇంటిని నిర్మించి ఇవ్వాల్సిన ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.53 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంది. వీరికి కొత్తూరు మండలం మెట్టూరు వద్ద ఐదు సెంట్ల స్థలం ఇచ్చింది. ఇంటిని నిర్మించుకోగలిగే ఆర్థిక స్థోమత వీరికి లేదు. వృద్ధులైన వీరికి తన వాళ్లు అంటూ ఎవరూ లేకపోవడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియక దయనీయం గా బతుకుతున్నారు. తమకు ఇచ్చిన ఇంటి స్థలం పట్టా తీసు కుని డబ్బులు ఇచ్చేస్తే మేము మా అక్క అంకమ్మ కొడుకు వద్దకు వెళ్లిపోతామని అప్పలమ్మ తెలిపింది. ఇప్పటికే ఈ విషయమై స్థానిక పెద్దలతో కలిసి రెవెన్యూ అధికారుల వద్ద మొరపెట్టు కుంది. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

నేటికీ అందని ఇళ్ల పరిహారం



ఆమె పేరు ఎం.వరలక్ష్మి. భర్త పున్నయ్య చేపల వేట సాగిస్తున్నారు. వీరికి ఇంటి పరిహారం డబ్బులు ఇప్పటివరకూ అందలేదు. ఇంటి పట్టా తీసుకునేందుకు నిరాకరించిన వీరికి ప్రభుత్వం రూ.4.47 వేలు చెల్లించి చేతులు దులుపుకుంది. వీరికి ఈ డబ్బులు తప్ప, వేరే ఆధారం లేదు. ఆ డబ్బులతో ఎక్కడైనా చిన్న స్థలం కొనుక్కుందామని వెతుకులాట ప్రారంభిస్తే హిరమండలం ప్రాంతంలో ఎక్కడా అంత తక్కువకు స్థలం దొరకడం లేదు. పక్కనే ఉన్న ఎల్ఎన్‌పేట మండలంలో స్థలం చూద్దానికి వెళ్తే సెంటు స్థలం రూ.1.20 లక్షలు చెప్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన కొద్దిపాటి మొత్తంతో ఎక్కడ స్థలం కొంటామని, ఇంటిని ఎలా నిర్మించుకుంటామని వారు వాపోతున్నారు.

జాబితాలో తప్పిపోయిన పేరు



ఆయన పేరు సిహెచ్.తులసీరావు. దుగ్గుపురం గ్రామంలో క్షౌర వృత్తి చేసుకుంటూ బతుకుతున్నాడు. పిడిఎఫ్ కుటుంబంగా ప్రభుత్వం గుర్తించినా ఆయన నివాస గృహం సామాజిక ఆర్థిక సర్వేలో తప్పిపోయింది. దీంతో ఇంటి పరిహారం డబ్బులను ప్రభుత్వం చెల్లించలేదు. వారికున్న ఇద్దరు పిల్లలకూ పద్దెనిమిదేళ్లు నిండకపోవడంతో యూత్ ప్యాకేజీకి అర్హత సాధించలేకపోయారు. ఇంటి స్థలం తీసుకునేందుకు నిరాకరించడంతో ప్రభుత్వం ఇప్పుడు చెల్లించిన రూ.4.47 లక్షలే వీరికి ఆధారం. భార్యా పిల్లలతో కలిసి సరుబుజ్జిలి మండలం శ్యామలాపురం వెళ్లిపోదామనుకున్నామని, తనకు రావాల్సినవి ఇవ్వలేదని, తాము ఎక్కడికి వెళ్లాలని తులసీరావు ప్రశ్నిస్తున్నాడు.

2013 చట్టానికి మేం అర్హులం



భూసేకరణ చట్టం 2013 ప్రకారం పునరావాసం, పరిహారం పొందేందుకు మేం అర్హులం. ఇప్పటివరకూ అదే భూమిని మేం సాగు చేసుకుంటున్నాం. ప్రభుత్వం మాకు రుణాలూ ఇచ్చింది. రుణమాఫీని వర్తింపజేసింది. భూములు మా స్వాధీనంలో ఉన్నాయనే దానికి ఇంతకంటే సాక్ష్యం ఏమి కావాలి. 2013 చట్టం ప్రకారం మాకు అన్ని రకాల సౌకర్యాలూ కల్పించాలి.

– టి పోలినాయుడు, దుగ్గుపురం రైతు

భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఐఎన్ఎస్ కళింగ ఆటంకం

నౌకాదళ విస్తరణకు సురక్షిత మార్గంగా గోస్తనీ పరివాహకం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ-విజయనగరం సరిహద్దు ప్రాంతం భోగాపురంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించేందుకు సిద్ధమైన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతు న్నాయి. భీమునిపట్నంలో ఉన్న ఐఎన్ఎస్ కళింగ (భారత రక్షక దళం) రూపంలో ఆటంకం ఎదురవుతోంది. ఇప్పటి వరకూ భూసేకరణ సమస్యలు, పర్యావరణ అనుమ తులకే పరిమితమైన ఎయిర్‌పోర్టు వ్యవహారం తాజాగా వీటన్నింటినీ ఛేదించుకున్నా నిర్మాణ ఏర్పాట్లకు మాత్రం అవరోధాలు ఎదురవుతున్నాయి. తూర్పునా వికాదళం (ఈస్టర్న్ నేవల్ కమాండ్)కు భారత నావికాదళం (ఇండియన్ నేవీ) ఇప్పటికే గోస్తనీ పరివాహక ప్రాంతం అంటే విజయనగరం జిల్లా తాటిపూడి, విశాఖ జిల్లా తగరపువలస ప్రాంతాల్లోని సువిశాల మైన 2వేల ఎకరాలు తీసుకుని నావికాదళ రక్షణ, విస్తరణ పనుల కోసం రిజర్వు స్థలాన్ని ఉంచుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం భారత నావికాదళానికి టార్పెడోల నిర్మాణాన్ని నదీపరివాహక ప్రాంతాల్లో చేపట్టాలని ఆదేశాలు తాజాగా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో భోగాపురంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగే ప్రదేశమంతా గోస్తనీ పరివాహక ప్రాంతం కావడంతో విదేశీ విమానాల రాకపోకలు సాగించి పైకి ఎగిరే సందర్భాల్లో భారత రక్షక దళ రహస్య స్థావరాలు, సాధన సంపత్తికి మంచిది కాదన్న సంకేతాలను నావికాదళం నుంచి ఎయిర్‌పోర్టుకు అభ్యంతరాలు వెళ్లాయి. దీంతో ఎయిర్‌పోర్టుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలు స్తోంది. రక్షణ దళ స్థావరాలున్న చోట విమానాలు ఎగిరేందుకు అనుమ తులు లభించే వీలులేనందున భోగాపురం ఎయిర్‌పోర్టుకు టెక్నికల్‌గా ఆమోదం లభించినా క్షేత్రస్థాయిలో అవస్థలు తప్పవన్నది తెలుస్తోంది.

పర్యావరణ అనుమతులతో పని ప్రారంభం కాదు

పర్యావరణ అను మతు లిచ్చినంత మాత్రాన భోగాపురంలో గ్రీన్‌ఫీల్డు ఎయిర్ పోర్టు రాదని ఎయిర్ ట్రావెలర్స్ అసోసి యేషన్ జాతీయ అధ్యక్షులు (ఎటిఎ) డి.వరదారెడ్డి వెల్లడించారు. విశాఖ రన్‌వేను మరో 100 మీటర్లు పొడిగించే ఏర్పాట్లు, అలాగే ఎయిర్ పోర్టు విస్తరణను ఇప్పుడున్న దాన్నుంచీ 150 మీటర్లు (450 అడుగులు) పొడిగించడానికి ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా విశాఖ విమానా శ్రయాన్ని పొడిగించడానికి అనుమతులను తాజాగా ఇచ్చిందన్నారు. ప్రధానంగా భారత నౌకాదళం (ఇండియన్ నేవీ)కి సంబంధించిన కీలక రక్షణ స్థావరాన్ని టార్పెడాల నిర్మాణానికి గోస్తనీ పరివాహక ప్రాంతంలో వేల ఎకరాల కోసం కేంద్రాన్ని కోరగా అనుమతులు లభించడంతో భోగాపురం ఎయిర్‌పోర్టుకు టెక్నికల్ పీజిబిలిటీ లేదని పేర్కొన్నారు.

భూసేకరణపై రాష్ట్ర హైకోర్టు స్టే

2013 భూసేకరణ చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పునరావాస చర్యలను చేపట్టలేదు. హైకోర్టు స్టే ఉండడమే కారణం. బలవంతపు భూసేకరణ వద్దు అని కోర్టు హెచ్చరించింది. దీంతో 2,680 ఎకరాల్లో కీలకమైన భూమిని కూడా ఇంతవరకూ ప్రభుత్వం సేకరించలేకపోయింది. ఎయిర్ పోర్టు నిర్మాణం జరిగే పరిసరాల ప్రజలు నేటికీ సహకరించకపోవడమే దీనికి కారణం. అంతేగాక.. టెక్నో ఎకమిక్ ఫీజిబిలిటీ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకూ కేంద్రానికి పంపలేదు.



భోగాపురం ఎయిర్ పోర్టు వచ్చే ప్రాంగణం ఇదే..

'ఉప్పు'టేరు హాంఫట్!

- 79.4 ఎకరాల సర్కారు భూములు మాయం
- 2010 నిషేధిత ఆస్తుల జాబితాలో ప్రభుత్వ భూమిగా గుర్తింపు

ప్రజాశక్తి- పరవాడ (విశాఖ)

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ జిల్లాలోని పరవాడ మండలంపై రియల్టర్ల కన్ను పడింది. కొండలు, వాగులు, అసైన్డ్, బంజరు భూములనూ వదలడం లేదు. రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రభుత్వభూములు యధేచ్ఛగా జిరాయితీ భూములుగా మారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఉప్పుటేరు సైతం జిరాయితీ భూమిగా మారిపోయింది. ఈ ప్రభుత్వ భూమి రికార్డుల మార్పు కుంభకోణం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ భూ కుంభకోణం వెనుక అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ఉన్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ జరిగే భూ కుంభకోణాలపై సిపిఎం మినహా ఇతర ఏ పార్టీ కూడా సిట్‌కు ఫిర్యాదు చేయలేదు.

పరవాడ మండలంలోని చీపురపల్లి, పశ్చిమఖండం రెవెన్యూల పరిధిలోని 123 నుంచి 129 వరకు సర్వేనెంబర్లు, 470 నుండి 478 వరకు సర్వేనెంబర్లలో ఉప్పుటేరు సముద్రతీరానికి విస్తరించి ఉంది. ఇ.భోనంగి, దేశపాత్రునిపాలెం, పరవాడ, తానాం, బర్నికం, ధర్మారాయుడుపేట, దేశపాత్రునిపాలెం, పిభోనంగి, కలపాక, రెవెన్యూ గ్రామాల్లో విస్తరించి ఉన్న కొండలపై నుండి చిన్న చిన్న గెడ్డలు, వాగుల ద్వారా వర్షపు నీరంతా ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తుంది. 2010లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జిఒఎంఎస్ నెంబర్ 1093 రెవెన్యూ (ఆర్ఇజి-1)14-8-2007, జిఒఎంఎంఎస్ నెంబర్ 1250 రెవెన్యూ (ఆర్ఇజి-1) 27-9-2007 ప్రకారం ఇవి ఉప్పుటేరు భూములుగా చూపించి ఎటువంటి అమ్మకాలూ, కొనుగోలు చేయడానికి వీల్లేదని, ప్రభుత్వ భూములుగా గుర్తిస్తూ నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చింది. 2011లో నాటి పరవాడ తహశీల్దారు ఎస్వి.రమణమూర్తి, అప్పటి పశ్చిమఖండం గ్రామ విఆర్ఒ కూంద్రపు శ్రీనివాస్ ఈ సర్వే నెంబర్లలోని భూములు ఉప్పుటేరుకు చెందిన భూములుగా భూ స్థితిని నిర్ధారిస్తూ ఎస్ఆర్ నెంబర్ 60/11/ఎస్ఎ/3-9-2011తో ఆర్‌టిఐ యాక్ట్ కింద దరఖాస్తులు చేసిన వారికి సమాధానం ఇచ్చారు.



భారత రక్షణ శాఖకు చెందిన స్థావరాలకు ఆనుకొని ప్రవహిస్తున్న ఉప్పుటేరు

నేడు జిరాయితీ భూమిగా వెబ్ ల్యాండ్‌లో దర్శనం

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భూములన్నీ ప్రయివేటు భూములుగా మారిపోయాయి. చీపురపల్లి, పశ్చిమ ఖండం రెవెన్యూల పరిధిలోని 123 సర్వేనెంబరులో 1.91 ఎకరాలు, 124లో 1.88, 125లో 2.05, 126లో 2.06, 127లో 2.03, 128లో 2.01, 129లో 2.56, 470లో 7.59, 471లో 4.89, 472లో 6.23, 473లో 7.92, 474లో 6.65, 475లో 8.32, 477లో 10.99, 478లో 12.5 ఎకరాల భూములన్నీ ప్రయివేటుపరమయ్యాయి. ఈ కాలంలో వచ్చిన తహశీల్దార్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేసి ప్రయివేటు వ్యక్తులకు అనుకూలంగా మార్పు చేసినట్లు పలువురు ఆరోపిసుతన్నారు. ఈ భూములను ప్రస్తుత తహశీల్దారు పిఎవిఎస్.మల్లేశ్వరరావు 2016 నిషేధిత ఆస్తుల జాబితాలో చూపించలేదు. ఉప్పుటేరు భూములు ఓ వ్యక్తి పేరుతో జిరాయితీ భూమిగా వెబ్‌ల్యాండ్‌లో ప్రత్యక్షమయ్యింది. ఈ భూములను అమ్ముకొని సొమ్ము చేసుకొనేందుకు ఆక్రమణదారులు సమాయమత్తమయినట్లు సమాచారం. ఈ భూములను చూపించి బ్యాంకుల నుంచి రుణాలు పొందే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

జీవనాధరం కోల్పోనున్న మత్స్యకారులు

ఏడాది పొడవునా నిరంతరం ప్రవహించే ఈ ఉప్పుటేరు ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడింది. దీనిపై ఆధారపడి వేలాది మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇందులో విలువైన రొయ్యలు, పీతలు, చిన్నచిన్న చేపలు దొరుకుతాయి. ఇది ప్రయివేటు వారి చేతుల్లోకి వెళ్లిపోతే మత్స్యకారులు జీవనాధారం కోల్పోతారు. రియల్ వ్యాపారులు దీనిని పూడ్చివేస్తే సమీపంలోని గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.

భారత రక్షణ స్థావరానికి ప్రమాదం

ఉప్పుటేరుకు ఆనుకొని భారత రక్షణ శాఖకు చెందిన స్థావరాలు ఉన్నాయి. సముద్రమార్గంలో ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి ముంబయిలో కాల్పులు జరిగిన తర్వాత, భవిష్యత్తులో అటువంటి పరిస్థితి లేకుండా ఉండేందుకు ఈ స్థావరాన్ని రక్షణ శాఖ ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఈ భూములు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే రక్షణశాఖ స్థావరాలకు ముప్పు ఏర్పడనుందని నిపుణులు భావిస్తున్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులు

సహజ సిద్ధంగా ఏర్పడిన చెరువులు, గెడ్డలు, పందలు, గోర్జులు, సెలఏర్లు, ఉప్పుటేర్లను అలాగే ఉంచాలని, వాటిని ఏ విధంగా మార్పు చేయరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ భారీ కుంభకోణంపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టి దీని వెనుక ఉన్న వ్యక్తులు, సంస్థలను గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అవి ప్రభుత్వ భూములే...

చీపురపల్లి, పశ్చిమ ఖండం రెవెన్యూల పరిధిలోని 123 నుంచి 129, 470 నుండి 478 వరకు సర్వేనెంబర్లలో ఉన్న భూములు ప్రభుత్వ భూములే. ఇందుకు సంబంధించి తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్తాం.

ఆర్.భాగ్యలక్ష్మి, పరవాడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

తాగునీటి సరఫరా నిర్వహణ ప్రయివేటుకు

గుంటూరులో వేగంగా అడుగులు

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

గుంటూరులో తాగునీటి సరఫరాను ప్రయివేటు ఏజన్సీకి అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. నిర్వహణా ఖర్చులు తగ్గింపు సాకుతో తాగునీటి సరఫరాని ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడం చర్చలకు దారితీస్తోంది. ఇప్పటికే శివారు ప్రాంతాలు తాగునీరందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రయివేటుకు అప్పగిస్తే మరింత ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. ఇప్పటికే విద్యుత్ పంపిణీ ప్రయివేటుకు అప్పగించారు. అనేక ప్రాంతాల్లో కనీసం వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులందినా స్పందన అంతంత మాత్రమే. 279 జిఒ ద్వారా పారిశుధ్యం నిర్వహణా ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పచెప్పడానికి ప్రభుత్వం పూనుకుంది. 24 గంటలూ తాగునీరందిస్తామని నగరపాలక సంస్థ ప్రతి పనికీ సేవల రూపంలో ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేయడానికి పూనుకోవడం దుర్మార్గం. దీనికి వ్యతిరేకంగా ఉద్యమించడానికి సిద్ధమవుతున్నట్లు సిపిఎం గుంటూరు నగర కార్యదర్శి ఎన్. భావన్నారాయణ తెలిపారు.

అంతర్ రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

64 దుంగలు పట్టివేత

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

ఎర్రచందనం అక్రమ రవాణా చేసే 21మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు ఎస్‌పి పిహెచ్‌డి రామకృష్ణ తెలిపారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రాపూరు, కలువాయి, అనంతసాగరం అటవీ ప్రాంతాల్లో ఏక కాలంలో దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఆయన సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అందులో భాగంగానే ఇటీవల టాస్క్‌ఫోర్స్ సిబ్బం దిని ఏర్పాటుచేశామన్నారు. వీరి అధ్వర్యంలోనే దాడులు జరిగాయని తెలిపారు. స్మగ్లర్లనుంచి రూ. కోటి విలువైన 64 ఎర్రచందనం దుంగలు, రెండు నాటు తుపాకులు, రెండు ట్రాక్టర్లు, ఆటో, కారు, ఏడు మోటారు బైకులు, 13 సెల్‌ఫోన్లు, రూ.5030 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అరెస్టయిన వారిలో పంగలి గ్రామానికి చెందిన మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్స్ సంగటి సుబ్బయ్య, దాదినేని సుబ్బయ్య, మరికొందరు ఉన్నారని తెలిపారు.

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస రూరల్ (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా పలాస మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన దొక్కరి చిన్నయ్య (55) సోమవారం కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. ఏడాదిగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. పలాస, శ్రీకాకుళం, విశాఖలోని పలు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందాడు. అయినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి మృతి చెందాడు.

ఘనంగా 'కన్యాశుల్కం' 125 ఏళ్ల ఉత్సవం

గురజాడ గృహాన్ని సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం : మంత్రి గంటా



గురజాడ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- విజయనగరం కోట

నవయుగ వైతాళికుడు, మహాకవి గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటకం ప్రదర్శించి 125 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయనగరంలో సోమవారం కన్యాశుల్కం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్, పలువురు ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు సత్యాలాడ్జి జంక్షన్ నుంచి గురజాడ స్మారక గృహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. సాహితీవేత్తలను, గురజాడ కుటుంబీకులు గురజాడ ప్రసాద్, ఇందిర తదితరులను సన్మానించారు. గురజాడ గృహాన్ని, ఆయన వినియోగించిన వస్తువులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాటి సాంఘిక దురాచారాలకు, విద్యావ్యవస్థకు కన్యాశుల్కం అద్దం పట్టిందన్నారు. రాబోయే తరాల వారు ఆనాటి పరిస్థితులను తెలుసుకునేందుకు గురజాడ గృహాన్ని సాంస్కృతిక కార్యక్రమాల కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచానికి గురజాడ రచనలు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి, ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే గీత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సిఎం నియోజకవర్గంలో 27 మంది విద్యార్థులకు అస్వస్థత

గురుకుల పాఠశాలలో బల్లి పడిన అల్పాహారం తినడమే కారణం

ప్రజాశక్తి - రామకుప్పం

సిఎం చంద్రబాబు నియోజకవర్గంలో బల్లి పడ్డ అల్పాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం మిథులాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. ఉపాధ్యాయుల కథనం మేరకు.. ఎపిఎస్ డబ్ల్యుఆర్ మోడల్ స్కూల్లో 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. యథావిధిగా సోమవారం ఉదయం ప్రార్థనాంతరం టిఫిన్ తినడానికి విద్యార్థులు ఉపక్రమించారు. ఇంతలోనే కొంత మంది విద్యార్థులకు కడుపునొప్పి రాగా, మరి కొందరు వాంతులు చేసుకోవడం ప్రారంభించారు. అల్పాహారంగా పెట్టిన టమోటాబాత్‌లో బల్లి పడి ఉండటాన్ని విద్యార్థులు గమనించి చెప్పడంతో పాఠశాల ప్రిన్సిపల్ దామోదర్ 108కు సమాచారం అందించారు. విద్యార్థులను మిథులాపురం పిహెచ్‌సికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదమేమీ లేదని, ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

'తూర్పు'లో శాసనసభ గిరిజన సంక్షేమ కమిటీ పర్యటన

వినతిపత్రాల స్వీకరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, రంపచోడవరం

శాసనసభ గిరిజన సంక్షేమ కమిటీ తూర్పుగోదావరి జిల్లాలో సోమవారం పర్యటించింది. తొలుత రాజమహేంద్రవరం చేరుకున్న కమిటీ చైర్మన్ మోడెం శ్రీనివాసరావు, సభ్యులు కె.రత్నాభాయి, వి.రాజేశ్వరిదేవి, వి.బాలసుబ్రహ్మణ్యం, రాము సూర్యారావు స్థానిక లాహాస్పిన్ హోటల్‌లో కాసేపు బస చేశారు. అనంతరం రంపచోడవరం వెళ్లి, ఐటిడిఎ సమావేశపు హాల్లో గిరిజనుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. గిరిజన విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.పవన్ వినతిపత్రం అందించారు. విద్యార్థుల సమస్యలను కమిటీకి వివరించారు. గిరిజన సంఘం డివిజన్ ఉపాధ్యక్షులు తెడ్ల అబ్బాయి, డివిజన్ కమిటీ సభ్యులు ఎం.వాణిశ్రీ ఆధ్వర్యాన కమిటీకి వినతిపత్రం అందించారు. గిరిజన గ్రామాల్లో నేటికీ మౌలిక వసతులు లేవని, రోడ్లు, రవాణా, అనారోగ్య సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని వారి దృష్టికి తీసుకెళ్లారు. అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరారు. మలేరియా, టైఫాయిడ్, ఇతర వ్యాధుల వల్ల సంభవిస్తున్న మరణాలను నిలువరించే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మోడెం శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తక్షణం కృషి చేస్తామన్నారు. విభాగాల వారీగా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం ఈ కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన చేయనుంది.

సంపాదకీయం

నేరము - శిక్ష

ప్రజల ఆర్థిక, మానసిక బలహీనతలను సొమ్ము చేసుకునేందుకు బాబాలు, స్వాములు పుట్టుకొస్తుండగా, వారికి రాజకీయ, స్వప్రయోజనాల కోసం అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నాయనడానికి డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ ఉదంతం ఒక ఉదాహరణ. పలువురు బాబాలు, స్వాములు దొరకనంత వరకే దొరలు. దొరికితేనే వారి నేర గాథలు, చీకటి మాటు వెకిలి చేష్టలు బయల్పడుతున్నాయి. నిన్న మొన్నటి వరకు గుర్మీత్ సేవా తత్పరుడు. అపర సామాజిక కార్యకర్త. సినిమా హీరో. వ్యాపారవేత్త. స్వయంగా ప్రధాని మోడీనే గతంలో గుర్మీత్‌ను పొగిడారు. మోడీ, అమిత్‌షా ఆశీస్సులతో 2014లో హర్యానా సిఎం అయిన మనోహర్‌లాల్ ఖట్టర్, ఆయన ప్రభుత్వంలోని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, బిజెపి నాయకులు గుర్మీత్‌కు సాగిలపడినవారే. అందుకే గుర్మీత్ అరెస్టు అనంతరం ఆయన అనుచరులు తీవ్రమైన హింసాకాండకు పాల్పడినా చోద్యం చూశారు. మతం, విశ్వాసం పేరుతో హింసను సహించేది లేదని ప్రధాని మోడీ చేసిన ఉద్బోధ ప్రజలను మభ్యపెట్టడానికే. ఆర్‌ఎస్‌ఎస్, హిందుత్వ వాదుల ఆగడాలకు మద్దతిస్తూ ఆ ప్రకటన చేస్తే ఎవ్వరూ విశ్వసించరు.

ఇద్దరు మహిళలపై అత్యాచారం కేసులో డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు ఊహించినట్లుగానే శిక్ష ఖరారైంది. రెండు వేర్వేరు కేసుల్లో హర్యానాలోని పంచకుల సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం పది, పది మొత్తం ఇరవై ఏళ్ల కారాగార శిక్ష, రూ.30 లక్షల జరిమానాలను సోమవారం విధించింది. జైలు శిక్ష ఏక కాలంలో అనుభవించాలనడంతో పదేళ్లు డేరా బాబా జైలు ఊసలు లెక్కించాలి. కేసులు నమోదైన పదిహేనేళ్ల తర్వాతైనా గుర్మీత్‌కు కఠిన శిక్ష పడటం చట్టంపైనా, న్యాయ వ్యవస్థపైనా ప్రజల్లో కొంతైనా విశ్వాసం పాదుకొల్పింది. మహిళలపై అత్యాచారాలకు, లైంగిక వేధింపులకు పాల్పడే నేరస్తులకు భయం వస్తుంది. మన వ్యవస్థలో కింది కోర్టులు ఇచ్చిన తీర్పులపై ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీలు చేసుకునే వెసులుబాటు ఉన్నందున అన్ని హంగులూ కలిగిన గుర్మీత్ కచ్చితంగా పైకోర్టులకు వెళతారు. గుర్మీత్‌పై 2002లో నమోదైన కేసులపై 2017లో తీర్పు వచ్చింది. పై కోర్టులకెళితే కేసు ఏమవుతుందో, ఇంకా ఎన్నేళ్లు పడుతుందో చెప్పలేం. అందుకే కక్షిదారులకు సత్వర న్యాయం జరిగేలా ప్రభుత్వాలు, న్యాయ వ్యవస్థ ఆలోచించి ఆ దిశగా చర్యలు చేపట్టాలి. వాస్తవానికి గుర్మీత్‌పై కేసుల నమోదు జరిగింది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వల్ల కాదు. 'డారా'లో చేరిన ఒక మహిళా బాధితురాలు లోపల జరుగుతున్న అకృత్యాలపై రాసిన లేఖ స్థానిక ఒక పత్రికలో ప్రచురితం కావడంతో లోగుట్టు లోకానికి తెలిసింది. వార్త రాసిన పాత్రికేయుడిని హత్య చేశారు కూడా. మహిళలపై అత్యాచారం కేసును హర్యానా హైకోర్టు సిబిఐకి అప్పగించింది. హైకోర్టు ఆదేశాలే లేకపోతే కేంద్రంలో, రాష్ట్రంలో ఏలిన, ఏలుతున్న ప్రభువులు గుర్మీత్ దారుణాలను పట్టించుకునేవారే కాదు. వారి అండతో బాబా ఏంచక్కా తన దుర్మార్గాలను యధేచ్ఛగా కొనసాగించేవారే.

శుక్రవారం గుర్మీత్‌ను సిబిఐ కోర్టు దోషిగా పేర్కొన్న మరుక్షణం నుంచి హర్యానాలో బాబా అనుచరులు సృష్టించిన హింసోన్మాదానికి ఏకంగా 38 మంది ప్రాణాలు కోల్పోవడం అతి పెద్ద విషాదం. సిబిఐ కోర్టు కొలువు తీరిన పంచకులలోనే 28 మంది మరణించారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు బాబా గణాల చేతుల్లో ధ్వంసమయ్యాయి. ఘర్షణలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత. గుర్మీత్ 'డేరా' వ్యవహారాలు ప్రభుత్వాలకు తెలియనివి కావు. పైగా ప్రభుత్వాధినేతలు ఆయన పాద సేవలో తరించినవారే. ఒక నిందితుడు వందలాది కార్లతో కాన్వాయిగా కోర్టుకెళుతున్నా బిజెపి ఏలుబడిలోని హర్యానా సర్కారు చూస్తూ ఊరుకుంది. పంచకులకు వేలాది మంది బాబా అనుచరులు మారణాయుధాలతో వాహనాల్లో తరలి వచ్చినా చోద్యం చూసింది. సిర్సాలోని బాబా ప్రధాన కేంద్రంలో లక్ష మందికి పైగా తిష్ట వేసినా ప్రభుత్వానికి, పోలీసులకు తెలియదంటే ఎవ్వరూ నమ్మరు. హర్యానా సర్కారు ఉద్దేశపూర్వకంగానే బాబా అనుచరులకు లోబడిందని అర్థమవుతూనే ఉంది. హైకోర్టు సైతం ఘర్షణలపై ఇదే అభిప్రాయం వెలిబుచ్చి ఆగ్రహం చెందడం గమనార్హం. కేంద్రం సకాలంలో స్పందించకపోవడంపై ప్రధాని దేశానికి ప్రధాని తప్ప బిజెపికి కాదని కోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. హెలికాప్టర్‌లో జైలుకు గుర్మీత్ తరలించాల్సి వచ్చిందంటే, సిబిఐ కోర్టు న్యాయమూర్తి జైలులోనే విచారణ జరపాల్సి వచ్చిందంటే హర్యానాలో శాంతి, భద్రతలు ఎంతగా దిగజారాయో తెలుస్తుంది. ఖట్టర్ సిఎం అయ్యాక రాంపాల్ బాబా అరెస్టు సమయంలో చెలరేగిన అల్లర్లలో ఆరుగురు మరణించారు. జాట్‌ల రిజర్వేషన్ ఆందోళనల్లో 30 మంది చనిపోయారు. ఇప్పుడు గుర్మీత్ అనుచరుల హింసకు 38 మంది మృతి చెందారు. వరుసగా మూడు వైఫల్యాలు మూటగట్టుకున్నా బిజెపి అధినాయకత్వం ఖట్టర్‌ను మార్చేది లేదని తేల్చిపారేసింది. దానర్థం బిజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశానుసారమే ఖట్టర్ పని చేస్తున్నారనేగా? సాక్షి మహరాజ్ వంటి పలువురు సంఘ్ పరివార్ నేతలు ఇప్పటికీ గుర్మీత్‌ను బలపరచడం దాన్నే తెలియజేస్తోంది.

మహనీయుల మాట



దేశ భాష ద్వారా విద్య బోధిస్తే అందరికీ ప్రయోజనం.


\- గిడుగు రామమూర్తి

(నేడు గిడుగు జయంతి)

ఓట్లు అమ్మొద్దు

ప్రజాగళం

ప్రజాస్వామ్యం పరిరక్షించుకునేందుకు మనకున్న ఏకైక ఆయుధం ఓటు. కానీ నేడు ధనం, దాదాగిరి, సీసా, పైసాల చుట్టూ పరిభ్రమిస్తున్న నయా రాజకీయం ఓటును అంగడి సరుకుగా మార్చేసింది. ఇక ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు గెలిచేందుకు ఎంత ఖర్చుకైనా వెనుకాడటం లేదు. ఎమ్మెల్యే నుంచి కార్పొరేటరు వరకు పదవి ఏదైనా కోట్ల రూపాయలు చేతులు మారాల్సిందే. మరి ఇంత ఖర్చు పెట్టినవాడు రేపు ప్రజలకు అందుబాటులో ఉంటాడన్న నమ్మకం ఉందా? ఖర్చు పెట్టిన దానికి ఎన్నో రెట్లు సంపాదించడమే లక్ష్యంగా చేసుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడడమే నేటి నాయకులకు రివాజయ్యింది. గెలిపించిన ప్రజల కనీస అవసరాలను పట్టించుకోవడం ఎప్పుడో మానేశారు. వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పాలవుతున్నా, కుళాయిల్లో మంచినీరు రాక అవస్థలు పడుతున్నా, కాలువల్లో చెత్త పేరుకుపోయినా సమస్య ఏదైనా కానీ ఫిర్యాదు చేస్తే పట్టించుకొనే స్థితిలో వారుండరు. ఓటును అమ్ముకోవడం వల్లే మనకీ దుస్థితి దాపురించిందని ఇకనైనా గుర్తిద్దాం. అయిదేళ్ల మన భవిష్యత్తును మనమే తాకట్టు పెట్టడం ఎంత వరకు సమంజసమో ఆలోచిద్దాం. ఓటును అమ్ముకొంటే నిలదీసి ప్రశ్నించే అధికారానికి నీళ్ళొదులుకొన్నవారమౌతాం. మన ఓట్లే బాకులై అవినీతిపరులపై వేటు వేయాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తుంది.



డాక్టర్ సీదిరి అప్పలరాజు
కాశీబుగ్గ, శ్రీకాకుళం జిల్లా.

ఆలోచించాలి


ట్రిపుల్ తలాక్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఎంతో ఆలోచించాల్సిందిగా వుంది. ఇది ఒక మతపరమైన విషయం. పైగా దీని వలన దేశ వ్యాప్తంగా బాధ పడిన వారి సంఖ్య చాలా తక్కువ. అసలు 'ట్రిపుల్ తలాక్' అనేది ఖురాన్‌లో లేదన్న వాదన నిజమే అయ్యుండొచ్చు. ఎందుకంటే హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీతలో లేని, చెప్పని విషయాలు ఎన్నో నేటి హిందూ వివాహ చట్టంలో పొందుపర్చారు. వివాహ సమయంలో జరిగే తంతు అంతా గమనిస్తే బలవంతంగా వధూవరుల చేత అవన్నీ చేయిస్తున్నారేమో అనిపించక మానదు. ఇదంతా ఒక మూఢనమ్మకం, ఆధిపత్య ధోరణి కాక మరేమిటి? అంటే సదరు ప్రజానీకం పాటించే మతాచారాలన్నీ వారి పవిత్ర గ్రంథాల్లో లేవు. అంటే సౌలభ్యాల కోసమే ఎవరికిష్టమొచ్చినట్లు వారు మార్పులు చేర్పులూ చేసుకున్నారనేది తేలిపోయింది. ఇదిలా వుంటే అసలు కోర్టులో తలాక్‌పై పిటిషన్లు ఎప్పుడు వేశారు? ఏ ప్రాతిపదికను ఆధారం చేసుకొని వేశారు? నష్టపోయిన ముస్లిం మహిళల శాతం ఎంత? ఒక రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతే పిటిషనర్లకు ఆలోచన వచ్చిందా? అసలు కారణాలు ఏమిటి? అందుకే శాస్త్రీయంగా ఆలోచించే మన న్యాయస్థానాలు హిందూ వివాహ చట్టాలను కూడా అధ్యయనం చేయాలి.



కొసనా మధు సూదనరావు, రోళ్ళపాలెం, అమలాపురం

మౌనమేల నితీషా !

నితీష్ కుమార్ బీజేపీతో జతకట్టి అధికారంలో కూర్చొని వారం కూడా గడవక ముందే బీహార్‌లో సంఘ పరివారం రెచ్చిపోతోంది. గత ఆగస్ట్ 3న పాట్నాలో పెట్రోల్ బంకులో ఆగి వున్న లారీని గోరక్షక దళం అటకాయించింది. అంతేకాక అందులోని ముగ్గురు వ్యక్తులను చితకబాదింది. ఆ లారీలో గోమాంసం ఎక్కడికో రవాణా చేస్తున్నారని వారి సందేహం. చావు దెబ్బలు తిన్నది మైనారిటీ మతస్థులు. వీరి చొరవ చూసి విశ్వ హిందూ పరిషత్(విహెచ్‌పి) వారు తాము మాత్రం ఎందుకు తగ్గాలి? అనుకున్నట్లున్నారు. అందుకే గోమాంసం తినేవారికి తగిన బుద్ధి చెప్పాలని రంగంలోకి దిగారు. అనుకున్నదే ఆలస్యం ఆ రాష్ట్ర పశ్చిమ చంపారణ్ జిల్లాలో ఇంటింటా చొరబడి గోమాంసం తినే ఆరు కుటుంబాల వారిని నిర్దాక్షిణ్యంగా చితకబాదారు. ఈ సంఘటన ఈ నెల 17వ తేదీన జరిగింది. నితీష్, బీజేపీ చెట్టాపట్టాల్ తరవాత నెలలోపే బీహార్‌లో ఇది రెండో సంఘటన. విహెచ్‌పికి చెందిన గోరక్షక సైన్యానికి చెందిన సాయుధ గూండాలు మైనారిటీల ఇళ్ళల్లో చొరబడి తాండవం చేస్తున్నారు. అయినా పోలీసులు వారినెవరినీ అదుపులోకి తీసుకోలేదు. ఇంకా చెప్పాలంటే బాధిత మైనారిటీ ప్రజలనే ఠాణాలకు తీసుకెళ్ళారు. పైగా వారికి భద్రత కల్పించేందుకే ఇలా చేశామని వాదిస్తున్నారు. ఈ వాదన ఎంతమాత్రమూ నమ్మశక్యంగా లేదు. 2015 సెప్టెంబరులో దాద్రీ సంఘటన జరిగినప్పుడు బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్ కుమారే ఉన్నారు. ఆ సంఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. అంతేకాక ప్రధాని మోడీ మౌనాన్ని పరిహసిస్తూ వ్యంగ్య బాణాలనూ సంధించారు. అప్పుడు ఆయన బీజేపీకి పచ్చి వ్యతిరేకి. ఇప్పుడేమో అత్యంత ప్రియ మిత్రుడు. అందుకే నేడు స్వంత రాష్ట్రంలోనే గోరక్షకులు తాండవ లీలలు కనిపిస్తున్నా అప్పటి నరేంద్రుని మౌనాన్నే తానూ అనుసరిస్తున్నారు. అయితే ఈ సంఘటనలపై బీహార్ ప్రతిపక్షం తీవ్ర అసంతృప్తితో వుంది. బీహార్ కూడా ఉత్తర్ ప్రదేశ్ బాట పట్టిందా? అన్న ఆందోళనలో వారు వున్నారు. దేశంలో జరుగుతున్న ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తే మనకు ఒక విషయం అర్థమౌతుంది. గోరక్షకులు చేస్తున్న హింస, దాడులన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయి. అయితే బాధ్యత వహించాల్సిన ప్రధాని వీటిని నివారించే పని రాష్ట్రాలపైకి నెట్టేసి చేతులు దులిపేసుకున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం చేసేదేమి లేదన్నట్టు పోజు పెట్టారు. ప్రధాని అలా వుంటే ముఖ్యమంత్రులెలా వుంటారు? అందుకే నితీష్ మౌనం వహించారు. కానీ ఎన్నాళ్ళు ఇలా మౌనంగా ఉండగలరు నితీష్? బీహార్ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీదే!



వేదుల రామకృష్ణ

ప్రజల భాషలో పరిపాలిస్తేనే మనవి తెలుగు రాష్ట్రాలు!

డా॥ సామల రమేష్‌బాబు



సందర్భం

ఆగస్టు 29 అనగానే గిడుగు వేంకట రామమూర్తి పంతులు గుర్తుకొస్తారు. ఈ రోజు ఆయన జయంతి. 1940కి ముందు దాదాపొక అర్థ శతాబ్దం పాటు జరిగిన వ్యావహారిక/వాడుక భాషోద్యమానికి ఆయనే కీలకం. అయితే ఆయనకు ముందే స్వామినీని ముద్దునరసింహం నాయుడు తన 'హిత సూచని'లో వాడుక భాషోద్యమ అవసరాన్ని ప్రస్తావించారు. ఈ అంశాన్ని ఆధారం చేసుకొని గురజాడ గొప్ప సాహిత్యానికి ప్రాణం పోశారు. ఈ అంశాన్ని గిడుగు పట్టించుకొన్ననాటి నుంచీ దీనికొక గుర్తింపు, ఉద్యమ రూపం వచ్చాయి.

గిడుగు వాడుక భాషోద్యమం భాషా రాష్ట్రాల ఉద్యమానికి కూడా స్ఫూర్తినిచ్చింది. ప్రజల వాడుక భాషలో సాహిత్యమూ విద్యాబోధనా జరగాలనే కోరిక అప్పటికే బలపడుతూ వచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం రావడం ఎంత అవసరమో, ఆ తర్వాత భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడాలన్న నాటి ఉద్యమాల ఫలితంగానే 1953లో ఆంధ్ర రాష్ట్రం, ఆ తర్వాత నైజాంలోని తెలుగు ప్రాంతాల విలీనంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాయి. ఇదంతా జరగడానికి రాజకీయ అంశాలు ఎంత కారణమో... దానికి ప్రజల్లో ఏర్పడిన భాషా జాతి భావన అంతే కారణం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 'మా భాషలో మమ్మల్ని మేమే పరిపాలించుకుంటాం. మా భాషలో మేం చదువుకొంటూ అనంత విజ్ఞాన వికాసాన్ని అందుకొంటాం' అనే స్వాభిమాన భావనే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పటుకూ దారి తీసింది.

అయితే ఇదంతా అప్పటి చరిత్ర. మనతో పాటు ఏర్పడిన కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు ఆ స్వాభిమానాన్ని నిలబెట్టుకొంటూ తమ భాషల్ని కాపాడుకొంటూ అభివృద్ధి చేసుకొంటున్నాయి. తెలుగువాళ్ళం మాత్రం భాషా రాష్ట్రాల మౌలికతను మరచిపోయి, కేవలం అధికార పదవీ రాజకీయాల్లో, స్వార్థ ప్రయోజనాల సాధనలోనే మునిగిపోయాం. ఇందుకు మన రాజకీయ నాయకులు, పార్టీలు బాధ్యత వహించాలి. దీనికి తోడు పాతికేళ్ళుగా వచ్చి పడుతున్న ప్రపంచీకరణ ప్రభావంతో ఆంగ్ల భాషపై మోజు పెరగడంతో పాటు, స్వంత భాషపై నిర్లక్ష్యానికి తెలుగుజాతి ఆటపట్టు అయింది.

డా॥బెజవాడ గోపాలరెడ్డి, పి.వి నరసింహారావు, ఎన్టీరామారావు తప్ప తక్కిన ముఖ్యమంత్రులకు ప్రత్యేకించి భాషాభివృద్ధి పట్ల శ్రద్ధ లేదు. ప్రజాభాషలో పాలన సాగించాలని, ఇది ప్రజాస్వామ్య మౌలిక లక్షణమన్న సంగతిని పాలకులు పట్టించుకోవడం మానేశారు. ఈ పరిస్థితి ఎంతకు దిగజారిందంటే సాక్షాత్తూ ముఖ్యమంత్రి, ముఖ్య కార్యదర్శుల కార్యాలయాల నుంచి ఇంగ్లీషే రాజ్యం చేస్తోంది. అన్ని శాఖల నుంచి వచ్చే ప్రభుత్వ ఉత్తర్వులన్నీ (జీవోలు) ఇంగ్లీషులోనే వస్తాయి. ప్రత్యేకంగా అనుకొంటే తప్ప జీవోల తెలుగు అనువాదాలు కూడా అందుబాటులో వుండవు. సమైక్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఇప్పుడు రెండు రాష్ట్రాల ప్రభుత్వాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని వుంది. శిలాఫలకాల మీద గాని, ప్రభుత్వ కార్యాలయాల బోర్డుల మీద గాని, తెలుగే ప్రముఖంగా ఉండాలన్న

> **'ఈ పరిస్థితికి పాలక పార్టీల నేతలు.. స్పష్టంగా చెప్పాలంటే ముఖ్యమంత్రులు బాధ్యులు. వారికి రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడమే కారణం. వాళ్లంతా ఓట్ల కోసం ప్రజల భాషలోనే ప్రసంగాలు చేస్తారు. వాగ్దానాలు చేస్తారు. కాని అధికారంలోకి రాగానే అంతా మర్చిపోతారు. అంతా ప్రజలకు అర్థం కాని పరాయిభాషలోనే సాగిపోతోంది. తెలుగులో పాలనగాని, న్యాయ వ్యవహారాలు గాని జరగనప్పుడు ఇది తెలుగు భాషా రాష్ట్రం ఎందుకవుతుంది?'**

నేడు తెలుగు భాషా దినోత్సవం

అంశాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు ఎవరూ పట్టించుకోరు. కొత్త రాజధాని అమరావతి నగర నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పుడు ఫలకం మీద తెలుగు లేదు. ఈ విషయంలో చెలరేగిన నిరసనలను ఈ రోజు వరకు ప్రభుత్వం పట్టించుకొన్న పాపాన పోలేదు. ఫలితంగా ఇటీవల ఆవిష్కరణ జరిగిన పోలీసు కేంద్ర కార్యాలయ భవనంతో సహా అనేక చోట్ల తెలుగుకు చోటివ్వక, ఇంగ్లీషుకే పెద్ద పీట వేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకొన్న కేంద్ర ప్రభుత్వ 'ఇన్‌కంటాక్స్' కార్యాలయం కూడా త్రిభాషా సూత్రాన్ని మరచిపోయి, ఇంగ్లీషుకే ప్రాధాన్యతనిచ్చింది. కొత్త రాష్ట్రం ఏర్పడిన దగ్గర నుంచి పరిపాలనలో తెలుగును ఒక పద్ధతి ప్రకారం అణచి వేస్తున్నారు.

1966లో తొమ్మిదవ చట్టంగా అధికార భాషా చట్టం వచ్చింది. దానిలో అన్ని అంశాలూ స్పష్టంగా వున్నాయి. ఆ తర్వాత పరిపాలన తెలుగులో సాగాలని అనేక సార్లు ఎన్నో జీవోలు వచ్చాయి. ఈ నడక 2014 వరకూ సాగింది. 2013 ఏడాది చివరి రోజున జీవో నెం 909 ద్వారా తెలుగుకు ఒక మంత్రిత్వ శాఖ ఏర్పడింది. తర్వాత కొద్ది నెలలకే ఏర్పడిన రెండు రాష్ట్రాల్లోనూ తెలుగులో పాలనకు సంబంధించి ఎలాంటి ముందడుగు లేదు. నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత పరిస్థితి మరీ దిగజారుతోంది.

పాలనా భాషగా తెలుగు అమలు గురించి మనకున్నన్ని జీవోలు, తదితర ఉత్తర్వులు పొరుగు రాష్ట్రాల్లో లేవు. కాని, వారి పాలకులు– ఏ పార్టీ అధికారంలో వున్నా– తన భాష విషయంలో రాజీ పడరు. దాని తర్వాతే ఏదైనా! మన పాలకులకు అసలా సంగతే పట్టదు.

ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ... పాలనా భాషగా తెలుగు అమలు విషయాన్ని చాలా ముఖ్యమైనదిగా పరిగణించి 'సీరియస్'గా తీసుకున్నారు. 1988 మార్చి నాల్గవ తేదీన ఆనాటి అధికార భాషా సంఘం అధ్యక్షులు నండూరి రామకృష్ణమాచార్యులనూ, ఇతర సభ్యులనూ, కార్యదర్శి సి ధర్మారావునూ పిలిపించుకొని సమగ్రంగా సమీక్షించి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకొన్నారు. వాటి ప్రకారం 'తనకు ఇంగ్లీషులో చేరిన ఏ ఉత్తరాన్నయినా, ప్రతిపాదననైనా, ఏ చర్యా తీసుకోకుండా వాటిని పంపిన కార్యాలయానికే తిప్పి పంపే అధికారం రాష్ట్రం లోని ప్రతి గెజిటెడ్ అధికారికీ వుంటుంది. తమ పైకార్యాలయాల నుంచి వచ్చినా, ఇట్లాగే తిప్పి పంపివేయవచ్చు. ఈ విధంగా తిప్పి పంపడం వల్ల జరిగే కష్ట నిష్టురాలకు, నష్టానికి, జాప్యానికి బాధ్యత ఉత్తరాలు, ప్రతిపాదనలు ఇంగ్లీషులో పంపిన కార్యాలయాధిపతి మీదే వుంటుంది'. 1988 ఏప్రిల్‌లో మరొక ఆదేశం ఇచ్చారు. శాసనపరమైన కొద్ది అంశాలను మినహాయించి, సచివాలయంలోని ఫైళ్ళన్నీ పూర్తిగా తెలుగులోనే నిర్వహించాలి. అవి ఇంగ్లీషులో కనిపించకూడదు. వీటితోపాటు వెంటనే అమలులోకొచ్చే విధంగా మరికొన్ని సంబంధిత ఆదేశాలను కూడా ఇచ్చారు. ఆ ఏడాదిలోనే ప్రారంభమయ్యే 'విభవ' తెలుగు సంవత్సరాన్ని 'అధికార భాషా సంవత్సరం'గా పరిగణిస్తూ స్పష్టమైన లక్ష్యంతో ఆనాడు ఎన్టీఆర్ ప్రభుత్వం వ్యవహరించి, పరిపాలన మొత్తాన్నీ ప్రజల భాషలోకి మార్చింది. కాని, ఆయన తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు... తెలుగుదేశం పార్టీవారు గానీ, కాంగ్రెస్ వారు గానీ అందరూ... ఆ ప్రజాస్వామిక మార్పును తిరగ రాసి, పరిపాలనను ఇంగ్లీషులోకి నెట్టివేశారు.

ఈ పరిస్థితికి పాలక పార్టీల నేతలు.. స్పష్టంగా చెప్పాలంటే ముఖ్యమంత్రులు బాధ్యులు. వారికి రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడమే కారణం. వాళ్లంతా ఓట్ల కోసం ప్రజల భాషలోనే ప్రసంగాలు చేస్తారు. వాగ్దానాలు చేస్తారు. కాని అధికారంలోకి రాగానే అంతా మర్చిపోతారు. కీలక జిల్లా స్థాయి వరకు న్యాయస్థానాల్లో తప్పనిసరిగా స్థానిక భాషలోనే వ్యవహారాలుండాలని స్పష్టం చేసే జీవో నెం 485/1974 మార్చి 29 (హోంశాఖ)ను ఎవరూ పట్టించుకోరు. అంతా ప్రజలకు అర్థం కాని పరాయిభాషలోనే సాగిపోతోంది. కారణం మన రాష్ట్ర పాలక వర్గాల ప్రజా వ్యతిరేక ధోరణులే.

తెలుగులో పాలనగాని, న్యాయ వ్యవహారాలు గాని జరగనప్పుడు ఇది తెలుగు భాషా రాష్ట్రం ఎందుకవుతుంది? తెలుగులో పూర్తిగా పాలించలేని పార్టీ పేరు తెలుగుదేశం అని ఎందుకు వుండాలి? మన రాష్ట్రంలో పాలక పార్టీలే కాదు, ప్రతిపక్షాల నేతలు కూడా ఈ విషయంపై ఎందుకు మౌనంగా వుంటున్నారు? వారి ఉద్యమాంశాలలో ప్రజల భాష వుండదా? ఇవన్నీ కీలక చర్చనీయాంశాలు.

ఇప్పుడు మళ్ళీ గిడుగు రామమూర్తి గారి జన్మ దినోత్సవాన్ని తెలుగు భాషా దినోత్సవంగా మన రాష్ట్ర ప్రభుత్వం నేడు నిర్వహించబోతున్నది. తమకు తోచిన వారికి అవార్డులను ప్రదానం చేసి, ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. కొన్ని వాగ్దానాలను కురిపిస్తారు కూడా. అయితే, గత రెండేళ్ళుగా చేసిన వాగ్దానాలను ఒక్కటైనా ఆయన ప్రభుత్వం అమలు చేసిన పాపాన పోలేదు. వాటి అమలుకు చర్యల్ని ప్రకటించడంతో పాటు, ఈ సారైనా పాలన విషయంలో స్పష్టతనివ్వాలి. 'ఈ రోజు నుంచీ నా కార్యాలయం నుంచీ, నా ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి మొదలుపెట్టి సచివాలయమంతా పరిపాలనను తెలుగులోకి మళ్ళిస్తాం. రాబోయే వంద రోజుల్లో పూర్తిగా ఈ లక్ష్యాన్ని సాధిస్తాం' అని ఆయన వేదిక మీద నుంచి ప్రకటిస్తే ప్రజలంతా సంతోషిస్తారు. అదే విధంగా వివాదాస్పద జీవో 14 ఫిబ్రవరి 2017 (మున్సిపల్ శాఖ)ని అధికారికంగా రద్దు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తామని కూడా ప్రకటించాలి.

ఇప్పటికైనా 'తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ'ను నెలకొల్పడానికి చట్టసభల్లో వెంటనే బిల్లును ప్రవేశపెట్టి, పటిష్టమైన చట్టాన్ని రూపొందించి, దాన్ని అమలు చెయ్యాలి. అందుకు తగినంత బడ్జెటు కేటాయింపు ఇవ్వడంతో పాటు రాష్ట్రంలో, విద్యారంగంలో తమ భాషా విధానాన్ని స్పష్టం చేయాల్సిన బాధ్యత కూడా ముఖ్యమంత్రి మీద వుంది.

(రచయిత తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు), 9848016136

పేద పిల్లలకు చదువొద్దా బాబూ!

ఎమ్. కృష్ణమూర్తి




విశ్లేషణ

కాలేజీలు జూన్ ఒకటిన, పాఠశాలలు–స్కూళ్ళు జూన్ 12న పున:ప్రారంభించారు. విద్యా సంస్థలు తెరిచి మూడు నెలలవుతోంది. ఇంతవరకు పూర్తి స్థాయిలో అధ్యాపకులు, ఉపాధ్యాయులను నియమించ లేదు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు విద్యార్థులకు అందించలేదు. తరగతి గదులు, వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపర్చడంలేదు. పేద పిల్లలు చదువుతున్న ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేసి చదువుకు దూరం చేసే పనిని ప్రభుత్వం వేగవంతం చేస్తోంది తప్ప చదువుకొనే వాతావరణం కల్పించే కృషి చేయడంలేదు. మోడీ స్వచ్ఛ భారత్‌కు మూడేళ్లు గడిచినా పేద విద్యార్థులు చదువుకొనే పాఠశాలలు, కాలేజీలు, వసతి గృహాల్లో మరుగుదొడ్లు ఆమడ దూరంలోనే వున్నాయి. వసతి గృహాల్లో బాలికలకు సరిపడా మరుగు దొడ్లు, స్నానాల గదుల్లేవు. తానీ మధ్య ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో స్వయంగా పరిశీలించి, విద్యార్థులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్న సమస్యల వివరాల లోతులను సమీక్షిస్తే పేదలు చదువుతున్న ప్రభుత్వ విద్యా సంస్థల పట్ల ప్రభుత్వానికి వున్న చులకన భావం బయటపడుతోంది. ఉద్దేశపూర్వకంగా పేదలను చదువుకు దూరం చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందన్న నిజం బోధపడుతోంది.

రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో లెక్కలు, చరిత్ర, కంప్యూటర్ సైన్స్, ఫారెస్ట్రీ పాఠ్యాంశాలు బోధించేందుకు అధ్యాపకులు లేరు. ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్లు లేరు. లేబొరేటరీలు లేవు. క్లాసురూంలే లేబొరేటరీలు. సైన్సు కోర్సుల్లో సీట్లు దొరకక ప్రయివేటు కాలేజీలకు విద్యార్థులు వెళ్లిపోతున్నారు. మారేడ్‌మిల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంగ్లీషు, లెక్కలు అధ్యాపకులు లేరు. ఫిజికల్‌డైరెక్టర్ లేరు. లైబ్రేరియన్ లేరు. లేబొరేటరీలు లేవు. బాలికలకు కూడా బాత్‌రూంలు లేవు. స్పోర్ట్స్, గేమ్స్ కానరావు.

చింతూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్కలు, అర్థశాస్త్రం, జంతుశాస్త్రం, హిందీ అధ్యాపకులు లేరు. ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్లు కూడా లేరు. కాలేజీలో బాలబాలికలకు మరుగుదొడ్లు లేవు. బెంచీలు సరిపడా లేవు. హాస్టల్ రూంలు చాలవు. కాలేజీలో ఒక రూంను

> **అధ్యాపకులు, ఉపాధ్యాయులు లేకుండా విద్యార్థులకు చదువు రాదని సిఎం చంద్రబాబుకు తెలియదా? డిజిటల్ పరిపాలన చేస్తున్న సిఎంకు తెలియక కాదు. 'ప్రభుత్వ విద్య పట్ల ప్రజలకు విశ్వాసం పోవాలి. ప్రయివేటు విద్య వైపు తరలిపోవాలి'. ఇదే ప్రపంచ బ్యాంకు ఆదేశిక సూత్రం. అదే పాటిస్తున్నారు.**



ఐటిడిఎ మీటింగు హాల్ కిందకు మార్చారు. కాలేజీలో ఫ్యాన్లను మీటింగు హాల్లో పెట్టుకున్నారు. హాస్టల్ ఆవరణలో ఐటిడిఎ ప్రోజెక్టు అధికారి క్వార్టర్ నిర్మిస్తున్నారు. ఇందుకు హాస్టల్ విద్యార్థుల బోరు నీటిని ఉపయోగించడంతో హాస్టల్ విద్యార్థులు స్నానాలకు ఇబ్బంది పడుతున్నారు. బాలికల హాస్టల్‌లో బాత్‌రూంలు లేవు. 100 మందికి వంట చేసేవారు ఇద్దరే. సకాలంలో టిఫిన్ అందించలేకపోవడంతో విద్యార్థినులు కాలేజీకి వెళ్లడం ఆలస్యమవుతోంది.

వి.ఆర్.పురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నాలుగు గ్రూపులకు 8 గదులు కావాలి. 4 గదులే ఉన్నాయి. దీంతో ఒక క్లాసు జరుగుతుంటే మరొక క్లాసు విద్యార్థులు బయటకి పోవాలి. లేబొరేటరీ లేదు. లైబ్రేరియన్ లేరు. అమ్మాయిలకు హాస్టల్ లేదు. బాలుర హాస్టల్‌లో 68 మంది ఉన్నారు. రెండు బాత్ రూంలు, రెండే మరుగుదొడ్లు ఉన్నాయి. రన్నింగ్ వాటర్ లేదు. రూములు కారిపోతున్నాయి. కాలేజీకి రోడ్డు లేదు. వాచ్‌మేన్ లేరు. తాగునీరు లేదు.

చింతూరు, విఆర్‌పురం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు ఇంతవరకు పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదు. రెండో సంవత్సరం విద్యార్థులకు హిస్టరీ, తెలుగు, హిందీ పాఠ్య పుస్తకాలు అందించలేదు. చింతూరులో డిగ్రీ కాలేజీ లేదు. డిగ్రీ కాలేజీ లేకపోవడంతో ఇంటర్ తరువాత విద్యార్థులంతా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఎటపాక మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేదు. రాష్ట్ర విభజన జరిగి మూడున్నర ఏళ్ళయినా డిగ్రీ కాలేజీ ఉండాలని, జూనియర్ కాలేజి పెట్టాలని చంద్రబాబు ప్రభుత్వానికి తోచలేదు.

విజయనగరం జిల్లా పాచిపెంట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 3నెలల తరువాత అర్థశాస్త్రం చెప్పేందుకు గెస్ట్ (అతిథి) లెక్చరర్ జాయిన్ అయ్యారు. పేరుకే అతిథి అధ్యాపకులు. రోజంతా పనిచేయాలి. నెలకు 10 వేల రూపాయలు జీతం. ఇంటి అద్దె లేదు. అంతా కలిపి 10 వేల రూపాయలే. విశేషమేమంటే గత సంవత్సరం పని చేసిన కాలానికి ఒక్క నెల కూడా జీతం ఇవ్వలేదు. ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్లు లేరు. హాస్టల్ లేకపోవడం వలన విద్యార్థులు ఇంటి నుండే కాలేజీకి వస్తున్నారు. తల్లిదండ్రులకు పొలం పనుల్లో సాయం చేయడం కోసం కాలేజీకి గైర్హాజరవుతున్నారు. చదువులో వెనకబడిపోతున్నారు.

పాచిపెంట జిల్లా పరిషత్ హైస్కూలులో 556 మంది చదువుతున్నారు. మరో 50 మంది చేరతారని ఉపాధ్యాయులు చెప్పారు. ఏడుగురు ఉపాధ్యాయులు లేరు. ఇద్దరు లెక్కలు, ఇద్దరు ఇంగ్లీషు, తెలుగు, హిందీ, డ్రాయింగ్ ఉపాధ్యాయుల్లేరు. నైట్ వాచ్‌మేన్ లేరు. పది క్లాస్‌రూంలు అవసరమైతే రెండే ఉన్నాయి. వసతి లేక ఇంజినీరింగ్ అధికార్లు వాడకూడదని చెప్పిన శిథిల భవనంలో క్లాసులు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే 6,7,8 తరగతుల పిల్లలకు సెలవు ప్రకటించి, 9,10 తరగతుల విద్యార్థులకు రెండు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. పాచిపెంట మండల కేంద్రంలో హైస్కూలు దుస్థితి ఈ విధంగా ఉంటే ఇక మిగతా స్కూళ్ళ పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించండి.

పాచిపెంట కెజిబివిలో కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు ఇన్‌స్ట్రక్టర్ లేరు. పాడైన కంప్యూటర్లు రిపేర్లు చేసేందుకు టెక్నీషియన్ లేరు. కంప్యూటర్లు అలంకార ప్రాయంగా ఉన్నాయి. ఈ సంవత్సరం ఇంతవరకు నోట్‌బుక్స్ ఇవ్వలేదు. నిత్యం డిజిటల్ ఆంధ్రప్రదేశ్ ప్రచార హోరు సృష్టిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం నిజ రూపం ఇది. ఉపాధ్యాయులంతా మహిళలే. 24 గంటలు డ్యూటీ చేయాలి. ప్రసూతి సెలవు లేదు. ఇంతకంటే అమానుషం ఉంటుందా?

శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్‌కు, బయోలజీకి టీచర్లు లేరు. ఇంగ్లీషు, హిందీ, తెలుగు, డ్రాయింగ్ పోస్టులు రేషన్‌లైజేషన్‌లో ఎగిరిపోయాయి. ఆఫీసు సబార్డినేట్ కూడా లేరు. పాలిటెక్నిక్ కాలేజీ పరిస్థితి మరీ దారుణం. కాలేజి ప్రారంభించి మూడేళ్ళయింది. సివిల్, మెకానికల్ కోర్సులున్నాయి. ఇంతవరకు ఒక్క లెక్చరర్ పోస్టు కూడా మంజూరు కాలేదు. అందరూ డిప్యుటేషన్, గెస్ట్ లెక్చరర్లే. ఇక్కడ డిప్యుటేషన్ అంటే ఎక్కడో చదువు సంతకెళ్ళిపోతున్నది. మూడేళ్ళయినా హాస్టల్ లేదు. హాస్టల్ లేకపోవడం వలన విద్యార్థులు జాయిన్ కావడం లేదు.

ఎ.పి. గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో 12 మంది పార్ట్‌టైమ్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. గతంలో వీరిని గెస్ట్ లెక్చరర్లు అనేవారు. పేరుకు పార్ట్‌టైమ్ అని చెబుతున్నా పని మాత్రం పూర్తికాలమే. ఉదయం 7గంటల నుండి రాత్రి 9గంటల వరకు పనిచేస్తున్నారు. వీరికి ఇచ్చేది నెలకు 8,500 రూపాయలు. వీరు ఎమ్.ఎ, ఎమ్.ఇ.డి, ఎమ్.ఎస్సీ, ఎమ్.ఇ.డి చదివారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కూడా పార్ట్‌టైమ్ లెక్చరర్లతోనే ప్రభుత్వం చదువులు చెప్పిస్తున్నది. వీరికి నెల జీతం 7,200 రూపాయలు. పార్ట్‌టైమ్ లెక్చరర్లు రోజుకు 14 గంటలు చొప్పున నెలకు 420 గంటలు పని చేస్తున్నారు. గంటకు 20 రూపాయలు, రోజుకి 280 రూపాయలు జీతం చెల్లిస్తున్నది చంద్రబాబు ప్రభుత్వం.

పోస్ట్‌మెట్రిక్ ప్రభుత్వ హాస్టల్‌లో ఐదుగురు పనివాళ్లు వంట చేస్తున్నారు. నెలకు ఒక్కొక్కరికి 3 వేల రూపాయలు చెల్లిస్తున్నారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పని చేయాలి. రోజుకు 14 చొప్పున నెలకు 420 గంటలు పని చేస్తున్నారు. గంటకు 7 రూపాయలు, రోజుకి 98 రూపాలు జీతం పడింది. వీళ్లకు ఆదివారాలు, పండగలకు సెలవులు వుండవు. దసరా, సంక్రాంతి, వేసవి సెలవులు తప్ప ఇంకే సెలవులు వర్తించవు. పార్ట్‌టైం లెక్చరర్లదీ ఇదే పరిస్థితి.

నెలకు లక్షల్లో ఇంటి అద్దె తీసుకుంటున్న మంత్రులకు రూ.3 వేలు, 5 వేలు, 8 వేలుతో రాత్రి పగలు ఉద్యోగులు ఎలా పని చేయగలరనే ఇంగితం కూడా లేదు.

అధ్యాపకులు, ఉపాధ్యాయులు లేకుండా విద్యార్థులకు చదువు రాదని సిఎం చంద్రబాబుకు తెలియదా? తరగతి గదులు, పాఠ్య పుస్తకాలు లేకుంటే ఎలా చదవగలరు? లేబొరేటరీలు లేకపోతే సైన్సు చదువులకు అర్థం ఉంటుందా? హాస్టల్ వసతి, మరుగు దొడ్లు, స్నానాల గదులు లేకపోతే అమ్మాయిలు పరిస్థితి ఏమిటి? చంద్రబాబుకు ఇవేవీ తెలియవా? డిజిటల్ పరిపాలన చేస్తున్న సిఎంకు తెలియక కాదు. 'ప్రభుత్వ విద్య పట్ల ప్రజలకు విశ్వాసం పోవాలి. ప్రయివేటు విద్య వైపు తరలిపోవాలి'. ఇదే ప్రపంచ బ్యాంకు ఆదేశిక సూత్రం. అదే పాటిస్తున్నారు. ప్రభుత్వ కుట్రను గుర్తించి గిరిజనులు, దళితులు, పేదల పిల్లల తల్లిదండ్రులంతా ఉద్యమించి ప్రభుత్వ విద్యను మెరుగు పర్చుకోవాలి.

(రచయిత సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు)

వర్షాకాలం.. జాగ్రత్తలు



వర్షాకాలం అనగానే అందమైన వాతావరణంతో పాటే చిన్న చిన్న ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలూ ఎదురవుతాయి. ఈ సీజన్‌లో ఆరోగ్య సమస్యలనగానే మొదటగా గుర్తొచ్చేవీ, ఎక్కువ మందిని ఇబ్బంది పెట్టేవీ జలుబు, దగ్గు. మిగతా రోజుల కంటే ఈ సీజన్ సమయంలోనే కొంచెం ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవాలి.

- దగ్గినప్పుడూ, తుమ్మినప్పుడూ చేయి అడ్డం పెట్టేసుకుంటే సరిపోదు. ఆ వెంటనే ఒకసారి చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. లేందంటే టిష్యూ పేపర్లను అయినా ఉపయోగించాలి. శానిటరీ జల్‌ను ఉపయోగించి కూడా సులభంగా చేతుల మీద పడ్డ తుంపర్లను తొలగించుకోవచ్చు.
- జలుబు విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. దీని ప్రభావం ఎక్కువై జ్వరం కూడా వచ్చే అవకాశాలున్నాయి. చల్లంటి నీటిని పూర్తిగా మానేయాలి. కాచి వడపోసిన నీటికే ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలి. పిల్లలకు స్కూల్స్‌కూ, పెద్దలు ఆఫీసలకూ వీటినే తీసుకెళ్లడం మంచిది.
- శరీర శుభ్రతతో పాటు ఇంటిని కూడా ప రిశుభ్రంగా ఉంచుకోవాలి. ఏ మాత్రం మురుగు పేరుకున్నా దోమలు వచ్చి చేరిపోతాయి. డెస్ట్‌బిన్‌ను ఎప్పటికప్పుడు ఖాళీ చేయాలి. చెత్త లేకుండా ఇంటిని ఎప్పటికప్పుడు క్లీన్‌గా ఉంచుకోవాలి.

ఇలాంటి చిన్నచిన్న జాగ్రత్తలను తీసుకుంటే ఈ వర్షాకాలాన్ని ఆనందమయం చేసుకోవచ్చు.

ముఖంపై మచ్చలు మాయమిలా!



చాలామంది ముఖంపై వచ్చిన మచ్చలతో బాధపడుతుంటారు. మొటిమల వల్ల, ఇతర కారణాల వల్ల వచ్చే ఈ మచ్చలను పోగొట్టుకొనే మార్గం మన చేతుల్లోనే ఉంది.

- బియ్యపు పిండిలో కొద్దిగా పెరుగు కలిపి ముఖానికి రాసి, వృత్తాకారంలో మృదువుగా రుద్దాలి. కొన్ని నిమిషాల తర్వాత నీటితో కడిగేయాలి. ఇది ముఖానికి క్లీనర్‌లా పనిచేసి మచ్చలను తగ్గిస్తుంది. ఇలా వారానికి రెండుసార్లు చేయాలి.
- నిమ్మరసం, తేనెను సమపాళ్లలో కలుపుకొని ముఖానికి అప్లై చేయాలి. అలా 15నిమిషాలు ఉంచుకొని కడిగేసుకోవాలి. ఇలా ప్రతిరోజూ చేసుకోవచ్చు.
- మూడు టీస్పూన్ల ఓట్స్‌పొడి, ఒక్కొక్క స్పూన్ తేనె, పెరుగు, నిమ్మరసం, గుడ్డులోని తెల్లసొనను కలిపి ముఖానికి రాసుకోవాలి. అరగంట తర్వాత కడిగేయాలి. ఈ మిశ్రమాన్ని రాసుకునేటప్పుడు పెదాలకు, కళ్లకింద మృదువైన చర్మానికి తగలకుండా చూసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే మొటిమల మచ్చలు తగ్గుతాయి. అంతేకాక ముఖంపై మృతకణాలూ తొలగుతాయి.

జీవన సౌరభం — **పరాజయాలు ఎదురైనంత మాత్రాన ప్రతిభ గల వారి విలువ మారదు.**



ఎక్కడో అమెరికాలో చదివే అమ్మాయి. కానీ.. తన మనసంతా ఇక్కడే. ప్రస్తుతం అమెరికాలోనే డిగ్రీ చదువుతుంది. స్కూల్ స్థాయి నుంచే ఎక్కడో ఇండియాలో ఉన్న సొంతూరులోని ఓ ఊరు బాగు కోసం ఆలోచించడం మొదలయ్యింది. అలా అమ్మ పుట్టిన ఊరు కోసం ఏదో ఒకటి చేయాలనే సంకల్పం ఆమెది. అందుకు.. బడికెళ్ళే వయసులోనే అమెరికాలో విరాళాలు సేకరించింది. ఆనక అల్లంత దూరం నుంచి రెక్కలు కట్టుకుంటూ వచ్చి సొంత ఊరి బాగుకోసం సేవలందిస్తుంది ఈకాబోయే డాక్టరమ్మ. ఈ అమ్మాయి పేరు శర్వాణి. పుట్టిపెరిగింది.. చదువుతున్నది అమెరికాలోనే. కానీ.. సొంతూరంటే.. ప్రాణంపెడుతుంది. ఇంతకీ.. శర్వాణి ఆ ఊరికి ఏం చేసింది? తెలుసుకుందాం పదండి.

అక్కడ చదువుతూ ఇక్కడ సేవ చేస్తూ..!

ఆమె పేరు కొట శర్వాణి. అమెరికాలో పుట్టిన ఈ తెలుగమ్మాయి.. తన తల్లి పుట్టిన సొంతూరికి ఏదో ఒకటి చేయాలి ఆలోచించింది. ఈ ఆలోచన రాత్రికి రాత్రే వచ్చిందికాదు. అమెరికాలో పుట్టిపెరుగుతున్నాగానీ.. అమ్మ చెప్పే మాటలవల్ల తమ సొంతూరుపై మమకారం పెంచుకుంది. ఒకపక్క ప్రవాసాన మరో దేశంలో చదువుకుంటూనే మాతృభూమికి తనవంతు సేవ చేయాలనేది మనసులో పడిపోయింది.

అమ్మపుట్టిన ఊరు

రెండు దశాబ్ధాలకు పైగా ఆమెరికా న్యూజెర్సీలో స్థిరపడిన కుటుంబం అయినా చిన్న నాటి నుంచీ ఏడాదికో.. రెండేళ్లకు తల్లిఇంటికి వచ్చేది. అలా అమ్మపుట్టి పెరిగిన ఊరిపై ఒక అవగాహన ఏర్పడింది. అవగాహనతోపాటు.. అక్కడి సమస్యల్నీ అంతే వంటపట్టించుకుంది. దీనికితోడు తండ్రి లక్ష్మినరసింహా కూడా సాధ్యమైనంత వరకూ.. ఇతరులకు సహాయపడాలని చెప్తుండే మాటలూ.. శర్వాణిని ఆ ఊరుగురించి ఆలోచింపచేసేలా చేశాయి. చిన్న వయసులోనే సేవాగుణం అలవడేలా చేశాయి.

తనకు పదిహేనేళ్ళప్పుడు అమెరికాలో తను చదువుతున్న పాఠశాలలోని కొందరు సహవిద్యార్థులతో కలిసి సేవా కార్యక్రమాలవైపు దృష్టి సారించిన శర్వాణి 2013 ఆగష్టులో 'హోప్ ఫర్ స్పందన' అనే సంస్థను నెలకొల్పారు. దీనికి తండ్రి లక్ష్మినరసింహా, తల్లి నంద్యాల మాధవి, సోదరి సాత్వికామానస మామ నంద్యాల రఘునాథ్, పరస్పర ప్రోత్సాహం లభించింది. అలా మొదలైన శర్వాణి సేవాకార్యక్రమాలు అమ్మపుట్టిన సొంతూరుకు విస్తరించాయి

ప్రస్తుతం విదేశాల్లో ఉంటోంది శర్వాణి కుటుంబం. తల్లితండ్రులిద్దరూ ఉద్యోగస్తులే. శర్వాణి చదువులో ఎప్పుడూ ముందంజే. అలా ఒకపక్క వాలంటరీగా పలు సేవాకార్యక్రమాల్లో పాల్గొంటూనే మరొపక్క చదువులోనే చక్కటి ప్రతిభగల విద్యార్థిగా నిరూపించుకుందామె. అలా పాఠశాల స్థాయి నుంచి ప్రస్తుతం చదివే డిగ్రీ వరకూ మెరిట్‌లో ఉత్తీర్ణత సాధిస్తూ ఉంచడం విశేషం. తెలివిగల అమ్మాయిగా.. అక్కడ జెపి స్టీవర్ హైస్కూల్, కాలేజి ఆఫ్ న్యూజెర్సీ వంటి విద్యాసంస్థల నుంచి అనేక ప్రశంసలు దక్కించుకుంది శర్వాణి.

బుద్ధిమాంద్యుల కోసం

అనంతపురం జిల్లా కేంద్రంలో రెండు దశాబ్ధాలకు పైగా బుద్ధిమాంద్య పిల్లలకు చేయూతనిస్తున్న "ది రూరల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు"కు సొంతంగా భవనం లేకపోవటం స్థానికి ప్రజల ద్వారా శర్వాణికి తెలిసింది. నిర్వాహకులైన గురుమూర్తి ద్వారా ఆ విషయంపై మరిన్ని వివరాలు తెలుసుకుందామె. నిజంగానే అక్కడి పిల్లలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న శర్వాణి ఎలాగైనా చేయూత నివ్వాలని నిర్ణయించుకున్నారు. ఫలితంగా అందుకోసం ఓ ప్రణాళిక వేశారు. విరాళాలు సేకరణ కోసం మిత్రులతో కలిసి అమెరికాలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. నృత్య ప్రదర్శలు, హస్తకళలల ఎగ్జిబిషన్‌ల ద్వారా పలు రకాల వస్తువుల్ని స్థానికులతో కొనిపించారు. అంతేకాకుండా తాను చదివే పాఠశాలలోనూ వివిధ రకాల కళాప్రదర్శలనలు నిర్వహించి కొంత మొత్తం సేకరించారు. ఇలా అనేక రూపాల్లో అమెరికాలో తాను ఉండే ప్రాంతాల్లో తన సొంతూరు కోసం ఎంతో శ్రమించి విరాళాలు సేకరించారు. ఇలా నమ్మశక్యంకానీ రీతిలో రూ.45 లక్షల రూపాయలు సేకరించి 2016లో.. "ది రూరల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు"కు ఒక భవనాన్ని అందించారు.



ప్రస్తుతం శర్వాణి నిర్మించిన భవనంలో సుమారు 70 మంది బుద్ధిమాంధ్యతగల చిన్నారులు శిక్షణను పొందుతున్నారు. అంతేకాదు, ఇప్పటికీ ఆయా చిన్నారుల అవసరాలకు అయ్యే ఖర్చుల్నీ.. తమ వంతుగా సహాయం అందిస్తున్నారు. ఈమధ్యనే ఫిజియోథెరఫి, స్పీచ్‌థెరపీకి కోసం రూ.25 వేల రూపాయలను సంస్థ ప్రతినిధికి



అందించారు. ఇదే క్రమంలో స్పందన, రాజ్ తదితర బుద్ధి మాంధ్యత చిన్నారుల సంరక్షణ కేంద్రాలకూ సహాయం అందిస్తున్నారు శర్వాణి.

సొంతూరుతోపాటు

ఒక్క అనంతపురం జిల్లానేకాదు, విజయవాడ, ద్రాక్షారామం, విశాఖపట్నం తదితర ప్రాంతాలలో తమ సంస్థ తరఫున సేవలను అందిస్తున్నట్టు శర్వాణీ పేర్కొన్నారు. బుద్ధిమాంధ్యతగల చిన్నారులకు శరీరానికి మాత్రమే వికలాంగం ఉంటుందని మనసుకు కాదనే బావన అందరూ అలవర్చుకోవాలని, బుద్ధిమాంధ్యత కలిగిన వారిలో పరివర్తనకు పలు విధాలుగా తమ సంస్థ కృషి చేస్తున్నట్లు ఆమె చెప్పారు. వారు మరొకరిపై ఆధారపడపడకుండా తమ పనులు చేసుకునేలా, చేతి వృత్తుల ద్వారా సొంతంగా జీవనం సాగించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

వైద్యురాలుగా..

ప్రస్తుతం న్యూజెర్సీలో డిగ్రీ చదువుతున్నా. వైద్యురాలు కావాలనేది నా సంకల్పం. వైద్యురాలిగా స్థిరపడితే మరింతగా పేదలకు అండగా ఉండగలను. న్యూరో సర్జన్ చేయాలని ఉంది.

- శర్వాణి

అమెరికాలో గుర్తింపు

అతి చిన్న వయసులోనే సమాజంలోని అసమానతలను గుర్తించి తనవంతు సేవ చేయాలని ముందుకు వచ్చిన శర్వాణిని అమెరికా ప్రభుత్వం గుర్తించి అభినందించడం మరో విశేషం. న్యూజెర్సీ రాష్ట్ర గవర్నర్ క్రిస్‌క్రిష్టియి అసెంబ్లీప్రాంగణంలో ఎంతో ఉన్నతంగా



శర్వాణిని సత్కరించడం అక్కడ నివాసముంటున్న తెలుగువారికి ఎంతో గర్వకారణం భావించారు. అంతేకాదు, తాను చేసే వాలెంటరీ సర్వీస్‌కుగాను మాజీ అమెరికా అధ్యక్షులు బరాక్ ఒబామ నుంచి ప్రశంసను అందుకున్నారామె. ప్రెజెడెన్సియల్ వాలింటియర్ సర్వీస్‌లో గత సంవత్సరంలో బ్రాంజి మెడల్, ఈ యేడాది బంగారు పథకం పొందారు.

- రవిచంద్ర

ఓ కలెక్టర్... సెల్ఫీ ఐడియా!

ఒక్కోసారి చిన్నచిన్న ఆలోచనలే అనూహ్యమైన మార్పులు తీసుకొస్తాయి. ఎవరో ఒకరికి ఆ ఆలోచన వచ్చి అమలు చేసేవరకూ ... అరె"మనకీ ఈ ఆలోచన ఇంత కాలం తట్టలేదే అనిపిస్తుంది". అవి ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న సమస్యలకు పరిష్కారాన్ని కూడా చూపుతాయి. అలా వరంగల్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలికి వచ్చిన ఓ ఐడియా అక్కడి సాంఘిక సంక్షేమ హాస్టల్స్ లోని పిల్లలకు భలేగా ఉపయోగపడుతోంది. అప్పటి వరకూ ఎన్ని తనిఖీలు చేసినా, హెచ్చరికలు ఇచ్చినా జరగని మార్పు ఆ ఒక్క సంఘటనతో జరిగిపోయింది.



జీవితాల్లోకి సెల్ఫీ

టెక్నాలజీ బాగా పెరిగిపోయింది. ఆండ్రాయిడ్ ఫోన్లు పల్లెలకు కూడా చేరాయి. వాటితో పాటే సెల్ఫీ క్రేజ్ కూడా ఆమాంతంగా పెరిగిపోయింది. ఇంకా చెప్పాలంటే ఈ రోజుల్లో తమ సెల్ఫీను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయని వారు ఎక్కడో కానీ మనకు దొరకరేమో. అంతలా మన జీవితాల్లోకి ఆండ్రాయిడ్ ఫోన్లూ, ఇంటర్‌నెట్, సోషల్‌మీడియా, సెల్ఫీలూ చొచ్చుకొచ్చేశాయి అయితే దీనికీ.. కలెక్టర్‌కు ఏంటి సంబంధం అనుకుంటున్నారా... ?

కలెక్టర్ ఆమ్రపాల్ కూడా సరిగ్గా ఇదే విషయాన్ని పట్టుకున్నారు. ఆ తర్వాత దీనిని భలేగా ఉపయోగించారు.

నిర్లక్ష్యం పెరిగినప్పుడు తట్టింది

వరంగల్ జిల్లాలో మొత్తం 35 సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయి. వాటిలో 5,000 మంది వరకూ విద్యార్థులున్నారు. అయితే అనేక విషయాలలో పిల్లల కనీస అవసరాలు తీర్చడంలో అక్కడి వార్డన్లు విఫలమవుతున్నారు. భోజనాలు అందించే బాధ్యతను కూడా సక్రమంగా నిర్వహించడం లేదు. దీనికి తోడు విద్యార్థుల సంఖ్యలో మార్పులు చూపించి అక్రమాలకు పాల్పడుతున్నారు. అయితే ఈ విషయాలన్నీ కలెక్టర్ దృష్టికి చేరాయి. జీతాలు తీసుకుంటూ కనీసం హాస్టల్‌కు సరిగా హాజరు కాని వార్డ్‌న్లను, పిల్లలకోసం పనిచేయని వారిని దారిలో పెట్టాలనుకున్నప్పుడే ఈ ఐడియా పుట్టింది.



అలా అమలు చేసింది

హాస్టల్స్‌లో పనిచేస్తున్న వార్డెన్లనూ, అధికారులనూ, ఉపాధ్యాయులనూ అందరనీ కలిపి వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసింది. ఈ గ్రూప్‌కు తానే అడ్మిన్ గా ఉండి ప్రతిరోజూ స్వయంగా పరిక్షిస్తున్నారు. వార్డెన్లంతా తమ హాస్టల్‌లోని పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తూ సెల్ఫీలు తీసుకోవాలి. వాటిని వెంటనే వాట్సాప్ గ్రూప్‌కు పంపాలి. ఈ చర్యతో మొత్తం మారిపోయింది. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పెరిగింది. అంతే కాంకుండా ప్రతిరోజూ సరైన సమయానికే ఆహారాన్ని అందిస్తున్నారు. అన్ని రకాల వసతలనూ తూచా తప్పకుండా కల్పిస్తున్నారు. పిల్లలు కూడా ఇంతకు ముందు కంటే ఇప్పుడు ఆనందంగా ఉన్నామని చెబుతున్నారు.

ఇలా.. తొలగించండి!



బాడీషుగరింగ్ అనే పద్ధతితో శరీరంపై ఉండే అనవసర వెంట్రుకలను తొలగించుకోవచ్చును. దీనిని తయారుచేసుకోవడానికి సగం చెక్క నిమ్మరసం, పంచదార ఒక చిన్నకప్పు, తేనె పావు కప్పు. మూడు బాగా కలిపి స్టవ్ మీద లేదా మైక్రోవోవెన్‌లో గాని బుడగలు వచ్చేవరకు వేడిచేసి పక్కన పెట్టుకోవాలి. శరీరంలో ఎక్కడయితే వెంట్రుకలు ఉన్నాయో ఆభాగాన్ని శుభ్రంగా కడిగి పొడిబట్టతో తుడుచుకోవాలి. కొద్దిగా మొక్కజొన్నపిండి, అది అందుబాటులో లేనట్లయితే ఇంట్లోని ఏదో ఒక పిండిని లేదా పౌడర్ తీసుకుని రాయాలి. ఇలా చేయటం వల్ల ఆ భాగంలో నూనె లాగివేయబడుతుంది. ఆ తర్వాత వెంట్రుకలు పెరిగే దిశలో పలుచగా గోరువెచ్చని బాడీ షుగరింగ్ రాయాలి. ఆ పై పలుచటి గుడ్డ తీసుకొని కప్పివేయాలి. ఆ గుడ్డపై చేతివేళ్లతో సుతారంగా రాయాలి. క్షణం తరువాత వెంట్రుకలు పెరిగే దిశకు వ్యతిరేక దిశలోంచి చటుక్కున తీసివేయాలి. కొద్దిపాటి నొప్పి వచ్చినా భరించి తీసివేయాలి. అలా రెండు మూడుసార్లు చేయాలి. మిగిలిన బాడీషుగరింగ్‌ని మళ్లీ వాడాలనుకున్నప్పుడు మళ్లీ వేడిచేసి వాడుకోవచ్చు. మరింత బాధ ఉంటే ఒక్కసారితో ఆపేసి బ్యూటీషియన్‌ని సంప్రదించండి.

వ్యాక్సింగ్: చాలా తేలికగా, నిదానంగా చేసుకునే పద్ధతి. పై బాడీషుగరింగ్ పద్ధతి కంటే ఇది చేసుకోవటం చాలా తేలిక. ఈ పద్ధతిలో పైపొరలో వెంట్రుకలను లాగివేసి, చర్మాన్ని మామూలు పద్ధతిలో ఉంచుకోవచ్చు. మొదట వ్యాక్సింగ్‌ను సన్నటి సెగమీద వేడిచేయాలి. వేడి అయిన వ్యాక్సింగ్‌ను పల్చగా తయారైన తరువాత శరీరాన్ని పట్టగలిగే వేడి చూసుకుని అనవసర వెంట్రుకలు ఉన్న ప్రదేశంలో కింద నుండి పై వైపుగా రాసి దానిపై కాటన్ క్లాత్‌ను వేసి కొంచెంగా అదిమి వెంటనే కింద నుండి పై వైపుగా లాగివేయాలి. వ్యాక్సింగ్‌ను రాసేముందు తప్పనిసరిగా పౌడర్ అద్దడం మరవద్దు. చేసుకోవటం కష్టంగా ఉండదు. పైగా శ్రమ కూడా తక్కువ.

మీ కోసం

బాదంపొడికి పచ్చిపాలు కలిపి ముఖానికి, మెడకి ప్యాక్‌గా వాడితే చర్మం మృదువుగా ఉంటంది.



సెన్సెక్స్ ▲ 155 | 31,750
నిఫ్టీ ▲ 56 | 9,912
రూపాయి ▲ 13 పైసలు | ఒక అమెరికా డాలరుకు రూ. 63.90



పుంజుకున్న ఇన్ఫీ సూచీ

- సెన్సెక్స్ 155 పాయింట్ల పరుగు

ముంబయి : కన్స్యూమర్ డ్యూరెబుల్స్, ఐటి, మౌలిక వసతుల సూచీల మద్దతుతో వరుసగా నాలుగో సెషన్‌లోనూ మార్కెట్లు పెరిగాయి. సానుకూల అంతర్జాతీయ పరిణామాలకు తోడు భారత్-చైనా మధ్య ఉద్రిక్తలు సద్దుమనగడం తదితర పరిణామాలు మార్కెట్లకు మద్దతునిచ్చాయి. గత కొద్ది రోజులుగా నేల చూపులు చూస్తోన్న ఇన్ఫోసిస్ షేర్ పుంజుకోడంతో పాటు ఎన్‌టిపిసి షేర్ కూడా రాణించడం తదితర పరిణామాల మధ్య సోమవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 154.76 పాయింట్లు లేదా 0.49 శాతం పెరిగి 31,750.82కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 55.75 పాయింట్లు లేదా 0.57 శాతం ర్యాలీతో 9,912.80 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్ నుంచి విశాల్ సిక్కా అనూహ్యంగా వైదొలిగిన తర్వాత భారీగా పడిపోయిన ఆ కంపెనీ షేర్ నిలేకని బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి రాణించింది. ఉదయం రూ.943 వద్ద ప్రారంభమైన ఇన్ఫీ సూచీ ఓ దశలో ఏకంగా రూ.953.95 గరిష్ట స్థాయిని తాకింది. మరో దశలో రూ.938 కనిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యింది. తుదకు రూ.940 వద్ద ముగిసింది. కాగా డాక్టర్ రెడ్డీస్‌కు వ్యతిరేకంగా అమెరికా కోర్టులో కేసు దాఖలు కావడంతో ఆ కంపెనీ షేర్ 2.9 శాతం మేర కోల్పోయింది. బిఎస్ఇలో రంగాల వారిగా కన్స్యూమర్ డ్యూరెబుల్స్ సూచీ 1.29 శాతం, ఐటి 1.25 శాతం, మౌలిక వసతులు 1.24 శాతం, టెక్ 1.14 శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్‌లో ఇన్ఫోసిస్ 3.14 శాతం, ఎన్‌టిపిసి 2.1 శాతం, సన్ ఫార్మా 1.96 శాతం, హీరో మోటో కార్ప్ 1.93 శాతం, హెచ్‌యుఎల్ 1.87 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్ 2.01 శాతం, టాటా మోటార్స్ 1.25 శాతం, పవర్ గ్రిడ్ 1 శాతం, ఎస్‌బిఐ 0.41 శాతం, టిసిఎస్ 0.38 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

హోస్ట్ ఎనలిటిక్స్ ఆర్అండ్‌డి విస్తరణ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో




క్లౌడ్ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ ఫెర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ (ఇపిఎం) పరిష్కారాలను అందించే హోస్ట్ ఎనలిటిక్స్ భారత్‌లో తన కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లోని తమ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డి) కేంద్రం సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తున్నామని తెలిపింది. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హోస్ట్ ఎనలిటిక్స్ సిఇఒ డేవిడ్ కెల్లొగ్ మాట్లాడుతూ ఇందుకోసం 25 మిలియన్ డాలర్ల (సుమారు రూ.162 కోట్లు) పెట్టుబడులు పెడుతున్నామన్నారు. కాగా వచ్చే మూడేళ్లలో తమ మానవ వనరులను కూడా రెట్టింపు చేసుకోనున్నామని తెలిపారు. దీంతో ఇంజనీరింగ్ ఉత్పత్తుల టెస్టింగ్ సామర్థ్యాన్ని పెంచుకోనున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో భాగస్వాములు, ఖాతాదారులను పెంచుకోనున్నామని తెలిపారు.

ప్రమాదకర బాండ్లలోకి ఇపిఎఫ్ నిధులు!

- ఎఎ+ కార్పొరేట్ బాండ్లపై దృష్టి
- తొలుత 3,000 కోట్ల పెట్టుబడులు
- కేంద్ర మంత్రి దత్తాత్రేయ వెల్లడి

హైదరాబాద్ : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) అధిక ఆదాయం కోసం ప్రమాదకర పెట్టుబడులను పరిశీలిస్తోంది. ఇందుకోసం ఎక్కువ రిస్క్‌తో కూడుకున్న కార్పొరేట్ బాండ్లపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ తరహా బాండ్లలోకి (ఎఎ+) దాదాపు రూ.3000 కోట్ల మేర ఇపిఎఫ్ఒ సొమ్మును పెట్టుబడిగా పెట్టనుంది. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర కారిక్మ శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ సోమవారం తెలిపారు. ఇప్పటి వరకు ఇపిఎఫ్ఒ సంస్థ ఎక్కువగా రిస్క్ లేని ఎఎఎ రేటెడ్ బాండ్లలో పెట్టుబడులు పెడుతూ వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సదరు బాండ్లలో రూ.15,000 కోట్ల మేర నిధులను పెట్టుబడిగా పెట్టాలని నిర్ణయించారు. అయితే తాజాగా ఈ మొత్తంలోంచి రూ.3000 కోట్ల మేర నిధులను ఎఎ+ రేటెడ్ బాండ్లకు తరలించాలని తాము నిర్ణయించినట్టుగా మంత్రి వెల్లడించారు. అధికాదాయంతో పెట్టుబడులను పెంచుకోవాలనే ధ్యేయంతోనే ఈ దిశగా తాము నిర్ణయం తీసుకున్నట్టుగా మంత్రి తెలిపారు. ఈ ఎఎ+ తరహా బాండ్లలో పెట్టుబడుల మూలంగా 25-45 బేసిస్ పాయింట్ల మేర అధిక ఆదాయం లభించగలదని బండారు దత్తాత్రేయ ఆయన వివరించారు.



అయితే సర్కారు తీసుకున్న నిర్ణయం పట్ల ఆర్థిక విశ్లేషకులు ఉద్యోగ వర్గాల్లో ఆందోళన కనిపిస్తోంది. అధిక మొత్తం వస్తుందన్న ఆశకు పోతే.. అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం లేకపోలేదని వారు అభిప్రాయపడుతున్నారు. పెట్టుబడుల కోసం బాండ్లను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకొనేలా సర్కారు జాగ్రత్తలు వహిస్తున్నట్టుగా ఈపీఎఫ్‌వో అధికారులు చెబుతున్నారు. రెండు రేటింగ్ ఏజెన్సీలు సదరు బాండ్లను మేటి బాండ్లని రేటింగ్‌ను ఇవ్వడంతో పాటు వరుసగా రెండేండ్ల నుంచి లాభాలను ఆర్జిస్తూ.. రూ.1000 కోట్లకు పైగా నెట్‌వర్త్ ఉన్న కంపెనీల్లోనే తాము పెట్టుబడులు పెట్టనున్నట్టుగా అధికారులు వివరిస్తున్నారు. స్టాక్ మార్కెట్లకు చెందిన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో (ఇటిఎఫ్) ఇపిఎఫ్ఒ సంస్థ గత రెండేండ్లుగా రూ.27,000 కోట్ల మేర నిధులను పెట్టుబడిగా పెట్టింది. వీటి నుంచి 12.55 శాతం వడ్డీ రానుందన్నారు. అయితే ఇపిఎఫ్ఒ సంస్థ సభ్యులకు కేవలం 8.65 శాతం వడ్డీ మాత్రమే చెల్లిస్తుందన్నారు. మిగతా సొమ్మును డివిడెండ్ల రూపంలో ఎలా పంచాలి అన్న విషయమై ఐఐఎం అహ్మదాబాద్ అందించిన నివేదకను పరిశీలించేందుకు గాను ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టుగా తెలిపారు.

భారీ డిపాజిట్లపై ఐటి గురి

న్యూఢిల్లీ : భారీ మొత్తంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు కలిగిన ఖాతాదారులపై ఆదాయపు పన్ను శాఖ గురి పెట్టింది. డిపాజిట్ల నుంచి ఎక్కువ వడ్డీ ఆదాయాలు ఆర్జిస్తున్న వారిపై దృష్టి సారించినట్లు సమాచారం. సీనియర్ సిటిజన్లతో సహా రూ.5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ వడ్డీ ఆదాయం ఆర్జిస్తున్న వారి లెక్కలు తేల్చాలని ఐటి శాఖ భావిస్తోందని సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సిబిడిటి) ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. వీరు తమ ఆదాయాన్ని పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయంలో చూపించడం లేదన్నారు. ప్రస్తుతం తమ దృష్టంతా ఎక్కువ మొత్తంలో పన్ను ఎగవేతదారులపైనేనని ఉందన్నారు.

సిగ్నా టిటికె నుంచి 'ఇన్ఫ్లేషన్ షీల్డ్' పాలసీ

హైదరాబాద్ : ఆరోగ్య బీమాను అందించే సిగ్నా టిటికె ఇన్ఫ్లేషన్ షీల్డ్ పేరుతో కొత్త పాలసీని అందుబాటులోకి తెచ్చినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలో వైద్య ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయిలో పెరుగుతుందని సిగ్నా ఆరోగ్య బీమా సిఇఒ సందీప్ పటేల్ పేర్కొన్నారు. దీన్ని బీమా పాలసీదార్లు అధిగమించడానికి వీలుగా ఈ పాలసీ ద్వారా అదే క్లయిమ్‌తో సంబంధం లేకుండా ప్రతి సంవత్సరం బీమా మొత్తాన్ని సర్దుబాటు చేస్తామన్నారు.

5,954 మందిపై చర్యలు

- రూ.70వేల కోట్ల ఎన్‌పిఎలు వారివే..
- పిఎస్‌బిల సన్నద్ధం

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకులకు పెద్ద మొత్తంలో ఉద్దేశ్యపూర్వకంగా ఎగ్గొట్టిన మొండి బాకీల రికవరీకి ఆ బ్యాంకులు సిద్ధం అవుతున్నాయి. 5,954 మంది మొండి బకాయిదార్లు 2017 మార్చి 31 నాటికి పిఎస్‌బిలకు ఉద్దేశ్యపూర్వకంగా రూ.70,000 కోట్ల మేర ఎగ్గొట్టారు. వీరిపై సెక్యూరిటీస్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సర్ఫైయిసీ) చట్టం ప్రకారం వీరిపై పిఎస్‌బిలు చర్యలు తీసుకోనున్నాయని ఆర్థిక మంత్రిత్వశాఖ పేర్కొంది. దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ ఎస్‌బిఐ ఈ తరహాకు చెందిన 1,444 మంది డిఫాల్టర్లపై చర్యలు తీసుకోనుంది. వీరంతా ఆ బ్యాంకుకు రూ.20,943 కోట్ల బాకీలను కావాలనే ఎగ్గొట్టారు. మిగితా 20 బ్యాంకులకు 4,510 మంది రూ.48,496 కోట్ల విలువ చేసే అప్పులు కావాలనే చెల్లించలేదు. ఆర్థిక శాఖ గణంకాల ప్రకారం 2016-17 ముగింపు నాటికి మొత్తం ప్రభుత్వ రంగ బ్యాంకులకు వివిధ కంపెనీలు, వ్యక్తులు ఉద్దేశ్యపూర్వకంగా రూ.92,376 కోట్లు ఎగనామం పెట్టారు. 2015-16 ముగింపు నాటి అప్పులతో పోల్చితే ఇవి 20.4 శాతం అదనం. ఏడాదికేడాదితో పోల్చితే ఎగవేతదారుల సంఖ్యలో 10 శాతం మంది పెరిగారు. 2016 మార్చి ముగింపు నాటికి 8,167 ఉద్దేశ్యపూర్వక ఎగవేతదార్లు ఉండగా, 2017 మార్చి నాటికి ఈ సంఖ్య 8,915 మందికి చేరింది. కాగా 8,915 మందిలో తీవ్రంగా భావించిన 1,914 మందిపై ఎఫ్ఐఆర్ కేసులను నమోదు చేశారు. వీరు పిఎస్‌బిలకు రూ.32,484 కోట్లు చెల్లించాల్సి ఉంది. 2016-17లో ఎస్‌బిఐ, ఎస్‌బిఐ అసోసియేట్ బ్యాంకులను కలుపుకుని మొత్తం 28 పిఎస్‌బిలు రూ.81,683 కోట్ల మేర అప్పులను రాని బాకీల కింద రద్దు చేశాయి. గత ఐదు సంవత్సరాల్లో ఈ స్థాయిలో రద్దు చేయడం ఇదే తొలిసారి. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో రద్దు చేసిన వాటితో పోల్చితే 41 శాతం అదనం.




నేడు ఎన్‌టిపిసిలో డిజిన్వెస్ట్‌మెంట్

- విక్రయానికి 5 శాతం వాటా



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తిదారు అయినా నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టిపిసి)లో కేంద్ర ప్రభుత్వం 5 శాతం వాటాను ఉపసంహరించుకోనుంది. రూ.7,000 కోట్ల విలువ చేసే వాటాలను మార్కెట్ శక్తులకు విక్రయించనుంది. ఈ వాటాలను ఉపసంహరించడానికి వీలుగా రెండు రోజుల పాటు ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్) నిర్వహిస్తున్నట్లు ఒక ఉన్నతాధికారి తెలిపారు. మంగళవారం నుంచి ఒఎఫ్ఎస్ ప్రారంభం కానుంది. షేర్ కనీస ధర రూ.168గా నిర్ణయించింది. సోమవారం బిఎస్ఇలో ఎన్‌టిపిసి షేర్ 2.5 శాతం పెరిగి రూ.173.55 వద్ద ముగిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు మోడీ సర్కార్ ఆరు పిఎస్‌యుల్లో డిజిన్వెస్ట్‌మెంట్ ప్రక్రియ చేపట్టింది. వీటి ద్వారా రూ.8,800 కోట్లు సమీకరించింది. ఇందులో స్పెసిఫైడ్ అండర్‌టేకింగ్ ఆఫ్ యూనిట్ ట్రస్టు ఆఫ్ ఇండియా (ఎస్‌యుయుటిఐ) ద్వారా ఎల్అండ్‌టిలో ఉన్న వాటాను ఉపసంహరించుకుంది. 2017-18లో వివిధ పిఎస్‌యుల్లో మొత్తంగా రూ.72,500 కోట్ల విలువ చేసే వాటాలను విక్రయించాలని బిజెపి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

గ్రూప్స్, ఇతర పోటీపరీక్షల ప్రత్యేకం





ఎవిపి.రాజు,
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

'ది సర్వెంట్స్ ఆఫ్ ఇండియా' స్థాపకుడెవరు ?

భారతదేశ చరిత్ర - జాతీయోద్యమం

చౌరాచౌరీ సంఘటన (05-02-1922)

సహాయ నిరాకరణోద్యమం ఉధృతంగా జరుగుతున్న కాలంలో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లాలో చౌరాచౌరీ అనే గ్రామంలో పోలీసులకు, ప్రజలకు మధ్య జరిగిన సంఘర్షణలో 22 మంది పోలీసులను ప్రజలు సజీవ దహనం చేశారు. ఈ సంఘటనతో గాంధీజీ ఉద్యమాన్ని నిలిపివేశారు.

స్వరాజ్య పార్టీ (1923)

మాంటేగ్ -ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణల ద్వారా ఎన్నికల్లో పాల్గొని ఆంగ్ల ప్రభుత్వాన్ని శాసనసభలో ఎదిరించాలనే ఉద్దేశంతో చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ, విఠల్‌భాయ్ పటేల్ తదితరులు స్వరాజ్య పార్టీని స్థాపించారు.

సైమన్ కమిషన్ (1927)

మాంటేగ్-ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రజాదరణ పొందలేకపోవడానికి గల కారణాలను పరిశీలించడానికి బ్రిటీష్ ప్రభుత్వం 1927లో లార్డ్ సైమన్ నాయకత్వంలో ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్‌లోని సభ్యులందరూ ఆంగ్లేయులు. భారతీయులకు ఇందులో ప్రాతినిధ్యంలేదు. అందువల్ల కాంగ్రెస్ 'సైమన్ గోబాక్' అనే నినాదాలతో నల్లజెండాల ప్రదర్శనలతో ఈ కమిషన్‌ను బహిష్కరించింది.

1929 లాహోర్ కాంగ్రెస్ సమావేశం - సంపూర్ణ స్వరాజ్య తీర్మానం

క్రీ.శ 1929 డిసెంబర్ 29న కాంగ్రెస్ లాహోర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన సమావేశమై సంపూర్ణ స్వరాజ్యమే తన ఆశయమని ప్రకటించింది. డిసెంబర్ 31 అర్ధరాత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు నెహ్రూ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. 1930 జనవరి 26వ తేదీన భారతదేశమంతటా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకున్నారు.

ఉప్పు సత్యాగ్రహం (1930)

1930 మార్చి 12న గాంధీజీ సబర్మతీ ఆశ్రమం నుంచి 79 మంది అనుచరులతో బయలుదేరి 200 మైళ్ల దూరంలో గుజరాత్ తీరంలోని దండి గ్రామం దగ్గర ఏప్రిల్ 6న ఉప్పును తయారు చేసి శాసనోల్లంఘన ఉద్యమాన్ని ప్రారంభించారు. (ఐఎన్‌సి అహమ్మదాబాద్ సమావేశంలో గాంధీజీకి సర్వ అధికారాలు ఇచ్చారు). అందుకే దీనికి దండి సత్యాగ్రహం/ ఉప్పు సత్యాగ్రహం అని పేరు వచ్చింది.

గాంధీ-ఇర్విన్ ఒడంబడిక

1931 మార్చి 5న గాంధీ-ఇర్విన్ ఒడంబడికతో శాసనోల్లంఘన ఉద్యమాన్ని తాత్కాలికంగా విరమించారు. గాంధీజీ పిలుపును అనుసరించి ప్రజలు శాంతీయుతంగా విదేశీ వస్తు బహిష్కరణను, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలలో నిమగ్నమయ్యారు.

కమ్యూనల్ అవార్డు (1931)

రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని గాంధీజీ తిరిగి రాగానే ఎర్రవాడజైలులో నిర్బంధించారు. అనంతరం బ్రిటిష్ ప్రభుత్వం 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించి (రామ్‌సేమెక్‌డోనాల్డ్) నిమ్నజాతులకు, ఇండియన్ క్రైస్తవులకు, ఆంగ్లో-ఇండియన్లకు, ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేసింది.

పూనా ఒడంబడిక (1932)

కమ్యూనల్ అవార్డుకు నిరసనగా గాంధీజీ ఎర్రవాడ జైలులో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. అప్పుడు అంబేద్కర్, గాంధీజీతో ఒక ఒడంబడిక చేసుకొని హరిజనులకు ప్రత్యేక నియోజకవర్గాలకు బదులు జనరల్ నియోజకవర్గాల్లోనే కొన్నింటిని షెడ్యూల్డు కులాలకు రిజర్వు చేయడానికి అంగీకరించారు. దీనినే 'పూనా ఒడంబడిక' అంటారు.

1935 భారత ప్రభుత్వ చట్టం - కాంగ్రెస్ మంత్రివర్గాలు

కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వం, రాష్ట్రాలలో పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. ఇందుకోసం క్రీ.శ 1936లో జరిగిన రాష్ట్ర శాసనసభల ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించి, పలు రాష్ట్రాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

రెండో ప్రపంచయుద్ధం - కాంగ్రెస్ మంత్రివర్గాల రాజీనామా

1939లో రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. కాంగ్రెస్‌ను సంప్రదించకుండా బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్ని జర్మన్ శత్రుదేశంగా ప్రకటించింది. అందుకు నిరసనగా కాంగ్రెస్ మంత్రివర్గాలు 1939 డిసెంబర్ 22న రాజీనామా చేశాయి. జిన్నా పిలుపు మేరకు ముస్లిం లీగ్ ఈరోజును 'విమోచన దినం'గా జరుపుకున్నారు.

ముస్లింలీగు - పాకిస్తాన్ తీర్మానం (1940)

ముస్లింలీగ్ క్రీ.శ 1940లో లాహోర్‌లో మహమ్మద్ ఆలీజిన్నా అధ్యక్షతన సమావేశమై ముస్లింలకు ఇండియాలో ప్రత్యేక రాజ్యం-పాకిస్తాన్ కావాలని తీర్మానం చేసింది.

క్రిప్సు రాయబారం (1942)



రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్నప్పుడు 1942లో బ్రిటన్‌కు వ్యతిరేకంగా జపాన్ పాల్గొని అనతికాలంలోనే తూర్పు ఇండియా దీవులు, మలియా, బర్మాలను ఆక్రమించేందుకు ఇండియాపై దండయాత్రకు సిద్ధమైంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో బ్రిటిష్ ఇండియా రక్షణకు భారతీయుల సహకారం అవసరమని భావించిన ఆంగ్ల ప్రభుత్వం సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌ను ఇండియాకు రాయబారిగా పంపించింది. క్రిప్సు ముస్లింల పాకిస్తాన్ తీర్మానాన్ని తోసిపుచ్చాడు. దేశ రక్షణశాఖ మినహా ప్రభుత్వాన్ని భారతీయులు పరం చేయడానికి ఒప్పుకున్నాడు. కాంగ్రెస్ ఈ సూచనలను తిరస్కరించింది. ఈ విధంగా క్రిప్స్ రాయబారం విఫలమైంది.

క్విట్ ఇండియా ఉద్యమం - 1942 ఆగస్టు విప్లవం

క్రిప్స్ రాయబారం విఫలం కావడంతో, కాంగ్రెస్ గాంధీజీ అధ్యక్షతన ముంబయిలో సమావేశమై 1942 ఆగస్టు 8వ తేదీన క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించి, క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ గాంధీజీ తన ఉపన్యాసాన్ని 'విజయమో వీరస్వర్గమో' (డూ ఆర్ డై) అనే నినాదంతో ముగించారు. దీంతో ప్రజలందరూ ఉద్రేకపూరితులై క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. సమ్మెలు, హర్తాళ్లు, దౌర్జన్య చర్యలకు దిగారు. దీనినే 'ఆగస్టు విప్లవం' అంటారు.

ఆజాద్ హింద్‌ఫౌజ్ - నేతాజీ

నేతాజీ రెండో ప్రపంచయుద్ధంలో పాల్గొని జర్మనీ, జపాన్‌ల సహాయంతో భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించాలని భావించారు. బ్రిటిష్‌వారు విధించిన గృహ నిర్బంధం నుంచి తప్పించుకుని జర్మనీ వెళ్లి హిట్లర్ సహకారాన్ని పొందాడు. తరువాత జపాన్ వారి సహాయంతో భారతీయ యుద్ధ ఖైదీలను, బర్మా, మలయా, సింగపూర్‌లో ఉన్న భారతీయులతో ఆజాద్ హింద్‌ఫౌజ్ (ఇండియన్ నేషనల్ ఆర్మీ)ని తయారు చేశాడు. ఈ సైన్యానికి 'ఛలోఢిల్లీ' 'జైహింద్' నినాదాలతో ఉత్సాహాన్ని, ఉద్రేకాన్ని కలిగించాడు.

భారత నౌకాదళం తిరుగుబాటు (1946)

1946 ఫిబ్రవరి 18న ముంబయిలో భారత నౌకాదళం సైనికులు బ్రిటిష్ నౌకాదళపతిపై తిరుగుబాటు చేశారు. జాతీయనాయకుల విజ్ఞప్తి మేరకు నావికులు ప్రభుత్వానికి లొంగిపోయారు.

మంత్రిత్రయరాయబారం (1946)

రెండో ప్రపంచయుద్ధం తరువాత ఇంగ్లాండులో లేబరుపార్టీ అధికారంలోకి వచ్చింది. భారత స్వాతంత్రోద్యమం పట్ల సానుభూతి ఉన్న క్లిమెంట్ అట్లీ ప్రధానమంత్రి అయ్యాడు. భారత్‌కు స్వాతంత్ర్యాన్ని ఇవ్వడానికి 1946లో ముగ్గురు మంత్రులు పెథిక్ లారెన్స్, సర్‌స్టాఫర్డ్ క్రిప్స్, ఎ.వి అలెగ్జాండర్‌లతో కూడిన రాయబారాన్ని అట్లీ భారత్‌కు పంపించాడు. వీరు మనదేశ నాయకులతో చర్చించి 1. దేశవిభజన చేయకూడదు, 2. కాంగ్రెస్, ముస్లింలీగు ప్రతినిధులతో కూడిన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయాలి, 3. నూతన రాజ్యాంగ నిర్మాణానికి రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటు చేయాలి, 4. చివరకు భారత్ నుంచి ఆంగ్లేయులు నిష్క్రమించాలి. అనే సూచనలు చేశారు.

తాత్కాలిక ప్రభుత్వం - 1946

అమాత్యత్రయ రాయబారం చేసిన సూచనల ప్రకారం క్రి.శ 1946లో నెహ్రూ ప్రధానిగా, కాంగ్రెస్, ముస్లింలీగు మంత్రులతో కూడిన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. డాక్టర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షునిగా రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు చేశారు.

ముస్లింలీగు ప్రత్యక్ష చర్య (1946 ఆగస్టు 16)

లాహోర్ ముస్లింలీగ్ సమావేశంలో మహ్మద్ ఆలీ జిన్నా ద్విజాతి సిద్ధాంతం ఆధారంగా పాకిస్తాన్ ఏర్పాటుకు ముస్లిం లీగ్ ప్రతిపాదించింది. 1946 ఆగస్టు 16న పాకిస్తాన్ సాధన కోసం ప్రత్యక్ష చర్య దినానికి ముస్లింలీగ్ పిలుపునిచ్చింది. తత్ఫలితంగా హిందూ-ముస్లిం కొట్లాటలు దేశమంతటా వ్యాపించాయి. ఈ పరిస్థితుల్లో ఇండియాకు దేశవిభజన తప్ప వేరొక మార్గం లేదని బ్రిటిష్ రాజప్రతినిధి అయిన లార్డ్ మౌంట్ బాటన్ భావించాడు.

మౌంట్ బాటెన్ ప్రణాళిక (3-06-1947)

భారత ఉపఖండాన్ని ఇండియా-పాకిస్తాన్‌లుగా విభజిస్తూ 3-6-1947న బాటన్ ఒక ప్రణాళికను ప్రకటించారు. ఈ విభజన గాంధీ మొదలైన కాంగ్రెస్ నాయకులకు ఇష్టంలేదు. అయినప్పటికీ చేసేదిలేక కాంగ్రెస్ నాయకులు దీనికి ఒప్పుకున్నారు.

స్వాతంత్ర్య సముపార్జన-దేశవిభజన

మౌంట్‌బాటన్ ప్రణాళిక ఆధారంగా ఇంగ్లాండు పార్లమెంటు 18-7-47న భారత స్వాతంత్ర్య చట్టాన్ని చేసింది. ఈ చట్టం ప్రకారం క్రీ.శ 15-8-1947న భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ భారతదేశం ఇండియా, పాకిస్తాన్‌లుగా విడిపోయింది. ★



ROUND TABLE CONFERENCE

అఖిలపక్ష సమావేశాలు

- ✧ 1930 లండన్‌లో మొదటి రౌండ్‌టేబుల్ సమావేశం
- ✧ 1931లో జరిగిన రెండో రౌండ్‌టేబుల్ సమావేశానికి గాంధీజీ హాజరయ్యారు.
- ✧ 1932లో జరిగిన మూడో అఖిలపక్ష సమావేశం. దీని తర్వాతనే 1935లో భారత ప్రభుత్వ చట్టం చేసింది.

నమూనా ప్రశ్నలు

1. 'ది సర్వెంట్స్ ఆఫ్ ఇండియా' స్థాపకుడు ఎవరు ? **- గోపాలకృష్ణ గోఖలే**
2. గాంధీ చంపారన్ సత్యాగ్రహం ఎప్పుడు చేశారు ? **- 1917లో**
3. ఖిలాఫత్ ఉద్యమం ఎప్పుడు జరిగింది ? **- 17-10-1916**
4. ఏ సమావేశంలో జిన్నా అధ్యక్షతన ముస్లింలీగ్ ప్రత్యేక రాజ్యం కావాలని కోరింది ? **- లాహోర్ 1940**
5. గాంధీకి 'మహాత్మ' అని బిరుదును ఇచ్చిందెవరు ? **- ఠాగూర్**
6. 'స్వాతంత్ర్యం నా జన్మహక్కు' దాన్ని నేను పొందుతాను' అన్నది ఎవరు ? **- తిలక్**
7. సైమన్ కమిషన్ వ్యతిరేక నిరసనలో పంజాబులో ప్రాణత్యాగం చేసినవారు ? **- లజపతిరాయ్**
8. బెంగాల్ విభజన ఎప్పుడు రద్దయ్యింది ? **- 1911**
9. రాష్ట్రాలందలి ద్వంద్వ ప్రభుత్వం ఏ చట్టంతో రద్దయ్యింది ? **-1935 చట్టం**
10. 'ఇండియన్ స్ట్రగుల్' గ్రంథకర్త ఎవరు ? **- గాంధీజీ**
11. రౌలత్ యాక్ట్‌ను ఏ వైస్రాయ్ కాలంలో చేశారు ? **- చేమ్స్‌ఫర్డ్**
12. మొదటిసారి దేశమంతా స్వాతంత్ర్య దినోత్సవం ఎప్పుడు జరిపారు ? **- 26-01-1930**
13. 1907 ఐఎన్‌సి అధ్యక్షుడు ఎవరు ? **- రాస్‌బిహారి బోస్**
14. 1916 ఐఎన్‌సి అధక్షుడు ఎవరు ? **-ఎసి మజుందార్**
15. 1947 ఐఎన్‌సి అధ్యక్షుడు ? **- జె.బి.కృపలాని**
16. ఏ ప్రతిపాదన మొదటిసారి భారతీయులకు రాజ్యాంగ రచనా హక్కును ప్రసాదించింది ? **- 1940 ఆగస్టు ఆఫర్**
17. క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానాన్ని వ్యతిరేకించింది ఎవరు ? **- బహుల్లాభాయ్ దేశాయ్, రాజగోపాలాచారి**
18. 1947 ఆగస్టు 15 నాటికి ఇండియాలో చేరని సంస్థానాలు ? **- జునాఘడ్, కాశ్మీర్, హైదరాబాద్**

ఉద్యోగాలు

ఐటీబీపీలో ఉద్యోగాలు

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ)లో కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మ్యాన్) కొలువుల భర్తీకి ప్రకటన వెలువడింది.

ట్రేడ్‌ల వారీగా ఖాళీలు : టైలర్-19, గార్డెనర్-38, కొబ్లర్-27, వాటర్ క్యారియర్-95, సఫాయి కర్మచారి-33, కుక్-55, వాషర్‌మ్యాన్-25, బార్బర్-11.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో మాత్రమే అప్లై చేయాలి.
దరఖాస్తు చివరి తేదీ : సెప్టెంబర్ 7, 2017.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.
వెబ్‌సైట్ : www.itbpolice.nic.in, www.recruitment.itbpolice.nic.in

నష్టపోయిన మిర్చి రైతులకు న్యాయం చేయాలి

ఏపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూలపెద్దిరెడ్డి డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

2016-17 సీజన్‌లో ఎండిన మిర్చిపంటకు నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూల పెద్దిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లాలో ఎండిన మిర్చిపంటకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో పూలపెద్దిరెడ్డి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రైతులు వేసిన మిర్చిపంట వర్షాభావంతో ఎండిపోయిందనీ, ఎకరాకు లక్షరూపాయిలు రైతులు ఖర్చుపెట్టారన్నారు. పంట చేతిక రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయరన్నారు. ఎండిన మిర్చిపంటకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ.. జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో వర్షాలు లేక బోర్లు ఎండిపోయాయన్నారు. రైతుసాగు చేసిన మిర్చి పంట ఎండిపోయిందన్నారు. అనంతరం కలెక్టర్ వినయ్‌చంద్‌కు వినతిపత్రం సమర్పించారు.

'కరువు రైతులను ఆదుకోవాలి'

ప్రజాశక్తి-ఆత్మకూరు

వరుస కరువులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రాయలసీమ అభివృద్ధి సబ్ కమిటీ కన్వీనరు జి.ఓబులు డిమాండ్ చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో కరువుపై నిర్వహిస్తున్న జీపుజాతాను ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. రాప్తాడు నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో జీపుజాతా నిర్వహిస్తామన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చ కుండా రైతులను ప్రభుత్వం వంచించిందన్నారు.

ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

- గెడ్డలో కొట్టుకుపోయి గిరిజనుడి మృతి
- పలు చెరువులకు గండ్లు
- పొంగిపొర్లిన గెడ్డలు, వాగులు
- పలు గ్రామాలు జలమయం
- వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం
- ఉధృతంగా నాగావళి నది



శ్రీకాకుళం జిల్లా పలాస మండలం కంబిరిగాం బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న నీటిలో నుంచి సురక్షిత ప్రాంతానికి వెళ్తున్న గ్రామస్తులు



విశాఖ జిల్లా ముంచంగిపుట్టులో వర్షానికి దెబ్బతిన్న ఇళ్లు

ప్రజాశక్తి- విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల యంత్రాంగం

అల్పపీడన ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ భారీ వర్షాలు కురిశాయి. ఆ జిల్లాల్లోని గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి. విశాఖ జిల్లా జి.మాడుగుల మండలంలోని రచ్చపల్లి గ్రామానికి చెందిన సెగ్రేకి రామారావు గెడ్డవాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు. గెడ్డలకు, చెరువులకు గండ్లు పడటంతో వేలాది ఎకరాల్లో వరి, ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రిజర్వాయర్లలోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భారీ వర్షాలకు లోతట్టు గ్రామాలు జలమయ్యాయి. పలు గ్రామాల్లోకి వరద నీరు చేరుకుంది.

విశాఖ జిల్లాలో సోమవారం రోజంతా వర్షం కురిసింది. మన్యంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. కొండవాగులు, గెడ్డలు ఉప్పొంగడంతోపాటు వర్షపు నీరు రోడ్లపై ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. అనేక గిరిపల్లెలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. జి.మాడుగుల మండలంలోని మత్స్యమాడుగులమ్మ చెరువు, కోడిమామిడి, సంగం, కుంబిడిసింగి గ్రామాలకు ఆనుకొని ఉన్న మత్స్యగెడ్డ ఉధృతంగా ప్రవహించింది. కిల్లంకోట, కుంబిడిసింగి పంచాయతీల్లోని కొన్ని గ్రామాలు జల దిగ్బంధంలో ఉండిపోయాయి. విద్యుత్, సెల్ సేవలకు సైతం అంతరాయం ఏర్పడింది. ఈ మండలంలోని రచ్చపల్లి గ్రామానికి చెందిన సెగ్రేకి రామారావు గెడ్డవాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు. ముంచింగిపుట్టు మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ కేంద్రం బుంగాపుట్టు వెళ్లే ప్రధాన రహదారిలో సుత్తిగుడ, ముంతగుమ్మి, బిరిగుడ గెడ్డలు పొంగి వరద నీరు రోడ్లపై నుంచి ప్రవహించడంతో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి. బుంగాపుట్టు, బూసిపుట్టు, వనుగుమ్మ, రంగబయలు, లక్ష్మీపురం, బాబుశాల పంచాయతీల్లో 42 గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ముంచింగిపుట్టు మండల కేంద్రంలో పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ఇక్కడ రెండిళ్లు కూలిపోయాయి. మూడు రోజులుగా వర్షం కురుస్తుండడంతో చాపరాయి పర్యాటక ప్రాంతం పర్యాటకులు లేక వెలవెలబోయింది. వందలాది హెక్టార్లలో వరి, మిరప పంటలు ముంపుబారిన పడ్డాయి. ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లోని మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీటిని అందించే డుడమ జలాశయంలోని నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరింది. అలాగే మైదానంలోనూ రోజంతా వర్షం కురిసింది.

శ్రీకాకుళం జిల్లాలో గత మూడు రోజులుగా పలు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పాలకొండ మండలంలోని జంపరకోట గెడ్డకు వి.పి.రాజుపేట వద్ద మూడు చోట్ల గండిపడటంతో సుమారు రెండు వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. వారాడ గెడ్డ పొంగడంతో 500 ఎకరాల్లో వరి నేలమట్టమైంది. పాలకొండ పట్టణంలోని గారమ్మ కాలనీ, గాయత్రీ నగర్ నీటిముంపునకు గురయ్యాయి. పాతపట్నం మండలంలోని గుమ్మగెడ్డకు మూడు చోట్ల గండ్లు పడడంతో సుమారు 500 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. వీరఘట్టం మండలం కె.ఇచ్ఛాపురం వద్ద కుంబిడి గెడ్డ వద్ద చెక్‌డ్యామ్ కొట్టుకుపోయి 70 ఎకరాల్లోని వరి పొలాల్లో ఇసుక మేటలు వేసింది. టెక్కలి మండలం లింగాలవలస గ్రామంలో 30 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. టెక్కలిలోని ముండాపా, ఎన్‌టిఆర్ కాలనీల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. పలాస మండలం కంబిరిగాం, బ్రాహ్మణతర్లాలోని వరహాలగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో వంద ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. కంబిరిగాం వంతెనపై నుంచి నీరు ప్రవహించడంతో పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తూరులోని కుమ్మర వీధిలో కుమ్మరి సింహాచలం పూరింటి గోడ కూలడంతో ద్విచక్ర వాహనం దెబ్బతింది. పలాస మున్సిపాలిటీ ఉల్లాసపేటలో ఆదివారం రాత్రి గోడ కూలి తంగుడు వైకుంఠరావుకు చెందిన కారు ధ్వంసమైంది.

విజయనగరం జిల్లా కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, సీతానగరం, వేపాడ, ఎల్.కోట, జామి తదితర మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. పలు చెరువులు వర్షపు నీటితో నిండిపోయాయి. నాగావళి నది ఉధృతికి తోటపల్లి నిర్వాసిత గ్రామమైన బాసంగి జలమయమైంది. కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లో పలు చెరువులకు గండ్లు పడటంతో సుమారు రెండు వేల ఎకరాల్లో వరి, అరటి పంటలు నీట మునిగాయి. పార్వతీపురంలో వరహాలగెడ్డ వల్ల రాజీవ్ గృహకల్ప, ఎస్ఎన్ఎన్ పురం, వివేక్ కాలనీ, నెల్లిచెరువు గట్టు తదితర ప్రాంతాల్లో వరద నీరు చేరింది. నాగావళి నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. నదిలోకి 15 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో అధికారులు దిగువకు 38,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 105 మీటర్లు కాగా, ప్రస్తుతం 104.75 మీటర్లకు చేరుకుంది.



తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగి సమీపంలోని వాగులో కొట్టుకుపోతున్న ఆటోను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న డ్రైవర్ ప్రసాద్

వాగులో కొట్టుకుపోయిన ఆటో

ప్రజాశక్తి-రాజవొమ్మంగి (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన రాజవొమ్మంగి లాగరాయి వాగులో భారీ వర్షంతో ఆటో కొట్టుకుపోయింది. ఈ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మడేరు వాగు, కింద్రా పెద్దేరు, వట్టిగడ్డ, లాగరాయి వాగులు పొంగాయి. రాజవొమ్మంగి-ఏలేశ్వరం రహదారిపైకి వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లబ్బర్తి, రాజవొమ్మంగి గ్రామాల మధ్య లాగరాయి వాగు పొంగింది. వాగు ఉధృతికి ఆటో కొట్టుకుపోయింది. లబ్బర్తి గ్రామానికి చెందిన బొరగ దుర్గాప్రసాద్ ఆటోలో అదే గ్రామానికి చెందిన పి.చిన్నారావు, ఎం.సత్తిబాబు, ఎం.బాలరాజు బియ్యం తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా నీటి ఉద్రుతి పెరగడంతో ఆటో అదుపుతప్పి వాగులో కొట్టుకుపోయింది. ఈ సమయంలో ఆటోలో వారు కిందకు దూకేయడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఆటో విలువ లక్షా యాభై వేల రూపాయలు ఉంటుందని బాధితుడు ప్రసాద్ తెలిపాడు.

నిర్మాణ రంగ కార్మికులకు చట్టం అమలులో వైఫల్యం

- సిడబ్ల్యూఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి దెబంజన్ చక్రవర్తి
- నేటి నుంచి సిడబ్ల్యూఎఫ్ఐ కమిటీ సమావేశాలు



విజయవాడలో జరిగిన సభలో మాట్లాడుతున్న అఖిల భారత భవన నిర్మాణ కార్మిక ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దేబంజన్ చక్రవర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భవన నిర్మాణ కార్మికుల కోసం 1996లో ఏర్పాటు చేసిన చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సిడబ్ల్యూఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి దెబంజన్ చక్రవర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 11 ఏళ్ల తరువాత కూడా ఈ చట్టం పూర్తి రూపం దాల్చలేదని తెలిపారు. సిడబ్ల్యూఎఫ్ఐ 60వ జాతీయ కార్యవర్గ సమావేశాలను మంగళ, బుధ వారాల్లో విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేసింది. ఈ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చక్రవర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డుపై రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆయన విమర్శించారు. దేశవ్యాప్తంగా 5.20 కోట్ల మంది భవన నిర్మాణ కార్మికులుంటే, కేవలం 1.20కోట్ల మందే బోర్డులో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. కార్మికులు బోర్డులో సభ్యత్వం తీసుకొనే విధంగా ప్రభుత్వాలు ప్రచారం చేయడం లేదన్నారు. బోర్డు నిధులను కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయడం లేదన్నారు. రూ.32,632 కోట్లు నిధులుంటే, కేవలం రూ.7,515 కోట్లు మాత్రమే కార్మికుల కోసం ఖర్చు చేసినట్లు స్టాండింగ్ కమిటీ పార్లమెంట్‌కు నివేదిక అందజేసిందని వివరించారు. మిగిలిన నిధులను ఏక్కడకి వెళ్లాయని పార్లమెంట్‌లో కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. భవన నిర్మాణ కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని, అందులో భాగంగానే కార్మికులను కాకుండా యంత్రాలను ఉపయోగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రమాద బీమా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా అమలవుతోందని, దేశవ్యాప్తంగా ఒకే విధంగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి జిల్లాలో యూనియన్‌ను బలపరచి, కార్మికుల కోసం పోరాడే వామపక్ష అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ అథర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక మాఫీయా తయారు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని వ్యాఖ్యానించారు. జిఎస్టీ వల్ల నిర్మాణ రంగం కుదేలయిందన్నారు. పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టుల కాంట్రాక్టర్లు నిర్మాణ రంగం సెస్ కట్టలేదని తెలిపారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరూ ఒకే విధానాలను అమలు చేస్తున్నారని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కోటంరాజు విమర్శించారు.



విద్యుత్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎం.బాలకాశి

30 తరువాత ఎప్పుడైనా సమ్మె

నోటీసులు అందించిన యుఇఇయు

ప్రజాశక్తి యంత్రాంగం

జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లలో పనిచేస్తున్న 25 వేల మంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పునుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పీస్ రేట్ కార్మికులందరికీ కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేస్తున్న ప్రయోజనాలు అమలు చేయాలని, సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే సెప్టెంబర్ 30వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఇయు) సమ్మె నోటీసులను అందించింది. సోమవారం పలు జిల్లాల్లో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ఎస్ఇలకు సమ్మె నోటీసులను అందించారు. రాష్ట్రంలోని విద్యుత్ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సెప్టెంబరు 30లోగా పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వకుంటే తరువాత ఏ రోజైనా కార్మికులు సమ్మెకు దిగుతారని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి హెచ్చరించారు. విజయవాడలో సోమవారం కృష్ణాజిల్లా విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధుల సమావేశం ఎపి విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సయ్యద్ మూసా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో బాలకాశి మాట్లాడుతూ.. కృష్ణాజిల్లాలోని విద్యుత్ కాంట్రాక్టు సంఘాల తరుపున సమ్మె నోటీసులు అందజేసినట్లు తెలిపారు. ఇతర రంగాలకు చెందిన కార్మిక సంఘాలను కలుపుకుని పోరాటం చేస్తామని చెప్పారు. జెఎసి నాయకులు కూడా కాంట్రాక్టు కార్మికుల సమ్మెపై చర్చించి మద్దతు ఇవ్వాలని కోరారు. విశాఖ విద్యుత్ సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ విశాఖ రీజియన్ అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా తెలుగుదేశం ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అనంతరం ఎస్ఇ (ఆపరేషన్స్)కి సమ్మె నోటీసును అందజేశారు. శ్రీకాకుళంలో ఎస్ఇ డి.సత్యనారాయణను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు ఆధ్వర్యాన కార్మికులు వెళ్లి తమ సమస్యలను వివరించి సమ్మె నోటీసును అందజేశారు. ఒంగోలులో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పవర్ ఆఫీసు వద్ద ఉన్న ట్రాన్స్‌కో ఎస్ఇకి, కలెక్టరేట్‌లో ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇకి సంఘాల నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. తమను రెగ్యులరైజ్ చేయాలంటూ విద్యుత్ శాఖ ఎస్ఇకి సమ్మె నోటీసు ఇచ్చారు. కర్నూల్లో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరుకు సమ్మె నోటీలను అందజేశారు. సిఐటియు కర్నూలు జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి విద్యుత్ భవన్ ముందు ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా రీజినల్ అధ్యక్ష కార్యదర్శులు హెచ్ సత్యనారాయణ, ఎస్.రాజగోపాల్‌లు మాట్లాడారు. గుంటూరు జిల్లా పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్‌లో సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయంలో అధికారులకు సమ్మె నోటీసు అందచేశారు. తొలుత పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించారు. అనంతరం బ్రహ్మానందరెడ్డి స్టేడియం నుండి నల్లచొక్కాలు ధరించిన కార్మికులు విద్యుత్ భవన్ వరకూ ప్రదర్శ నిర్వహించారు. సత్తెనపల్లిలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు) గౌరవాధ్యక్షులు మామిడి జగన్నాధరావు ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు.

సమస్యలపై స్పందించని డిప్యూటీ స్పీకర్ : సిపిఎం

ప్రజాశక్తి - అవనిగడ్డ (కృష్ణా)

కృష్ణాజిల్లా అవనిగడ్డలో సరైన మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ స్పందించకపోవడం శోచనీయమని సిపిఎం తూర్పు కృష్ణా కార్యదర్శి ఆర్.రఘు అన్నారు. సోమవారం కృష్ణాజిల్లా అవనిగడ్డలోని లంకమ్మమాన్యం, రాజశేఖరపురం కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. కాలనీ ఏర్పడి తొమ్మిదేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు మౌలిక వసతులపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడం విచార కరమన్నారు. అనంతరం తహశీల్దార్, ఎంపిడిఒలకు వినతిపత్రం అందజేశారు.

ఐదో రోజూ విఆర్‌ఎల రిలే దీక్షలు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

వేతనాల పెంపు కోసం గ్రామ రెవెన్యూ సహాయకు (విఆర్ఎ)లు విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నా చౌక్ వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఐదో రోజైన సోమవారమూ కొనసాగాయి. ఈ దీక్షలో నెల్లూరు జిల్లాకు చెందిన విఆర్ఎలు పాల్గొన్నారు. దీక్షలను ఎపి విఆర్ఎల రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.పెద్దన్న ప్రారంభించి మాట్లాడారు. విఆర్ఎల వేతనం రూ.6,400 నుంచి రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. విఆర్ఎల విద్యార్హతలను బట్టి వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలన్నారు. నామినీలుగా విఆర్ఎలను నియమించాలని, ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 010 ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం విఆర్ఎల సమస్యలను పరిష్కరించడంతోపాటు రెగ్యులరైజ్ చేయటానికి నిర్ణయం తీసుకుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలకాశి, రాష్ట్ర నాయకులు రాధకృష్ణయ్య, హజరత్తయ్య పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. నొజొమి ఒకుహరా
2. రోహ్‌తక్
3. మేజర్ ధ్యాన్‌చంద్ (ఆగస్టు 29)
4. జంషెడ్‌పూర్‌లోని ఎంజిఎం ఆస్పత్రి
5. కేరళ

ధర్నాలతో దద్దరిల్లిన 'కృష్ణా' కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)

రైతులు, కార్మికులు, రజకులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలతో కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని కలెక్టరేట్ సోమవారం దిద్దరిల్లింది. నష్టపరిహారం వెంటనే చెల్లించాలని ఏపి రైతు సంఘం, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కౌలురైతు సంఘం, రజకుల సమస్యలు పరిష్కరించాలని రజక వృత్తిదారుల సంఘం, మద్యం షాపులు ఎత్తివేయాలని ఐద్వా, దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రిపై చర్యలు తీసుకోవాలని దళిత జాయింట్ యాక్షన్ కమిటీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ సంయుక్తంగా కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేపట్టారు. ధర్నాలో ఎపి రైతు సంఘం తూర్పుకృష్ణా కమిటీ కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బుడమేరు ఆధునీకరణలో భాగంగా 2012లో రైతుల వద్ద నుంచి తీసుకున్న భూములకు నేటికీ నష్టపరిహారం చెల్లించలేకపోవటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వెంటనే నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలురైతు సంఘం తూర్పుకృష్ణా కమిటీ కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ.. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి రజక వృత్తిదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.వెంకటరెడ్డయ్య, కాటూరి నాగభూషణం మాట్లాడుతూ.. రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ప్రజలకు సామాజిక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా తూర్పుకృష్ణా కార్యదర్శి పిన్నమనేని విజయ, సిపిఎం నాయకులు సజ్జా మూర్తిరాజు మాట్లాడుతూ.. పెడన కొత్తపేటలో నివాసాల మధ్య ఏర్పాటుచేసిన మద్యం షాపులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని, మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని దళిత జాయింట్ యాక్షన్ కమిటీ రిలేనిరాహారదీక్షలు చేపట్టింది. మధ్యాహ్నభోజన పథకం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్నభోజనం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి భాగ్యలక్ష్మీ, ఏఐటియుసి నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.



బుడమేరు బాధితులకు న్యాయం చేయాలని ధర్నా

త్వరలో చలో గరగపర్రు

- వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు
- దళితుల రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



దీక్షలను ప్రారంభిస్తున్న వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - పాలకోడేరు (పశ్చిమగోదావరి)

సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ త్వరలో చలో గరగపర్రుకు పిలుపునిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రు దళితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో దళితులకు రక్షణ లేదని, అనేక ప్రాంతాల్లో వీరి పట్ల వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని చెప్పారు. గరగపర్రు దళితులపై సాంఘిక బహిష్కరణ జరిగి నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనీయకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పెత్తందారులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. టిడిపి అధికారంలోకొచ్చాక 13 గ్రామాల్లో దళితులపై దాడులు చోటుచేసుకోవడంతో పాటు వివక్షకు గురయ్యారని తెలిపారు. 25 గ్రామాల్లో దళితుల నుంచి భూములను పెత్తందారులు వెనక్కి తీసుకున్నారన్నారు. దళితులకు అండగా ఉండి పోరాటం చేస్తున్న తనపై ఎనిమిది అక్రమ కేసులు బనాయించారన్నారు. గరగపర్రు సమస్యలను డిజిపి, ప్రిన్సిపల్ సెక్రటరీ, మానవ హక్కుల సంఘం, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రైల్వేస్టేషన్ల ప్రయివేటీకరణను అడ్డుకుందాం..!

- సిఐటియు, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సదస్సు తీర్మానం

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ)

రైల్వేస్టేషన్ల ప్రయివేటీకరణను అడ్డుకోవాలని, ఇందుకు అన్ని కార్మిక, ప్రజా, అభ్యుదయ సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని విజయవాడలో జరిగిన సదస్సులో తీర్మానించారు. 'భారత ప్రజల జీవనాడైన రైల్వే అమ్మకాలను ఆపండి-ప్రజల ప్రయోజనాలను కాపాడండి' అనే నినాదంతో సిఐటియు రాష్ట్ర కమిటీ, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) విజయవాడ ఆధ్వర్యాన సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు నిర్వహించారు. సదస్సులో రైల్వేను, దేశాన్ని బిజెపి ప్రభుత్వం నుంచి రక్షించుకునేందుకు పోరాటం సాగించాలని తీర్మానించారు. రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, రైల్వేలో క్వాలిటీ ప్రొడక్షన్ యూనిట్లుగా ఉన్న మధేపురా (బీహార్), మహదేవపూర్ రైల్వే ఎలక్ట్రికల్ ఇంజన్ల తయారీ వర్క్‌షాపులను ఎంఎన్‌సిలకు అప్పగించడం సరైన చర్య కాదని, కొన్ని రైల్వే ట్రాక్‌లు, రైళ్ల నిర్వహణను కాంట్రాక్టర్లకు ఇచ్చారని సదస్సులో వక్తలు పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు విడనాడాలని, చిత్తరంజన్ లోకో మోటివ్స్, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ వంటి లాభసాటి ఫ్యాక్టరీల నిర్వహణను ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టర్లకు అప్పగించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానాలపై ప్రజలంతా ఉమ్మడిగా పోరాడి భారతీయ రైల్వే పరిరక్షణకు సన్నద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఏఐటియుసి రాష్ట్ర నాయకులు వెంకట సుబ్బయ్య, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు బి.వెంకట సుబ్బయ్య, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, రైల్వే కంట్రోలర్స్ అసోసియేషన్ జోనల్ అధ్యక్షులు టి.వరప్రసాద్, ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.గురు మూర్తి రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.సుబానీ, ఎస్‌డబ్ల్యూఎఫ్ జనరల్ సెక్రటరీ సిహెచ్.సుందరయ్య, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నూర్ మహ్మద్, ఆర్ఎంఎస్ స్టాఫ్ యూనియన్ అధ్యక్షులు ఎన్.కృష్ణయ్య, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఈస్ట్‌కోస్ట్ రైల్వే) గౌరవాధ్యక్షులు వివిఎల్.నరసింహారావు ప్రసంగించారు.




సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

షుగర్స్ కార్మికులకు అండగా ఉంటాం

పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి

చాగల్లు షుగర్స్ కార్మికుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా చాగల్లులోని జైపూర్ షుగర్స్ కార్మికులు 13 రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ పది నెలల నుంచి జీతాలు రాక, రెండేళ్ల నుంచి పాత బకాయిలు, పిఎఫ్‌లు రాక పిల్లల చదువుకు, వైద్యం తదితర అవసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక శాఖ కమిషనర్‌కు రఘువీరారెడ్డి ఫోన్ చేయగా సమస్య తన దృష్టికి రాలేదని చెప్పారు. చాగల్లు నుంచి కార్మిక నాయకులు వస్తారని, సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. అనంతరం కార్మికులనుద్దేశించి రఘువీరారెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ అండగా ఉంటామని తెలిపారు. సిఎం జోక్యం చేసుకుని బకాయి వేతనాలు ఇప్పించాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల విభాగం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
నిట్ నం.63 అండ్ 64/2017-18/ఇఇ(ఆర్&బి) ఒంగోలు తేది: 21.08.2017
ప్రకాశం జిల్లాలో జిల్లా కోర్ట్ కాంప్లెక్స్‌లో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం మరియు సామాగ్రి ఏర్పాటుకు 2 పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్‌లు కోరడమైనది. అంచనా విలువ: రూ.14.40 లక్షలు 2 పనులకు. బిడ్ డాక్యుమెంట్‌ల డౌన్‌లోడ్ మొదలయ్యే తేది: 29.8.2017న 4గం.ల నుండి. టెండర్‌లు దాఖలకు చివరి తేది: 12.9.2017న 4గం.ల వరకు. టెండర్‌లు తెరుచుటకు తేది: 12.9.2017న 4.30గం.లకు. మిగతా వివరాలు ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in లో చూడండి. ఫోన్.నం.08592-232664.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
ఆర్&బి డివిజన్, ఒంగోలు.
DIPR No.1436/CL/ADVT/1/1/2017-18



అరుణగ్రహంపై మంచుకప్పిన ఇసుక తెన్నెలు

చిత్రాలను విడుదల చేసిన నాసా

నాసా: అరుణగ్రహంపై మంచు కప్పిన ఇసుక తెన్నెలతో కూడిన చిత్రాలను అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) విడుదల చేసింది. ప్రస్తుతం అరుణగ్రహంలో వున్న మార్స్ ఆర్బిటర్ గత మే 21న తీసిన ఈ చిత్రాలు పలువురిని ఆశ్చర్య చకితులను చేస్తున్నాయి. మార్స్ ఆర్బిటర్ ఉపయోగించిన హై రిజొల్యూషన్ సైన్స్ ఎక్స్‌పరిమెంట్ (హైరైజ్) కెమెరా సాయంతో తీసిన ఈ చిత్రాలు భూమి ఉపరితలం తరహాలో కాక అరుణగ్రహం ఉపరితలంపై కార్బన్ డయాక్సైడ్‌తో కూడిన మంచును చూపుతున్నాయి. దీనిని మనం డ్రై ఐస్‌గా ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. వసంతకాలంలో సూర్యోదయం ప్రారంభమైన తరువాత అప్పటి వరకు ఇసుకతెన్నెలను కప్పివేసిన మంచు కరిగి ప్రవాహాలుగా జాలువారుతూ అద్భుత దృశ్యాలను ఆవిష్కరించింది. నాసా 2005లో ప్రయోగించిన ఈ మార్స్ ఆర్బిటర్ అరుణగ్రహానికి 2006 మార్చి 10న చేరుకున్న విషయం తెలిసిందే.

జమ్ముకాశ్మీర్ గవర్నర్ వోహ్రా రాజీనామా

శ్రీనగర్: జమ్ముకాశ్మీర్ గవర్నర్‌గా పది నెలల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఎన్ఎన్ వోహ్రా తన పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ వారం ప్రారంభంలో వోహ్రా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. 2008 జూన్‌లో ఒక పర్యాయం గవర్నర్ పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయన మరోమారు ఈ పదవిలో కొనసాగుతున్నారు. జూన్‌లోనే ఆయన రిటైర్‌కానున్నట్లు ఊహాగానాలు వెలువడినప్పటికీ ఆచరణలోకి రాలేదు. అయితే తాజాగా ఆయన రాజీనామా వ్యవహారంపై హోం మంత్రిత్వశాఖ స్పందిస్తూ, గవర్నర్ కార్యాలయం నుంచి తమకు ఎటువంటి లేఖ అందలేదని పేర్కొంది. వోహ్రా గతంలో హోం, రక్షణ శాఖలకు కార్యదర్శిగా, మాజీ ప్రధాని ఇంద్రకుమార్ గుజ్రాల్‌కు కార్యదర్శిగా పనిచేశారు. వోహ్రా(81) పద్మ విభూషణ్ పురస్కారం కూడా అందుకున్నారు.

కార్తీని మరోసారి విచారించిన సిబిఐ

న్యూఢిల్లీ: ఇంద్రాని ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అక్రమ నగదు లావాదేవీలకు సంబంధించి సిబిఐ మరోసారి కార్తీ చిదంబరాన్ని సోమవారం విచారించింది. సిబిఐ ప్రధాన కార్యాలయానికి ఉదయం 11.30 గంటలకు కార్తీ చేరుకోగా, మరో ముగ్గురు నిందితులు భాస్కర్ రామన్, రవి విశ్వనాధన్, మోహన్ రాజేష్‌లను కూడా సిబిఐ ప్రశ్నించింది. ఇంద్రాని మీడియా గ్రూపుకు ఫారెన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు క్లియరెన్స్ ఇవ్వడంపై దర్యాప్తు సంస్థ కార్తీని ప్రశ్నించింది.

వీసా కోసం 700 మంది విద్యార్థులు

సుష్మను వేడుకుంటున్న వైనం


ముంబయి: వివిధ జర్మన్ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులు అభ్యసించ చాల్సిన 700 మంది విద్యార్థులు వీసా స్లాట్ లభించక ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా తమకు ముంబయి జర్మన్ కాన్సులేట్ కార్యాలయంలో స్లాట్ దొరకలేదని, కేంద్ర విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఈ సమస్యపై దృష్టిసారించాలని వారు వేడుకుంటున్నారు. ముంబయిలోని జర్మన్ కాన్సులేట్‌లో అదనపు స్లాట్లు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ట్విట్టర్ వేదికగా విద్యార్థులు తమ ఆవేదన వెళ్లగక్కుతున్నారు. సమస్య ప్రధానంగా ముంబయిలోని జర్మన్ కాన్సులేట్ ఉందని విద్యార్థి శ్రీయా గుల్జర్ పేర్కొన్నారు. ముంబయి, న్యూఢిల్లీ, కోల్‌కతాలో ఆ పరిస్థితి లేదని, అయితే విద్యార్థులు వారికి అందుబాటులో ఉన్న కార్యాలయాల్లోనే సంప్రదించాల్సిన నేపథ్యంలో ముంబయి కాన్సులేట్‌లో సమస్య ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.

ఎముకలు తిన్న తమిళనాడు రైతులు

న్యూఢిల్లీ: ప్రభుత్వాల నుంచి తమకు ఎలాంటి సహాయం అందకపోవడం తమిళనాడు రైతులు సోమవారం వినూత్న చర్యకు పాల్పడ్డారు. వారు ఎముకలను తిన్నారు. రుణమాఫీ కల్పించాలని, ఇతర ప్రయోజనాల కోసం జంతర్ మంతర్ వద్ద వారు ఈ నెల 9 నుంచి నుంచి మళ్లీ ఆందోళనలు కొనసాగిస్తున్నారు. గతంలో ఇక్కడ 44 రోజులు పాటు ఆందోళనలు చేసిన రైతులు నేతల హామీలతో ఏప్రిల్‌లో తమ నిరసన విరమించారు. అయితే నేతలు తమ హామీలు నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ మళ్లీ ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ నిరసనల్లో భాగంగా సోమవారం వారు ఎముకలను తిన్నారు. రాష్ట్రంలో తాము ఎదుర్కొంటున్న దుర్భిక్ష పరిస్థితుల గురించి తెలియజేయడానికే ఈ విధంగా చేశామని వారు తెలిపారు. గత ఏప్రిల్‌లో ప్రధాని మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి పళని స్వామి, కేంద్ర సహాయ మంత్రి రాధాకృష్ణన్ ఇచ్చిన హామీలు ఇంకా అమలు కాలేదన్నారు. కనీసం మీడియా కూడా తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు.

పళని, పన్నీర్‌కు టెన్షన్.. టెన్షన్..!

ప్రజాశక్తి - చెన్నై ప్రతినిధి



తమిళనాడు రాజకీయాలు అస్తవ్యస్తమయ్యాయి. ఒకరిపై ఒకరు వేటువేసినట్లు ప్రకటించడంతో ఆసక్తికరంగా మారాయి. సోమవారం అన్నాడీఎంకే పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎంపిలు తప్పకుండా హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా 30 మంది ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. 10 మంది ఎంపిలు గైర్హాజరయ్యారు. దీంతో పళనిస్వామి, పన్నీర్ సెల్వంకు టెన్షన్ మొదలైంది. ఇప్పటికే పళనిస్వామికి వ్యతిరేకంగా 22 మంది ఎమ్మెల్యేలు దినకరన్ శిబిరంలోకి వెళ్లిన విషయం తెలిసిందే. తాజా పరిణామంతో పరిస్థితి గందరగోళంగా మారింది.

శశికళ, దినకరన్ సస్పెండ్

ముఖ్యమంత్రి పళనిస్వామికి వ్యతిరేకంగా తిరుగుబావుటా ఎగుర వేసిన వారి వెనుక శశికళ, దినకరన్‌ల హస్తం ఉందని ఆయన భావించారు. ఈమేరకు సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో కొన్ని కీలకమైన నిర్ణయాలను తీసుకున్నారు. శశికళ, దినకరన్‌ను పార్టీ నుంచి తొలగించడమే కాకుండా ఈ మధ్య కాలంలో దినకరన్ చేపట్టిన నియామకాలన్నీ చెల్లవంటూ ఆదేశాలు జారీ చేశారు. 'నమదు.. ఎంజీఆర్ ' పత్రిక, 'జయ' టీవీల యాజమాన్యాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

దేశవ్యాప్త ఉద్యమం

- దళితులు, మైనార్టీలపై దాడులకు నిరసనగా..
- మధురై మహాసభల్లో కార్యాచరణ
- బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో భారీ ప్రదర్శన
- దళిత్ శోషణ్ ముక్తి మంచ్



హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మీడియాతో మాట్లాతున్న వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

దళితులు, మైనార్టీలపై దాడులకు నిరసనగా దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) ప్రకటించింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఎన్ని సంక్షేమ పథకాలు తెచ్చినా, దళితుల పట్ల వివక్ష తగ్గలేదని, వారి సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక దళితులు, మైనార్టీలపై దాడులు మరింతగా పెరిగాయని, హత్యలు కూడా చేస్తున్నారని విమర్శించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న డిఎస్ఎంఎం జాతీయ కార్యవర్గ సమావేశాలు సోమవారం ముగిశాయి. తమిళనాడులోని మధురైలో నవంబర్ 4 నుంచి 6 వరకూ జరిగే డిఎస్ఎంఎం రెండో జాతీయ మహాసభల్లో దేశవ్యాప్త ఉద్యమం గురించి చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని డిఎస్ఎంఎం వెల్లడించింది. డిఎస్ఎంఎం జాతీయ కన్వీనర్, కేరళ అసెంబ్లీ మాజీ స్పీకర్ రాధాకృష్ణన్, సమన్వయకర్త వి శ్రీనివాసరావు విలేకరులకు ఈ విషయం తెలిపారు. గోరక్ష పేరిట దళితులు, ముస్లింలపై దాడులు చేస్తూ, హత్యలకు పాల్పడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా పశ్చిమబెంగాల్‌లో ఇద్దరిని హత్య చేశారని తెలిపారు. యూనివర్సిటీల్లోనూ గతంలో లేని విధంగా దాడులు చేస్తున్నారన్నారు. హెచ్‌సియులో ఆత్మహత్య చేసుకున్న రోహిత్ వేముల ఉదంతంపై వేసిన రూపన్‌వాలా కమిషన్ ఇచ్చిన నివేదిక కేంద్ర మంత్రులను కాపాడే విధంగా ఉందని తెలిపారు. ఈ నివేదికను బుట్టదాఖలు చేసి, సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో దళితులు, మైనార్టీలపై వివక్ష చూపుతున్నారని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను ఎత్తివేశారని విమర్శించారు. ఉన్నత విద్యా సంస్థల్లో స్కాలర్‌షిప్‌లు సరిగా అందించడం లేదన్నారు. దళితులకు జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కోవడానికి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ నేతృత్వంలో 'దళిత్ స్వాభిమాన్ సంఘర్ష్' ఏర్పడిందని చెప్పారు. దళితుల సమస్యలపై ఈ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని చెప్పారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లకు చటబద్ధం చేస్తూ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. సాంఘిక బహిష్కరణలను నిషేధిస్తూ కొత్త చట్టం తేవాలని కోరారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కెవిపిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు కాడిగల్ల భాస్కర్, టి స్కైలాబ్‌బాబు పాల్గొన్నారు.

చైనా కంపెనీలు భారత్‌కు రావాలి : నీతి అయోగ్

భారత్‌లో అర్హతకు తగ్గ ఉద్యోగం లేదు

న్యూఢిల్లీ: భారత్‌లో యువత అర్హతకు తగ్గ ఉపాధి లభించాలంటే చైనా కంపెనీలు భారత్‌కు తీసుకురావాల్సిన అవసరం ఉందనీ నీతి అయోగ్ పేర్కొంది. అధిక ఉత్పాదకత అధిక వేతనాలు ప్రస్తుతం పెరిగిపోతున్న నిరుద్యోగానికి కారణం కాదనీ, అర్హతకు తగ్గ పనిలేకపోవడమే భారత్ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్య అని, అధిక వేతనాలు లభించే కొన్ని ఉద్యోగాలతో ఉపాధి మెరుగుపడదని తెలిపింది. ప్రభుత్వ తన మూడేళ్ల ప్రణాళికను గత వారం విడుదల చేయగా, ఈ అంశాన్ని ప్రస్తావించింది. దేశీయ మార్కెట్లు దిగుమతులపై ఆధారపడడం కన్నా, చిన్న మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా ఈ సమస్యను అదిగమించాలని సూచించింది. దేశంలో ఉపాది అవకాశాలను మెరుగుపర్చని అభివృద్ధి నమోదవుతోందనీ నేషనల్ శాంపిల్ సర్వే తేటతెల్లం చేస్తోంది. అర్హతకు తగ్గ ఉద్యోగం లేకపోవడం అనేది ప్రస్తుతం భారత్ ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య అని 2017-20 మధ్య కాలానికి సంబంధించిన ప్రణాళికలో నీతి అయోగ్ పేర్కొంది. అధిక ఉత్పాదకత, అధిక వేతనాలు గల ఉద్యోగాలు భారత్‌కు అవసరం ఉందని పేర్కొంది. తయారీ రంగంలో అగ్రస్థానంలో ఉన్న దేశాలైన తైవాన్, దక్షిణ కొరియా, సింగపూర్, చైనాలను నీతి అయోగ్ ఇందుకు ఉదహరించింది. ప్రపంచ విఫణిలోని దేశీయ ఉత్పత్తులను తీసుకుపోయినప్పుడే 'మేకిన్ ఇండియా' విజయవంతం అవుతుందని పేర్కొంది. చైనీయుల తయారీ రంగంలో వృద్ధుల శ్రామికశక్తి కూడా వున్నా వేతనాల పెరుగుదలపై అది ప్రభావం చూపదని పేర్కొంది. అక్కడ శ్రామికులు అధిక వేతనం అందుకుంటున్నారనీ, కంపెనీలు తక్కువ శ్రమకు కార్మికులు దొరికే ప్రాంతాలను వెతుకులాడుతున్నాయనీ నీతి అయోగ్ పేర్కొంది. అలాంటి కంపెనీలకు భారత్ అన్ని విధాల అనుకూలమైందన్నారు.కాబట్టి తయారీ రంగ కంపెనీలను దేశీయంగా నెలకొల్పేలా చూడడానికి ఇది సరైన సమయమని నీతి ఆయోగ్ తెలిపింది. దేశంలో కార్మికులకు చేతి నిండా పని ఉండేదుకు తీరం వెంబడి కోస్టల్ ఎంప్లాయ్‌మెంట్ జోన్‌లను ఏర్పాటు చేయాలని తన మూడేళ్ల ప్రణాళికలో పేర్కొంది. మరిన్ని బహుళజాతి కంపెనీలను చైనా నుంచి భారత్‌కు ఆకర్షించాలని పేర్కొంది. ఆయా కంపెనీలు స్థానికంగా కూడా అధిక వేతనాలు ఇవ్వడంతో అసమానతలు కూడా తొలగుతాయని పేర్కొంది. టెక్స్‌టైల్ రంగంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య పెరిగిందని పేర్కొంది. ఇదే విధంగా అన్ని రంగాల్లో కాంట్రాక్టు పద్ధతి విస్తరించిందని అభిప్రాయ పడింది. సీజన్ల వారీగా కార్మికులతో ఒప్పందం కుదుర్చుకునే సంస్కృతి విస్తరించిందని పేర్కొంది. అన్ని రకాల కార్మికచట్టాలను ఏకీకృతం చేసి నాలుగు విభాగాలుగా విభజించి కార్మిక చట్టాలను సంస్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ప్రస్తుత కార్మిక చట్టాల్లో సవరణలు చేయకుండా, అవసరమైన మార్పులు చేయకుండా ఫలితాన్ని ఆశించలేమని పేర్కొంది.


చిక్కుల్లో సాక్షి మహారాజ్ ?



న్యూఢిల్లీ : బిజెపి ఎంపి సాక్షి మహారాజ్ చిక్కుల్లో పడనున్నారు. న్యాయ వ్యవస్థకు వ్యతి రేకంగా సాక్షి మహారాజ్ చేసిన వ్యాఖ్యలపై విచారణ చేపట్టాలని పంజాబ్, హర్యానా హైకోర్టులో పిటిషన్ దాఖలయంది. గుర్మీత్ సింగ్‌కు శిక్ష నేపథ్యంలో చేలరేగిన హింసా కాండకు న్యాయవ్యవస్థ బాధ్యత వహించాలని సాక్షి వ్యాఖ్యానించారు. అలాగే గుర్మీత్ సింగ్‌కు హర్యానాలోని మనోహర్ లాల్ కతర్ ప్రభుత్వం లక్షలాది రూపాయిలను విరాళంగా ఇవ్వడంపై కూడా విచారణ జరిపించాలని హైకోర్టులో మరో విచారణ దాఖలయింది. ఒక స్టేడియం నిర్మాణానికి హర్యానా విద్యా శాఖ మంత్రి రామ్ బిలాస్ శర్మ రూ. 51 లక్షల విరాళంగా ఇచ్చారు. ఈ విషయంపై సిబిఐ జరిపించాలని పిటిషన్‌లో కోరారు. ఈ రెండు పిటిషన్ల విచారణకు హైకోర్టు అంగీకరించింది.

జార్ఖండ్‌కు మానవ హక్కుల కమిషన్ నోటీసులు

న్యూఢిల్లీ : జంషేడ్‌పూర్ మహాత్మా గాంధీ మెడికల్ కాలేజీలో 30 రోజుల్లో 52 శిశుమరణాలు సంభవించిన దుర్ఘటనకు సంబంధించి జార్ఖండ్ ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ సోమవారం నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనను మీడియా వార్తల ద్వారా సుమోటాగా కమిషన్ స్వీకరించింది. ఆరు వారాల్లోగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కమిషన్ ఆదేశించింది. అలాగే దేశంలో ఎక్కడా ఇలాంటి సంఘటనలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, మార్గదర్శకాలు జారీ చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖను కూడా కమిషన్ అదేశించింది. ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో అక్సిజన్ అందక 63 మంది చిన్నారులు మృతి, చత్తీస్‌ఘడ్‌లో అక్సిజన్ ప్లాంట్ అపరేటర్ నిర్లక్ష్యంతో నలుగురు శిశువులు మృతి చెందిన ఘటనలపై విచారణ జరపాలని ఆదేశించింది.



సిర్సాలోని తగలపడుతున్న కార్లు

రెండు కార్లు దగ్ధం

సిర్సా : అత్యాచార కేసులో డేరా సచ్చా సౌధ అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు శిక్ష ఖరారు చేసిన నేపథ్యంలో ఆయన అనుచరులు హింసాకాండకు దిగారు. సోమవారం రెండు కార్లను ధ్వంసం చేశారు. సిర్సాలోని ఫుల్కా, కోట్లి గ్రామాల్లో హింసాకాండకు దిగినట్లు వార్తలు వస్తున్నాయి. డేరా ప్రధాన కార్యాలయం బయట కూడా హింసాకాండ జరిగినట్లు సమాచారం. ఉద్రిక్త వాతావరణ నేపథ్యంలో పంజాబ్, హర్యానా ముఖ్యమంత్రులు వేరువేరుగా ప్రత్యేక సమీక్షాసమావేశాలు నిర్వహించారు. సిర్సాలో సైన్యం కూడా భద్రతా ఏర్పాట్లుల్లో పాల్గొంటుంది. కాగా, మంగళవారం ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకూ కర్ఫ్యూను ఎత్తివేయనున్నట్లు సోమవారం హర్యానా ప్రభుత్వం ప్రకటించింది.

రోహింగ్యాలపై "అడ్వయిజరీ"ని ఉపసంహరించుకోవాలి

- హోం శాఖకు సిహెచ్‌ఆర్‌ఐ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : రోహింగ్యాలను స్వదేశానికి పంపే విషయమై ఇటీవల జారీ చేసిన అడ్వయిజరీని ఉపసంహరించుకునే అంశాన్ని పరిశీలించాలని కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇన్షియేటివ్ (సిహెచ్ ఆర్ఐ) సోమవారం హోం శాఖకు విజ్ఞప్తి చేసింది. రోహింగ్యాల విషయమై సుప్రీం కోర్టు 1996లో ఇచ్చిన తీర్పును దృష్టిలో ఉంచుకుని అడ్వయిజరీని ఉపసంహరించుకునే అంశాన్ని పరిశీలించాలని కోరింది. ముస్లిం మైనార్టీ వర్గంగా ఉన్న రోహింగ్యాలు మయన్మార్‌లోని రాఖీన్ రాష్ట్రానికి చెందిన వారు. మయన్మార్ ప్రభుత్వ అధికార జాబితాలోని 135 జాతులలో రోహింగ్యాలు లేరు. మయన్మార్ ప్రభుత్వం వారిని పౌరులుగాను గుర్తిం చడం లేదు. రోహింగ్యాలను మయన్మార్ నుంచి బయటకు పంపే చర్యల్లో భాగంగా ప్రభుత్వ సంస్థలు వారిపై పలు ఆంక్షలు విధించాయి. ఉద్యోగం కావాలన్నా, వివాహం చేసుకోవాలన్నా, ఆరోగ్య సేవలు పొందాలన్నా, పుట్టిన పిల్లలను నమోదు చేయించాలన్నా అనుమతులు పొందాలని ప్రభుత్వ సంస్థలు ఒత్తిడి చేస్తున్నాయి. ఈ అనుమతుల కోసం రోహింగ్యాలు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ సంస్థలు తీసుకుంటున్న ఇటువంటి చర్యలతో విసిగిపోయిన రోహింగ్యాలు బంగ్లాదేశ్, భారత్, థాయ్‌లాండ్ దేశాలకు వేల సంఖ్యలో శరణార్థులుగా చేరుకుంటున్నారు. దాదాపు 40 వేల మంది రోహింగ్యాలు భారత్‌లోని వివిధ రాష్ట్రాలలో శరణార్థులుగా నివసిస్తున్నారు. వీరిలో 10 వేల మంది వరకు జమ్మూలో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశంలోకి అక్రమ వలసలను గుర్తించి వారి స్వదేశాలకు పంపేందుకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆగస్టు 8న హోం శాఖ ఒక అడ్వయిజరీ జారీ చేసింది.

డిసెంబర్‌లో కొత్త రూ. 1000 నోటు

త్వరలో ప్రింటింగ్ ప్రారంభిచనున్న ఆర్‌బిఐ



న్యూఢిల్లీ : ఈ ఏడాది డిసెంబరు లోగా కొత్త రూ. 1000 నోటు చెలామణిలోకి తీసుకునిరావడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. త్వరలోనే మైసూర్, సల్బోని ప్రింటింగ్ ప్రెస్సుల్లో రూ. 1000 నోటు ముద్రణను ఆర్‌బిఐ ప్రారంభించనుంది. కొత్త వెయ్యి నోటు పూర్తి భద్రతా ప్రమాణాలతో వుంటుంది. గత ఏడాది నవంబరులో రూ. 1000, రూ. 500 నోట్లు ప్రభుత్వం నిషేధించింది. ప్రస్తుతం వెయ్యి నోట్లు అందుబాటులో లేవు. ప్రస్తుతం వున్న రూ. 500, రూ. 2000 నోటుకు మధ్య భారీ వ్యత్యాసం వుంది. గతవారంలో రూ. 200 నోట్లను చెలామణీలోకి తీసుకుని వచ్చిన ఆర్‌బిఐ, త్వరలోనే కొత్త రూ. 50 నోట్లను అందుబాటులోకి తీసుకుని వస్తామని తెలిపింది. ఎంపిక చేసిన ఆర్‌బిఐ కార్యాలయాలు, బ్యాంకులు ద్వారా రూ. 200 నోట్లును జారీ చేశారు. కాగా, కొత్త నోట్లు కోసం దేశవ్యాప్తంగా 2 లక్షకు పైగా ఎటిఎంలను అధునీకరించాల్సివుంది. కాగా, రూ. 200 నోట్ల ముద్రణ తరువాత కొత్త రూ. 1000 నోట్ల ముద్రణ ప్రారంభం అవుతుందని ఆర్‌బిఐ అధికారి ఒకరు సమాచారం. గత ఆరు నెలల నుంచి రూ. 2,000 నోట్ల ముద్రణను ప్రభుత్వం నిలిపివేసింది. తక్కువ విలువ గల నోట్లపై దృష్టి పెట్టింది.

నారదా స్కామ్‌లో పశ్చిమ బెంగాల్ మంత్రిని విచారించిన సిబిఐ

కోల్‌కతా : నారదా టేపుల కుంభకోణంలో పాత్రపై పశ్చిమ బెంగాల్ మంత్రిని సుబ్రతా ముఖర్జీని సోమవారం సిబిఐ విచారించింది. ఈ కేసులో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన అనేక మంది మంత్రులకు, ఎంపిలకు, ఎమ్మెల్యేలకు, ప్రముఖ నాయకులకు సిబిఐ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. సిబిఐ కార్యాలయంలో సుబ్రతా ముఖర్జీని నాలుగు గంటలకు పైగా విచారించారు. విచారణ అనంతరం విలేకరులతో ముఖర్జీ మాట్లాడుతూ సిబిఐ అధికారులకు పూర్తిగా సహకరించానని, విచారణకు మళ్లీ పిలిచినా హాజరవుతానని అన్నారు. కాగా, ఇదే కేసులో ఇంతకు ముందే సుబ్రతాను ఈడి విచారించింది. నారదా న్యూస్ సిఈఓ మాథ్యూస్ శామ్యూల్స్ ఒక వ్యాపారవేత్తగా నటిస్తూ తృణమూల్ నేతలకు లంచం ఇవ్వడం ఈ వీడియోల్లో స్పష్టంగా వుంది.

గుర్మీత్‌కు శిక్ష ఖరారైన క్రమంలో ముఖ్యాంశాలు

- సిబిఐ కోర్టు శిక్ష ఖరారు చేయనున్న నేపథ్యంలో డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయమున్న సిర్సాలో కర్ఫ్యూ విధించారు
- గుర్మీత్‌ను దోషిగా నిర్ధారిస్తూ శుక్రవారం కోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనల్లో మృతుల సంఖ్య 38కి పెరిగిందని హర్యానా డిజిపి బిఎస్ సంధూ తెలిపారు.
- సునారియా జైలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోర్టు రూంకు సిబిఐ న్యాయమూర్తి జగదీప్ సింగ్ చేరుకునేందుకు జైలు సమీపంలో ప్రత్యేక హెలీపాడ్‌ను ఏర్పాటు చేశారు.
- రోహ్‌తక్ శివార్లలోని సునారియా జైలు వద్ద భద్రతా బలగాలు గస్తీ నిర్వహించాయి. కర్ఫ్యూ సమయంలో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులను అధికారులు జారీ చేశారు.
- ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు రోహ్‌తక్ డిప్యూటి కమిషనర్ అతుల్ కుమార్ ద్వివేది తెలిపారు
- హర్యానాలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ అదుపులోనే ఉందని కేంద్ర హోం శాఖ ప్రతినిధి తెలిపారు.ఢిల్లీ పోలీసులు హర్యానాలో పూర్తి అప్రమత్తంగా ఉన్నారని ఆయన చెప్పారు.
- సోనేపట్‌లోని బాలగఢ్‌లో ఉన్న డేరా కేంద్రం నుంచి కర్రలు, ఇనుప రాడ్లతో సహా 100కు పైగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు రోహ్‌తక్ ఐజి తెలిపారు. దీనిపె ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.
- గుర్మీత్ అనుచరులు హింసకు పాల్పడే అవకాశాలున్నట్లు ఉదయం 12 గంటల వరకు నిఘా వర్గాల నుంచి పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు
- గుర్మీత్‌ను జైలులో ప్రత్యేక సెల్‌లో ఉంచినప్పటి నుంచి ఎటువంటి హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోలేదు
- సిర్సాలో కర్ఫ్యూ కొనసాగుతున్నదని, సాధారణ పరిస్థితులు నెలకొల్పడమే తమ ప్రాధాన్యతని, పాఠశాలలు, కళాశాలలు, ఇంటర్నెట్ సర్వీస్‌లను మూసివేసినట్లు హర్యానా డిజిపి బిఎస్ సంధూ తెలిపారు.
- మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రత్యేక సిబిఐ కోర్టు న్యాయమూర్తి హెలికాప్టర్‌లో రోహ్‌తక్‌లోని సునారియా జైలుకు చేరుకున్నారు.
- ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోర్టు రూంలో శిక్ష ప్రకటించడానికి ముందు జరిగిన వాదోపవాదాలలో పదేళ్ళ జైలు శిక్ష విధించాలని సిబిఐ కోరగా, గుర్మీత్‌పై దయ చూపాలని డిఫెన్స్ న్యాయవాది అభ్యర్థించారు.
- మధ్యాహ్నం 3.30 గంటలకు గుర్మీత్‌కు పదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.
- తీర్పు వెలువడిన తరువాత సాధారణ పరిస్థితులు కొనసాగాయని హర్యానా ప్రభుత్వ సమాచార, ప్రజా సంబంధాల విభాగ డిప్యూటి డైరెక్టర్ సతీష్ మెహ్రా తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందన్నారు
- సాయంత్రం 4.30 గంటల సమయంలో హర్యానా ముఖ్యమంత్రి ఖతర్ తన నివాసంలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సీనియర్ రాష్ట్ర అధికారులు, పార్టీ నాయకులు, మంత్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

20 ఏళ్ల జైలు

(మొదటిపేజీ తరువాయి)

మూసేశారు. హర్యానా, పంజాబ్‌లలో హై అలర్ట్ కొనసాగుతున్నది. ఈ రాష్ట్రాలలో భద్రతా పరిస్థితి సవాల్‌గా మారడంతో దుండగులు హింసకు పాల్పడుతూ కనిపిస్తే కాల్చివేస్తామన్న అధికారులు హెచ్చరించారు. సాధ్వీలైన ఇద్దరు మహిళలపై గుర్మీత్ సింగ్ అత్యాచారానికి పాల్పడినట్లు 2002 ఏప్రిల్‌లో అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆయనపై కేసు నమోదైంది. పంజాబ్, హర్యానా హై కోర్టు ఆదేశాల మేరకు 2002లో సిబిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఈ క్రమంలో అత్యాచారం కేసు నమోదైన ఐదేళ్ళ తరువాత 2007 జులైలో అంబాలా కోర్టులో సిబిఐ డేరా బాబాపై చార్జిషీటు దాఖలు చేసింది. 1999-2001 మధ్య కాలంలో ఇద్దరు మహిళా సాధ్వీలపై గుర్మీత్ అత్యాచారానికి పాల్పడినట్లు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఆ తరువాత సెప్టెంబరు 2008లో భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 376(అత్యాచారం), సెక్షన్ 509 (నేర బెదిరింపు) కింద రామ్ రహీమ్‌పై ప్రత్యేక సిబిఐ కోర్టు అభియోగాలు నమోదు చేసింది. 2009-2010 సంవత్సరాలలో ఫిర్యాదు దారులిద్దరి వ్యాఖ్యలను కోర్టు ఎదుట నమోదు చేశారు. ఆ తరువాత సిబిఐ ప్రత్యేక కోర్టును అంబాల నుంచి పంచకులకు తరలించారు. దీంతో డేరా అధినేత గుర్మీత్‌పై నమోదైన కేసు కూడా పంచకుల సిబిఐ కోర్టుకు బదిలీ అయ్యింది. 2017 జులైలో కోర్టు ప్రతి రోజూ కేసుపై విచారణ జరిపింది. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ తరుపు న్యాయవాదుల వాదోపవాదాలతో ఆగస్టు 17, 2017న కేసు విచారణ ముగిసింది. ఆగస్టు 25న గుర్మీత్‌ను దోషిగా కోర్టు ప్రకటించింది. సిబిఐ ప్రత్యేక కోర్టు గుర్మీత్‌ను దోషిగా ప్రకటించిన నేపథ్యంలో పంజాబ్, హర్యానాలతో పాటు పంచకులలో చోటుచేసుకున్న హింసాత్మక ఆందోళనలు పునరావృతం కాకుండా సోమవారం అధికారులు అప్రమత్తమయ్యారు. సెక్షన్ 144 కింద నిషేధాజ్ఞలు జారీ చేశారు. రోహతక్ జిల్లాలో కూడా నిషేధాజ్ఞలు విధించారు.

నన్ను క్షమించండి : గుర్మీత్ రామ్ రహీమ్

పదేళ్ళ కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించిన తరువాత గుర్మీత్ రామ్ రహీమ్ కోర్టులోనే భోరున ఏడ్చేశారు. కోర్టు రూం వదిలి వెళ్ళేందుకు నిరాకరించారు. తనను క్షమించాలని న్యాయమూర్తిని వేడుకున్నారు. ముజే మాఫ్ కరో దో అంటూ నేలమీద ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. తాను అమాయకుడినని న్యాయమూర్తికి నివేదించుకున్నారు. ఎంతకీ కోర్టు రూమును వదిలి వెళ్ళకపోయేసరికి కమెండోలు ఆయనను అక్కడ నుంచి తీసుకెళ్ళారు. ఆ తరువాత ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జైలు దుస్తులు ఇచ్చారు.

జైలు అధికారులను బెదిరించిన గుర్మీత్

తాను, తన కుమార్తె ఇన్సాస్ ఇద్దరం ఒకే జైళ్ళో ఉండాలనుకుంటున్నామని, అందుకు అనుమతించాలని కోరుతూ గుర్మీత్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గుర్మీత్‌కు నడుము నొప్పి, మైగ్రేన్ ఉన్నందువల్ల ఆయనకు తరుచూ ఆక్యుప్రెజర్ చేస్తూ ఉండాలని హనీ ప్రీత్ తెలిపారు. గుర్మీత్ పిటిషన్‌పై సిబిఐ న్యాయస్థానం స్పందిస్తూ అది తన పరిధిలో లేదని పేర్కొంది. దీనిపై జైలు అధికారులు లేక ప్రభుత్వం అనుమతి పొందాలని సూచించింది. ఈ విషయమై గుర్మీత్ జైలు అధికారులను బెదిరించారు. తనకు బడా రాజకీయ నాయకులతో, ముఖ్యమంత్రులతో ఉన్న పలుకుబడిని ఉపయోగించి జైలు అధికారులను సస్పెండ్ చేయిస్తానని బెదిరించినట్లు సమాచారం.

అధికార పార్టీలదే గెలుపు

(మొదటిపేజీ తరువాయి)

రాజీనామాలు చేయడంతో ఉప ఎన్నికలు జరిగాయి. ప్రస్తుత ఉప ఎన్నికల్లో పనాజీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గిరిష్ చోదంకర్‌పై 4,803 ఓట్ల మెజార్టీతో పారికర్ విజయం సాధించారు. పారికర్‌కు 9862 ఓట్లు లభించగా, గిరిష్ చోదంకర్‌కు 5059 ఓట్లు పోలయ్యాయి. గోవా సురక్షా మంచ్‌కు చెందిన అనంద్ శిర్ధోకర్‌కు 220 ఓట్లు లభించాయి. ఇక వాల్పోయిలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన రాణె, తరువాత బిజెపిలో చేరారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో ఈ సారి అక్కడ జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి నుంచి బరిలోకి దిగిన రాణె భారీ మెజారిటీతో విజయం సాధించారు. రాణెకు 16,167 ఓట్లు లభించగా, కాంగ్రెస్ అభ్యర్థి రాయ్ నాయిక్‌కు 6,101 ఓట్లు లభించాయి. పనాజీలో మొత్తం 15,538 ఓట్లు, వాల్పోయిలో 23,038 ఓట్లు పోలయ్యాయి. ఈ విజయాలతో గోవా అసెంబ్లీలో బిజెపి బలం 14కు చేరుకుంది. బిజెపి కూటమి బలం 24కు చేరుకుంది. కాంగ్రెస్ కూటమి సంఖ్య 16గా వుంది.

ఢిల్లీలో ఆప్

ఢిల్లీలో బావన నియోజకవర్గాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ తిరిగినిలుపుకుంది. ఈ స్థానంలో ఆప్ అభ్యర్థి రామ్ చంద్ర 24 వేలకు పైగా మెజారిటీతో బిజెపి అభ్యర్థి వేద ప్రకాష్‌పై విజయం సాధించారు. రామ్ చందర్‌కు 59,886 ఓట్లు , వేద్ ప్రకాష్‌కు 35,834 ఓట్లు లభించగా, కాంగ్రెస్ అభ్యర్థి సురేంద్ర కుమార్‌కు 31,919 ఓట్లు లభించాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ నుంచి గెలిచిన వేద్ ప్రకాష్, ఏప్రిల్‌లో ఢిల్లీ మున్సిపల్ ఎన్నికలకు ముందు బిజెపిలో చేరారు. ఆయన రాజీనామాతో ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది. ఈ సారి వేద్ కుమార్ బిజెపి నుంచి పోటీకి దిగడంతో ఈ ఉప ఎన్నిక ఆప్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. కౌంటింగ్ ప్రారంభంలో కాంగ్రెస్ అధిక్యంలో వుంది. అయితే ఎనిమిదో రౌండ్ నుంచి ఆప్ ముందంజలోకి వచ్చింది. అక్కడి నుంచి చివరి రౌండ్ వరకూ ఆధికాన్ని నిలుపుకుంది. తొలుత ఆధిక్యంలో వున్న కాంగ్రెస్ చివరికి మూడో స్థానానికి పరిమితం కాగా, బిజెపి రెండో స్థానంలో నిలిచింది.2.94 లక్షల ఓటర్లతో ఢిల్లీలోని పెద్ద నియోజకర్గాల్లో భవన ఒకటి. అయితే ఈ ఉప ఎన్నికల్లో 45 శాతం ఓటింగ్ మాత్రమే జరిగింది. 2015 ఎన్నికల్లో 61.83 శాతం ఓటింగ్ జరగ్గా, ఆప్ 50 వేలకు పైగా మెజారిటీతో అప్ విజయం సాధించింది. ఈ విజయంతో ఢిల్లీ అసెంబ్లీలో అప్ బలం 66గా వుంది. ఏప్రిల్‌లో రాజోరి గార్డెన్ ఉప ఎన్నికల్లో బిజెపితో బిజెపి సభ్యుడు గెలవడంతో ఆ పార్టీ బలం 4 కు చేరుకుంది.అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో నంద్యాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిపై తెలుగు దేశం అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి 26, 523 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

దీపక్ మిశ్రా ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

1996లో ఒరిస్సా హై కోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమించబడ్డారు. ఆ తరువాత 1997లో మధ్య ప్రదేశ్ హై కోర్టుకు బదిలీ అయ్యారు. ఆ తరువాత 2009లో పాట్నా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. 2010లో ఢిల్లీ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన దీపక్ మిశ్రాను ప్రధాని నరేంద్ర మోడీ ట్విట్టర్‌లో అభినందించారు. మిశ్రా తన కెరీర్‌లో ప్రాధాన్యతను సంతరించుకున్న ఎన్నో తీర్పులిచ్చారు. ముంబయి వరుస బాంబు పేలుళ్ళ కేసులో నిందితుడు యాకుబ్ మెమన్ తనకు విధించిన ఉరిశిక్షపై స్టే విధించాలని చేసుకున్న దరఖాస్తును డిస్మిస్ చేసిన ధర్మాసనానికి మిశ్రా నేతృత్వం వహించారు. నిర్భయ హంతకులకు విధించిన ఉరి శిక్షను సమర్థించారు. కేసు నమోదు చేసిన 24 గంటల్లోగా ఎఫ్ఐఆర్‌లను వెబ్‌సైట్‌లలోఉంచాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించారు. పనికిమాలిన పిటిషన్లు వేసే వారి పట్ల ఆయన కఠినంగా వ్యవహరించేవారు. త్రిపుల్ తలాక్, గోప్యత హక్కులపై న్యాయవ్యవస్థ కొన్ని కీలకమైన తీర్పులు వెలువరించిన సమయంలో జస్టిస్ మిశ్రా భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయడం గమనార్హం.


వరద బాధిత రైతులకు రూ.125 కోట్ల సాయం

నేపాల్ ప్రభుత్వ ప్రకటన

ఖాట్మండు: దేశంలో ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు రూ.125 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నట్లు నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రతిపాదనకు జాతీయ ప్రణాళికా సంఘం, ఆర్థిక శాఖ ఆమోదం లభించిన వెంటనే నిధులను రైతులకు పంపిణీ చేస్తామని అధికారులు చెప్పారు. వ్యవసాయ పెట్టుబడులపై సబ్సిడీలు, నగదు గ్రాంట్ల రూపంలో ఈ సహాయాన్ని అందచేస్తామని నేపాల్ వ్యవసాయశాఖ కార్యదర్శి సరోజ్ పోఖ్రెల్ చెప్పారు. భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ సొమ్మును బదిలీ చేస్తామన్నారు. వరద బీభత్సంతో గణనీయంగా రైతులకు సంభవించిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసిన అనంతరం ఈ గ్రాంట్లను సంబంధిత జిల్లా ముఖ్య అధికారుల నేతృత్వంలోని జిల్లా స్థాయి ప్రకృతి విపత్తుల సహాయక కమిటీల (డిడిఆర్‌సి) ద్వారా పంపిణీ చేస్తామని ఆయన వివరించారు. రైతులను ఆదుకోవటం ప్రభుత్వ కర్తవ్యమని, సహాయం పొందటం రైతుల చట్టబద్ధమైన హక్కు అని వ్యవసాయ మంత్రి రామకృష్ణ యాదవ్ వ్యాఖ్యానించారు.

ప్రతి తరగతికి ఉపాధ్యాయుడు

కొత్త విద్యార్థుల కోసం సిద్ధమవుతున్న క్యూబా


విద్యార్థుల కోసం కంప్యూటర్లను సిద్ధం చేస్తున్న పాఠశాల సిబ్బంది

హవానా: వచ్చే నెల 4 నుండి ప్రారంభం కానున్న కొత్త విద్యాసంవత్సరంలో విద్యాభ్యాసానికి వచ్చే దాదాపు 17.5 లక్షల మంది కొత్త విద్యార్థులను స్వాగతించేందుకు క్యూబా సిద్ధమవుతోంది. ప్రతి తరగతికి తప్పనిసరిగా ఉపాధ్యాయులను నియమించాలని లక్ష్యంగా నిర్ణేశించుకుంది. ఇందులో భాగంగా 2017-18 విద్యాసంవత్సరంలోనే 93 శాతం తరగతులకు టీచర్లు వుండేలా చర్యలు తీసుకుంటున్నట్లు క్యూబా విద్యామంత్రి ఎనా ఎల్సా వెలాజ్క్ కోబియెల్లా చెప్పారు. అవసరమైతే రిటైరైన ఉపాధ్యాయులను, యూనివర్శిటీ విద్యార్థులను, శిక్షణలో వున్న టీచర్ల సహాయం కూడా తీసుకొని 99.5 శాతం మేర టీచర్ కవరేజ్ వుండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆమె వివరించారు. దీనితో పాటే అన్ని ప్రావిన్స్‌ల్లో పూర్తి స్థాయి సౌకర్యాలతో ప్రి స్కూల్ చైల్డ్‌కేర్ సెంటర్లను కూడా ప్రారంభించనున్నామని ఆమె చెప్పారు. ఉన్నత విద్యాసంస్థలకు అవసరమైన ఉపాధ్యాయుల శిక్షణా సంస్థలను కూడా కొనసాగించాల్సిన అవసరం వుందని క్యూబా మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం వున్న శిక్షణా సంస్థలకు అదనంగా బారకోవా (గ్వాంటనామో), హవానాలో రెండు కొత్త బోధనా సంస్థలను ప్రారంభించనున్నామన్నారు. విద్యాసంస్థలకు అవసరమైన పరికరాల సరఫరాపై ఆమె వివరిస్తూ మారుమూల ప్రాంతాల్లో వున్న స్కూళ్లకు అవసరమైన వంట పరికరాలు, టెలివిజన్, కంప్యూటర్లకు అవసరమైన విద్యుత్‌ను సమకూర్చేందుకు సోలార్ ప్యానెల్స్ ప్రస్తుతం కొరత వుందన్నారు. అదే విధంగా ఎలక్ట్రానిక్ పరికరాల మరమ్మతులకు అవసరమైన విడి భాగాలకు కూడా కొరత వుందని ఆమె చెప్పారు. ఏడాది కాలంలో 1,795 విద్యాసంస్థల భవనాలను రిపేర్లు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, అయితే వాస్తవానికి 2,023 స్కూళ్లను పునర్నిర్మించామని ఆమె వివరించారు. ఈ ఏడాది చివరి నాటికి 20 శాతం స్కూళ్లు అధ్వాన్న స్థితికి చేరుకుంటాయని భావిస్తున్నామని, అయితే ఇది గత ఏడాది కన్నా 9 శాతం తక్కువేనని ఆమె చెప్పారు. ఈ భవనాలకు జరిపే రిపేర్ల నాణ్యతను తాము నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు.



అమెరికాలో తగ్గుతున్న గోధుమ సాగు

కాయ, పప్పుధాన్యాల సాగుకు మొగ్గు

ఇయోవా (అమెరికా): ప్రపంచంలోనే అత్యధికంగా గోధుమ పంట సాగయ్యే అమెరికాలో ఇప్పుడు గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అమెరికన్ రైతులు గోధుమ సాగుకు బదులు ఇప్పుడు పప్పుధాన్యాలు, కాయగూరల పంటల సాగుపై మొగ్గు చూపుతున్నట్లు అమెరికా వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా గోధుమ పంట ధరలు పతనం కావటం, లాభాలు తగ్గి ముఖం పడుతుండటంతో ఈ ఏడాది కేవలం కొద్ది ఎకరాలలో మాత్రమే ఈ పంటను సాగు చేస్తున్నారని వ్యవసాయశాఖ వెల్లడించింది. గోధుమ బెల్ట్‌గా ప్రసిద్ధి చెందిన ఇయోవా ప్రాంతంలో ఈ ఏడాది అనేక మంది రైతులు ముడి శనగలు, కాయగూరల పంటల సాగుకు మొగ్గు చూపుతున్నట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

పలువురు రైతులు ముడి శనగల సాగుపై శ్రద్ధ చూపుతున్నారని, ఇప్పుడు ఎన్ని ఎకరాలలో ఈ పంట సాగు చేస్తున్నారో చూస్తే నమ్మశక్యం కావటం లేదని వాషింగ్టన్ తూర్పు ప్రాంతానికి చెందిన కిర్క్ హన్సన్ అనే రైతు చెప్పారు. ఒక్లహోమా దక్షిణ ప్రాంత మైదానాల నుండి టెక్సాస్ ఉత్తర ప్రాంతం వరకూ అమెరికన్ రైతుల్లో అధికశాతం మంది ఇప్పటికీ గోధుమ పంటనే సాగు చేస్తున్నారు. అయితే ఈ ఏడాది కేవలం 4.57 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే ఈ పంట సాగయింది. 1919 నాటితో పోల్చుకుంటే ఇది అత్యంత తక్కువ విస్తీర్ణం. నార్త్ డకోటాలో 15 శాతం, మోంటానాలో 11 శాతం, నెబ్రాస్కాలో 23 శాతం మేర గోధుమ సాగు పడిపోయిందని అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. వినియోగదారులు ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ అధిక ప్రొటీన్ ఆహార ధాన్యాలను కొనుగోలు చేస్తుండటంతో రైతులు అటువంటి పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రపంచం ఇప్పుడు హైప్రోటీన్ ఆహార ధాన్యాలను కోరుకుంటున్నదని, గోధుమలో ఆ మేర ప్రోటీన్లు లభించకపోవటంతో తాము ఇతర పంటలపై దృష్టి సారిస్తున్నామని ఒక రైతు వివరించారు. నార్త్ డకోటాలో ఇప్పుడు పలువురు రైతులు సన్‌ఫ్లవర్, కాయధాన్యాలు, ముడి శనగల పంటల వైపు మొగ్గు చూపుతున్నారని ఆయన వివరించారు. అయితే ఈ కొత్త ధోరణి ఎంతకాలం వుంటుందన్న విషయం తెలియదన్నారు.

దేశం వదిలి పెట్టిన థాయ్ మాజీ ప్రధాని

బ్యాంకాక్: థాయ్ మాజీ ప్రధాని యింగ్లక్ షినావాత్రా దేశం వదిలి పారిపోయినట్లు తెలుస్తోంది. తాను అధికారంలో వున్న సమయంలో రైతుల కోసం అమలు చేసిన సబ్సిడీ బియ్యం పథకం అమలులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె శుక్రవారం నాడు కోర్టులో శిక్షను ఎదుర్కోవాల్సి వుంది. అయితే 24 గంటలు ముందే ఆమె దేశం వదిలి వెళ్లిపోయినట్లు యింగ్లక్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. కోర్టు తనకు తీవ్రమైన శిక్ష విధించనున్నదని, బెయిల్ కూడా మంజూరు కాదని సన్నిహితుల ద్వారా తెలుసుకున్న ఆమె దేశం వదిలి పారిపోయినట్లు ఈ వర్గాలు వివరించాయి. ఆమె ఎప్పుడూ చివరి నిముషంలో నిర్ణయాలు తీసుకునే వ్యక్తి కాదని, చేయాల్సిన పనులను ప్రణాళికా బద్ధ:గా నిర్వహిస్తారని ఈ వర్గాలు తెలిపాయి. అయితే ఇది మాత్రం ఆమె చివరి నిముషపు నిర్ణయమేనని వివరించాయి. తన సన్నిహితులిరువురితో పారిపోయిన ఇంగ్లక్ తన ఏకైక కుమారుడు సుపసేక్ అమోర్నచేత్ (15)ను బ్యాంకాక్‌లోనే విడిచిపెట్టినట్లు ఈ వర్గాలు వెల్లడించాయి.

హోస్టన్, టెక్సాస్‌లలో వరద బీభత్సం

నేడు టెక్సాస్‌ను సందర్శించనున్న ట్రంప్




హోస్టన్/టెక్సాస్: గత కొద్ది రోజులుగా వణికిస్తున్న హార్వీ హరికేన్ కారణంగా సంభవించిన వరద బీభత్సంతో అమెరికాలోని హోస్టన్, టెక్సాస్ రాష్ట్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కురిసిన భారీ వర్షాలతో నీట మునిగిన టెక్సాస్ నగరంలో ప్రజలు ఇళ్ల నుండి బయటకు వచ్చి వెళ్లేందుకు బోట్లను ఉపయోగిస్తున్నారు. శుక్రవారం రాత్రి తీరం దాటిన హార్వీ హరికేన్ సృష్టించిన బీభత్సంలో కనీసం ఇద్దరు మరణించారని తెలుస్తోంది. ఎగసి పడుతున్న సముద్రపుటలలు, టార్నెడోల ప్రభావంతో ఈసంఖ్య మరింత పెరిగే అవకాశం వుందని అధికారులు చెబుతున్నారు. గత 50 ఏళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా హార్వీ తుపాను బీభత్సం సృష్టించిందని స్థానికులు వాపోయారు. ఆదివారం ఉదయం నుండి గడచిన 48 గంటల్లో హోస్టన్ నగరంలో దాదాపు 76 సెం.మీ వర్షపాతం నమోదు కావటంతో అక్కడి వీధులన్నీ నదులు, కాల్వలను మరిపిస్తున్నాయి. బుధవారం ఉదయానికి వాతావరణం నెమ్మదించే అవకాశం వున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. హోస్టన్, టెక్సాస్ నగర ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చమురు పరిశ్రమకు కేంద్రంగా వున్న హోస్టన్ నగరంలో అనేక పరిశ్రమలు హరికేన్ తాకిడికి మూతపడ్డాయి. దీనితో ఇంధన ధరలు మరింత పెరిగే అవకాశం వుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుపాను తాకిడికి విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో ఆదివారం సాయంత్రం నుండి దాదాపు 2.4 లక్షల మంది ప్రజలు టెక్సాస్ నగరంలో చీకట్లో కాలం గడుపుతున్నారు.

నేడు ట్రంప్ టెక్సాస్ పర్యటన

హార్వీ బీభత్సాన్ని పరిశీలించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం నాడు టెక్సాస్ నగరాన్ని సందర్శించనున్నారని వైట్‌హౌస్ ప్రతినిధి సారా శాండర్స్ చెప్పారు. వరద బాధితులకు సాయం అందించేందుకు రాష్ట్ర స్థానిక అధికారులను సమన్వయం చేసుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు ఆమె వివరించారు. ప్రజల భద్రత, ప్రాణరక్షణపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని అధ్యక్షుడు సూచించినట్లు ఆమె చెప్పారు.

అమెరికా ఆంక్షలను ఖండించిన మదురో



కారకాస్: తమ దేశానికి వచ్చే పెట్టుబడులను అడ్డుకునే అమెరికా తాజా ఆంక్షలను తాము ప్రతిఘటిస్తామని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో ప్రకటించారు. వెనిజులా ప్రభుత్వ ఆధ్వర్యంలోని చమురు కంపెనీ పిడివిఎస్‌-ఎలో అమెరికన్ ఆర్థిక సంస్థలు పెట్టుబడులు పెట్టటాన్ని నిషేధిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆదేశాలను జారీ చేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పిడివిఎస్‌ఎలో మూల ధనం కోసం వెనిజులా ప్రభుత్వం జారీ చేసే రెండు రకాల బాండ్లపై జరిగే ట్రేడింగ్‌ను కూడా ట్రంప్ నిషేధించారు. పిడివిఎస్‌ఎకు అనుబంధంగా అమెరికాలో వ్యాపార లావాదేవీలు కొనసాగించే అనుబంధ సంస్థ సిట్గో తన మాతృసంస్థకు డివిడెండ్లు చెల్లించటంపై కూడా ట్రంప్ నిషేధం విధించారు. ఈ ఆదేశాలపై తీవ్రంగా స్పందించిన మదురో అమెరికాలో వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న సిట్గో సంస్థ తాజా ఆంక్షలతో మూతపడనున్నదన్నారు. అమెరికాలోని చమురు సంస్థలతో తమ ప్రభుత్వం త్వరలోనే భేటీ కానున్నదని, అవసరమైతే తాము అమెరికాకు రోజూ పంపే ఏడు లక్షల బ్యారెళ్ల చమురుకు ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషిస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా వెనిజులా నుండి తమ దిగుమతులు యధాతథంగా కొనసాగుతాయని ట్రంప్ ప్రభుత్వ అధికారులు వివరించారు. తాజా ఆంక్షలు కేవలం మదురో, ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని విధించినవేనని, ఇప్పటికే అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్న వెనిజులా ప్రజలపై కాదని వారు చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

ముద్రగడ పాదయాత్రకు విరామం

నుంచి కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు పోలీసులు వాహనం ఎక్కించేటప్పుడు జిల్లా ఎస్‌పి విశాల్ గున్ని ఆయన పక్కన కూర్చునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో 'నేను ఉగ్రవాదిని, నా దగ్గర కూర్చోవద్దంటూ' ముద్రగడ చెప్పడంతో ఎస్‌పి కంగుతిన్నారు. ఆయనను కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు పోలీసులు నానాపాట్లు పడ్డారు. కిర్లంపూడి మండలంలోని అనేక గ్రామాల మీదుగా ముద్రగడను తిప్పిన సమయంలో ఆయన కాన్వాయ్ వెంట ఆయన అనుచరులు, ప్రజలు అనుసరించడంతో పోలీసులు నానా హైరానా పడ్డారు. తిరిగి రాత్రి కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఆ తర్వాత ఆయన్ను తన స్వగృహానికి చేర్చే వరకూ పోలీసులు అష్టకష్టాలు పడ్డారు.

భారీగా పోలీసుల మోహరింపు

ముద్రగడ సోమవారం గృహనిర్బంధంలో ఉండడంతో కిర్లంపూడిని సుమారు 1,500 మంది పోలీసులు చుట్టుముట్టారు. ఆధార్‌కార్డు, పూర్తి వివరాలు చూపినవారినే ఇంటినుంచి బయటకు రానిచ్చారు. వాహనాలపై వెళ్లేవారిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామమంతా పోలీసుల ఆధీనంలో ఉండడంతో బయటకు వచ్చేందుకు ప్రజలు సాహసించలేదు. 32 రోజులుగా గ్రామంలో పోలీసులు తిష్ట వేశారని, రాత్రి సమయాల్లో కూడా తమను పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాదయాత్రను వాయిదా వేశామని ముద్రగడ చెప్పినప్పటికీ పోలీసులు గ్రామాన్ని వీడలేదు. సోమవారం ఉదయం ముద్రగడను కలిసేందుకు వస్తున్న కిర్లంపూడి సర్పంచి నాగబాబును పోలీసులు అడ్డుకున్నారు. నాగబాబు అనుచరులు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ముద్రగడ ఇంటి వద్ద మోహరించిన పోలీసులు సరైన వసతి సౌకర్యాల్లేక ఇబ్బందులు పడుతూనే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈనెల 30న 13 జిల్లాల జెఎసి నాయకులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ముద్రగడ ప్రకటించిన నేపథ్యంలో ఆ అంశంపై కాపు సామాజికవర్గంలో చర్చ సాగుతోంది.

కోలుకుంటున్న బాధితులు

ముద్రగడ ఆదివారం పాదయాత్ర చేసిన సమయంలో పోలీసులు విచక్షణా రహితంగా లాఠీఛార్జి చేయడంతో అనేకమంది గాయపడ్డారు. జెఎసి నాయకుడు జివి రమణ, గణేశుల రాంబాబు, దొరబాబు, సురేష్, తదితర బాధితులు కోలుకుంటున్నారు. గాయపడిన కాపు నాయకుడు జెవి రమణ కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో కోలుకుంటున్నారు. కాజులూరుకు చెందిన సురేష్ మెడపై, పొట్టపైన బలమైన గాయాలు తగలడంతో చికిత్స పొందుతున్నారు.

సిబిఐతో చరిత్ర తేల్చుకుందాం రా..! : ముఖ్యమంత్రికి ముద్రగడ సవాల్

రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఇద్దరి చరిత్రను తేల్చమని సిబిఐకి అప్పగిద్దాం రా.. అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సవాల్ విసిరారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన స్వగృహంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రకు అనుమతి లేదని చెప్పడం వల్లే నెలరోజులుగా గేటు దాటి బయటకు దాటలేదన్నారు. పౌరుషం లేదా? గేటు దాటి రాలేవా? పాదయాత్ర చేయలేవా? అని ముఖ్యమంత్రి సవాల్ విసిరారన్నారు. ఆ సవాల్‌ను స్వీకరించే ఆదివారం పాదయాత్ర చేశానని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కనువిప్పు కలిగిందా? అని సిఎంను ప్రశ్నించారు. ఎలాంటి హింసాత్మక సంఘటనలూ జరగకుండా పాదయాత్ర చేశానని చెప్పారు. తాను కులాలను రెచ్చగొడుతున్నానని సిఎం చెబుతున్నారని, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా కుల సంఘాలతో ఎందుకు సమావేశమయ్యారని ప్రశ్నించారు.

డోక్లాంపై అంగీకారం

భారత విదేశాంగ శాఖ విడుదల చేసిన పత్రికా ప్రకటన పై విషయాన్ని తెలియజేసింది. "భారత దేశం తన దళాను ఉపసంహరించుకుంటున్నట్లు చైనా నిర్ధారించింది" అని చైనా అధికార వార్తా సంస్థ సిన్హువా ఫ్లాష్ వార్తగా తెలియజేసింది. సిక్కిం సెక్టార్‌లోని తమ భూభాగంపై సార్వభౌమాధికారానికి చిహ్నంగా చైనా దళాలు డోక్లాంలో గస్తీ కాస్తుంటాయని చైనా రాజధాని నుండి వచ్చిన మరో వార్త తెలియజేసింది.


డోక్లామ్ పీఠభూమిలో చైనా-భూటాన్‌ల మధ్య వివాదంలో ఉన్న ప్రాంతంలో చైనా రోడ్డు మార్గం నిర్మిస్తుండడంతో గత జూన్‌లో భారత్ సరిహద్దు దళాలు ఆ ప్రాంతంలోకి ప్రవేశించడంతో ఇరు దేశాల మధ్య సైనిక ప్రతిష్టంభన ఏర్పడింది.

డోక్లామ్ నుండి భారత దళాలు ఉపసంహరించుకుంటున్నట్లు భారత విదేశాంగ శాఖ చేసిన ప్రకటనను మన రక్షణ వర్గాలు కూడా నిర్ధారించాయి. "దళాలను ఉపసంహరించుకోవాలని నిర్ణయిండం జరిగింది, ఉపసంహరణ జరుగుతోంది" అని రక్షణ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

నీటి కోసం సుప్రీం కోర్టుకు..

- **అధికారులకు సిఎం ఆదేశం**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



కృష్ణానది ప్రాజెక్టుల విషయంలో కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై సుప్రీం కోర్టుకు వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జలవనరులశాఖ అధికారుల్ని ఆదేశించారు. ఈ వారంలోనే కోర్టును ఆశ్రయించే అవకాశం ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కృష్ణానదిపై ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు పూర్తిగా నిండుకున్నాయి. చుక్కనీరు లేదు. సెప్టెంబర్ వస్తున్నా నీరు ఒక్క అడుగు పెరగడం లేదు సరికదా, అంతకంతకూ తగ్గుతూనే వస్తోంది. మరోవైపు కర్నాటకలోని ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో కళకళలాడుతున్నాయి. నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన నీరు కూడా ఇవ్వడం లేదు. ఇప్పటి వరకూ అంతోఇంతో ఆదుకుంటున్న తుంగభద్ర కూడా ఎండిపోతోంది. ఈ నేపథ్యంలో కోర్టును ఆశ్రయించడం మినహా ప్రభుత్వానికి మరోమార్గం లేదు. ఇదే పరిస్థితి మరి నాలుగు నెలలు కొనసాగితే రాష్ట్రంలో నీటి కరువు ఏర్పడే అవకాశం ఉంది. కృష్ణానదిలోకి పట్టిసీమ నీరు వస్తున్నా అది పైప్రాంతాలకు ఉపయోగం లేదు. నాగార్జునసాగర్లో ఉన్న నీటిని ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వాడుకుంటున్నారు. అది కూడా అంతకంతకూ అడుగంటిపోతోంది. ఈ నేపథ్యంలో పైభాగం నుండి రావాల్సిన నీటిని రాబట్టుకోవడం మినహా ప్రభుత్వానికి మరోమార్గం లేదు. కేసు వేశాక కూడా నీటిని విడుదల చేసే అవకాశం లేకపోయినా భవిష్యత్‌లో అయినా కొంత ఉపశమనం కలుగుతుందని సిఎం ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఒకే నదిపై ఉన్న రెండు ప్రాజెక్టుల్లో ఒకటి నిండి మరొకటి నిండకపోయినా ఆ ప్రాంతంలో ఉన్న ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కోర్టులు కూడా మానవతా ధృక్పథంతో ఆదేశాలివ్వొచ్చనే ఆలోచనతో ప్రభుత్వముంది. అలాగే తెలంగాణాతో నీటి పంపకాల విషయంలోనూ చర్చలు జరుగుతున్నాయి. నాగార్జునసాగర్ వద్ద రెండు రాష్ట్రాల మధ్య పెద్ద యుద్ధమే సాగుతోంది. నీటిని విడుదల చేయాలని ఎపి, వద్దని తెలంగాణా అధికారులు వాదులాడుకుంటున్నారు. మరోవైపు కృష్ణాబోర్డు విషయాన్ని తేల్చకుండా నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తోంది. దీనిపైనా త్వరలోనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఏదో ఒక విషయం తేల్చకపోతే సమస్య తీవ్రరూపం దాలుస్తుందని ఇటీవల జరిగిన సమావేశంలో బోర్డు దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో నీటి విషయంలో కోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

అగ్రశ్రేణి కట్టడాలకు దీటుగా ఐకానిక్ టవర్లు

ప్రపంచంలోని పది అగ్రశ్రేణి కట్టడాలపై అధ్యయనం చేసి వాటికి దీటుగా అమరావతి ఐకానిక్ టవర్లను నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. రాజధాని ప్రాంత అభివద్ధి ప్రాధికార సంస్థ అధికారులు నిర్మాణ సంస్థ షాపూర్జీ-పల్లోంజీ ప్రతినిధులతో కలిసి సిఎం సోమవారం ట్విన్ టవర్ల నిర్మాణంపై వివరించారు. దుబాయ్‌లో బుర్జ్ ఖలీఫా వంటి కట్టడాలు ఉన్నాయని, మలేసియా, సింగపూర్ దేశాలలో ఈ తరహా నిర్మాణాలను చేపట్టారని సిఎం తెలిపారు. ఈ సందర్భంగా అమరావతి ఐకానిక్ ట్విన్ టవర్ ఆకతులు, నిర్మాణ వ్యూహంపై షాపూర్ జీ సంస్థ ప్రతినిధులు సిఎంకు ప్రెజెంటేషన్ ఇచ్చారు.

6 నుంచి ' జలసిరికి హారతి '

సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు ' జలసిరికి హారతి' కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పోలవరం సహా 28 ప్రాజెక్టులపై జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావుతో కలిసి సమీక్షించారు. పోలవరం పై వర్చువల్ ఇన్స్‌పెక్షన్ చేస్తూ రోజుకు 4 నుంచి 5 వేల క్యూబిక్ మీటర్ల వరకు కాంక్రీట్ పనుల వేగం పెంచాలన్నారు. ముంపు ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

భూసార పరీక్షలకు డ్రోన్‌లు

డ్రోన్ల సాయంతో భూసార పరీక్షలు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇందుకు బిల్ అండ్ మిలిందా ఫౌండేషన్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. ఆఫ్రికాలో ఈ విధానం సత్ఫలితాలిచ్చిందన్నారు. 'నీరు-ప్రగతి'పై సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పథకంలో అంతర్గత తనిఖీని సెప్టెంబరు 5 కల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. కచ్చితంగా జియో ట్యాగింగ్ చేయాలన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాల్లో మోడల్ ప్రాజెక్టుగా 'మాగ్రామం-మాశుభ్రత' కార్యక్రమాన్ని విజవంతంగా చేపట్టిన జిల్లా యంత్రాంగానికి సిఎం అభినందనలు తెలిపారు.

భారీగా కోతలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదించగా, ఈ ఐదు నెలల కాలంలో రూ. 1,098 కోట్లు మాత్రమే వచ్చాయి. గత ఏడాది అడ్వాన్సుగా ఇచ్చిన రూ. 1,343 కోట్లను పుస్తకాల్లో సర్దుబాటు చేస్తున్నట్లు కేంద్రం చెబుతోంది.పోలవరం ప్రాజెక్టు ఖర్చుకు సంబంధించి 134 అభ్యంతరాలను కేంద్రం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించిన రూ. 3,314 కోట్లు తిరిగి రాష్ట్రానికి చెల్లించేందుకు కేంద్రం అనేక అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. నిర్దిష్టంగా ఒక పనికి కేటాయించిన నిధులు ఆ పనికే ఖర్చు చేయాలన్నది పోలవరం అథారిటీ నిర్దేశం. కానీ రాష్ట్రంలో ఒక నిధిని ఇంకొక పనికి ఖర్చు చేసినట్లు కేంద్రం గుర్తించింది. వినియోగ ధృవీకరణ పత్రాల్లో కూడా స్పష్టత లేదంటున్నారు. మొత్తం రూ. 3314 కోట్లలో కేవలం రూ. 12 వందల కోట్ల వరకు మాత్రమే సరైన లెక్కలు ఉన్నాయని, మిగిలిన ఖర్చుకు సరైన లెక్కలు లేవని పోలవరం అథారిటీ చెబుతున్నట్లు తెలిసింది.

అధికార దుర్వినియోగంతోనే

- **నంద్యాలలో టిడిపి గెలుపుపై జగన్ వ్యాఖ్యలు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికార దుర్వినియోగానికి పాల్పడే నంద్యాల ఉప ఎన్నికలో టిడిపి గెలిచిందని వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. ఇది చంద్రబాబు విజయమని అనుకుంటే పొరపడినట్లేనన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందించారు. వైసిపి పక్షాన నిలబడిన ఓటర్లకు, కార్యకర్తలకు జగన్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, భయభ్రాంతులకు గురి చేసినా కార్యకర్తలు గట్టిగా నిలబడి పార్టీ కోసం పని చేశారన్నారు. ఎమ్మెల్సీ పదవిని వదులుకొని టిడిపి నుంచి వైసిపిలోకి వచ్చినందుకు శిల్పా సోదరులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పదవి పోతుందని తెలిసి కూడ రాజీనామా చేసి విలువలకు కట్టుబడి నిలిచారన్నారు. రూ.200కోట్లకు పైగా డబ్బులు వెదజల్లి, అధికార దుర్వినియోగానికి పాల్పడి, ఓటర్లను ప్రలోభపెట్టి గెలవడం గెలుపే కాదని వ్యాఖ్యానించారు. టిడిపి నేతలను ఓటర్ల దగ్గరకు పంపించి "ఇదిగో నీ ఆధార్ కార్డు, ఓటేయకపోతే పెన్షన్ కట్ అవుతుంది" అంటూ బెదిరించారన్నారు. అధికార టిడిపి భయభ్రాంతులకు గురిచేసినా కూడా ధైర్యంగా ప్రజలు ముందుకొచ్చి ఓటేశారన్నారు. మా పార్టీ గుర్తుపై గెలిచి, టిడిపిలో చేరిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు దిగాలని చంద్రబాబుకు జగన్ సవాల్ విసిరారు. ఎన్నికల ప్రచారంలో ప్రతి చోటా తాము ప్రజలతో మమేకమయ్యామని, రైతులు, డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఎన్నికలప్పుడు చంద్రబాబు ఏం చెప్పారు? ఆ తర్వాత ఏరకంగా మోసం చేశారు వంటి వాస్తవాల్ని వివరించామన్నారు. ఇంటింటికీ ఉద్యోగమిస్తామని చెప్పి అధికారంలోచ్చాక ఏరకంగా మోసం చేశారన్న విషయాన్ని కూడా ఓటర్లకు చెప్పామన్నారు. పెన్షన్లు, రేషన్ కార్డులు రావని ప్రజల్ని బెదిరించడంతో కేవలం భయపడి టిడిపికి ఓటేశారని, ఇది ఆయన విజయం ఎప్పటికీ కాదని పేర్కొన్నారు. "రాజకీయాల్లో గుండె ధైర్యం ఉండాలి...అవతలివాడు ఎన్ని దెబ్బలు కొట్టినా భరించగల ధైర్యం కూడా ఉండాలి...మా టైమొచ్చినప్పుడు మేమూ కొడతాం" అని జగన్ అన్నారు.

అగ్రిగోల్డ్ డైరెక్టర్‌కు బెయిల్ నిరాకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

అగ్రిగోల్డ్ కంపెనీ జనం నుంచి చిన్న మొత్తాల్లో సేకరించిన డిపాజిట్లలో రూ.600 కోట్ల వరకు తమ అనుబంధ కంపెనీల్లోకి మార్చేసినట్లు ఆధారాలున్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. అగ్రిగోల్డ్, దాని అనుబంధ కంపెనీలకు డైరెక్టర్, వైస్ చైర్మన్ అయిన ఎం.బానోజీరావు వేసిన పలు పిటిషన్లను న్యాయమూర్తి డిస్మిస్ చేశారు. ఉద్దేశపూర్వకంగానే భారీ మొత్తాలను మళ్లించినట్లుగా తమ వద్ద ప్రాథమిక సాక్ష్యాలున్నాయని హైకోర్టు న్యాయమూర్తి తాళ్లూరి సునీల్ చౌదరి పేర్కొన్నారు. తెలంగాణ, ఎపిల్లో పలు పోలీస్ స్టేషన్లల్లో నమోదైన కేసుల్లో తనకు సిఆర్‌పిసి 438 సెక్షన్ కింద బెయిల్ మంజూరు చేయాలని అగ్రిగోల్డ్, దాని అనుబంధ కంపెనీలకు డైరెక్టర్, వైస్ చైర్మన్ అయిన ఎం.బానోజీరావు వేసిన పలు పిటిషన్లను న్యాయమూర్తి డిస్మిస్ చేశారు. తాను కంపెనీలో కేవలం ఉద్యోగిని మాత్రమేనన్న భానోజీరావు వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. 13 కంపెనీల్లో డైరెక్టర్‌గా, వైస్ చైర్మన్‌గా ఉన్నారని, డైరెక్టర్ పదవిని 2011లో రెన్యువల్ చేసుకున్నట్లు కంపెనీ డైరెక్టరేట్ రికార్డులు చెబుతున్నాయని హైకోర్టు పేర్కొంది.

అభివృద్ధి, సంక్షేమానికే పట్టం

- **విజ్ఞత ప్రదర్శించిన నంద్యాల ప్రజలు**
- **జగన్ మరో డేరా బాబా**
- **సిఎం చంద్రబాబు**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకే పట్టం కట్టారని, ఈ గెలుపు తమకు చారిత్రాత్మకమైందని టిడిపి అధినేత, సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో వైసిపి ఓటమితో రాష్ట్ర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని వ్యాఖ్యానించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోతే అభ్యర్థిని నిలపకూడదనే సంప్రదాయాన్ని తానే ప్రారంభించానన్నారు. వైసిపి నేతలు కావాలనే నంద్యాలలో పోటీ పెట్టి అభాసుపాలయ్యారన్నారు. ఈ ఎన్నికలకు ఇంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. జగన్ తన పట్ల ప్రయోగించిన పరుషమైన మాటలు, ఆయన ప్రవర్తన దేశవ్యాప్త చర్చకు దారితీశాయన్నారు. ఆయన చేసిన విమర్శలు శృతిమించాయన్నారు. నడిరోడ్డులో కాల్చినా ఫర్వాలేదు.. ఉరి తీసినా తప్పులేదని విమర్శించారని, హద్దులు దాటి మాట్లాడటాన్ని ఎన్నికల కమిషన్ తప్పు పట్టినా ప్రతిపక్ష నేత వాటిని సరిచేసుకోకుండా మరింత రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం వల్ల ప్రజల్లో ఆందోళన రేకెత్తిందన్నారు. జగన్ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రతిపక్షనేత 13 రోజులపాటు నంద్యాలలో మకాం వేసి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసినా ప్రయోజనం దక్కలేదన్నారు. నంద్యాల ప్రజలు విజ్ఞతను ప్రదర్శించి మంచి తీర్పిచ్చారన్నారు. ఎన్నో ప్రాజెక్టులు వచ్చినా రాలేదన్నట్లుగా జగన్ మాట్లాడారన్నారు. నంద్యాలలో రోడ్ల వెడల్పు కోసం భవనాలు తొలగిస్తుంటే అడ్డం పడ్డారన్నారు. ఉర్దూ యూనివర్సిటీ ప్రారంభమై తరగతులు నిర్వహిస్తున్నా ఇంకా రాలేదన్నారని తెలిపారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం, పోలవరం, రాజధాని నిలిచిపోవాలని కోర్టుల్లో కేసులు వేయించారన్నారు. డేరా బాబాకు మంచి శక్తి, సామర్థ్యాలున్నా వాటిని దుర్వినియోగం చేశారు కాబట్టే జైలుకు వెళ్లారన్నారు. ఆయన మాదిరిగా జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. జల్లికట్టు స్ఫూర్తి అంటూ రిపబ్లిక్ డే వేడుకలు, భాగస్వామ్య సదస్సును అడ్డుకోవాలని ప్రయత్నించారన్నారు. అసెంబ్లీలో కూడా అసభ్యంగా మాట్లాడటం ఆయనకే చెల్లిందన్నారు. వైఎస్ కుటుంబం కారణంగానే రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతిందన్నారు. పులివెందుల్లో ఫ్యాక్షన్, రౌడీయిజాన్ని పెంచి పోషించడం వల్లే ఆ నియోజకవర్గానికి చెడ్డపేరు వచ్చిందన్నారు. నంద్యాల విజయం పార్టీకి మరింత శక్తినిచ్చిందని, భవిష్యత్‌లో జరిగే ఏ ఎన్నికల్లోనైనా టిడిపికి తిరుగుండదని ధీమా వ్యక్తం చేశారు. తరచు ఎన్నికలు జరగడం వల్ల అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని, అందుకే కేంద్రం అన్ని ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే ఉద్దేశాన్ని తాము బలపర్చామన్నారు. కాకినాడలో జరగబోయే ఎన్నికల్లో నంద్యాల మాదిరిగానే విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



నాగార్జున నటిస్తోన్న 'రాజుగారి గది 2', నాగ చైతన్య సినిమా 'యుద్ధం శరణం' త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుండడం... అక్టోబర్ 6న చైతూ, సమంతల వివాహం...డిసెంబర్‌లో 'హలో' అంటూ అఖిల్ పలకరింపులు... ఇవి ఈ ఏడాది నాగార్జునకు ప్రత్యేకతలుగా చెప్పొచ్చు. ఇంకొకటి అక్కినేని నాగేశ్వరరావు జయంతి సెప్టెంబర్ 21న పురస్కరించుకుని ఏటా నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవాన్ని ఈ ఏడాది జాతీయ స్థాయి ప్రముఖుల సమక్షంలో జరపనున్నారు. వీటిన్నంటిపైనా మంగళవారం పుట్టినరోజును జరుపుకుంటున్న నాగార్జున సోమవారం మీడియాతో ముచ్చటించారు.

కొంచెం ప్రేమ.. కొంచెం ఒత్తిడి..

- నాగార్జున

మీ

పది ప్రశ్నలు అడిగారు. మనం మనసులో ఏం అనుకుంటే అదే చెప్పేస్తారు. అది నాకు చాలా కొత్తగా అనిపించింది. చెప్పే విధానం చాలా బాగుంది. అందుకే ఇలాంటి పాత్ర

బాగుంది. కథ చెప్పేటప్పుడే ఫుల్ స్క్రిప్ట్‌తో నా దగ్గరికొచ్చాడు.

మీ అబ్బాయిల సినిమాలకు మీరే నిర్మాత కదా ఒత్తిడి అనిపించడం లేదా?

అక్కడ కొంచెం ప్రేమ ఉంటుంది కదా. ఒత్తిడి కూడా ఉంటుంది. అఖిల్ సినిమా కొంచెం కాంప్లికేట్‌గా ఉంటుంది. అంటే బడ్జెట్ ఎక్కువ. జాగ్రత్తలు కూడా ఎక్కువగా తీసుకోవాలి. అయినా కూడా వాళ్ళ సినిమాల్ని నేను నిర్మించడం ఆనందంగా ఉంది.

అఖిల్ సినిమా ఎందుకింత ఆలస్యమైంది?

హీరోయిన్ ఎంపిక చేయడం కోసమే ఎక్కువ టైం తీసుకున్నాం. సినిమా ఫ్రెష్ లవ్ స్టోరీ. కాబట్టి హీరోయిన్ కూడా కొత్తగా ఉండాలని అంటే 'గీతాంజలి'లో గిరిజలా, 'ఏం మాయ చేసావే'లో సమంతలా ఉండాలని అనుకున్నాం. చాలా మందిని ఆడిషన్స్ చేశాం. చివరికి కళ్యాణి ప్రియదర్శన్‌ను ఎంపిక చేశాం. దర్శకుడు ప్రియదర్శన్ కూతురు ఆమె. 'హలో గురు ప్రేమ కోసమే..' పాట కూడా ఉంది. ఆ సినిమాకు అతనే దర్శకుడు.

నేను, అఖిల్ మాట్లాడుకున్నప్పుడు.. రామారావుగారితో ప్రారంభించి, నాన్నతో ఫినిష్ చేయించి 'హలో' టైటిల్ లాంచ్ చేయాలనుకున్నాం. పెద్దాయన లేరు కాబట్టి తారక్‌ని అడిగాం. తారక్, అఖిల్ మంచి స్నేహితులు. అందుకే ఎన్టీఆర్‌తో స్టార్ట్ చేశాం. కథకు కూడా సరిగ్గా సరిపోయే టైటిల్. తను ప్రేమించిన అమ్మాయి దగ్గర నుంచి 'హలో' అనే పిలుపు కోసం వెయిట్ చేస్తుంటాడు. అదే కథ. యాక్షన్ లవ్ స్టోరీ. టైటిల్ నేనే ఇచ్చాను. నాకు మార్నింగ్ 6.30కు మంచి ఐడియాలు వస్తుంటాయి. అలా వచ్చిన టైటిల్‌ను సుప్రియకు ఫోన్‌లో చెప్పాను. అదేరోజు ఛాంబర్‌లో రిజిస్టర్ చేయించింది.

ఫ్యాన్స్ ప్రేమకు కృతజ్ఞతలు. అంతకన్నా వాళ్లకు ఇంకేం చెప్పగలను. నాన్నగారి దగ్గర నుండి ఇప్పటి వరకు అన్ని సమయాల్లోనూ వాళ్ళు మాకు తోడుగా ఉన్నారు. వాళ్ళ ఆదరణ మర్చిపోలేనిది. వాళ్ళే మాకు పెద్ద వరం. ఎప్పుడైన పరిస్థితులు బాగోలేనప్పుడు వాళ్ళతో మాట్లాడగానే అంతా చక్కబడిపోతుంది. నాన్నగారు ఉన్నప్పుడు అభిమానులు కుటుంబ సభ్యుడిలా పచ్చళ్లు, స్వీట్లు, కూరగాయలు వంటివి పంపిస్తుండేవారు. ఇప్పుడు అవన్నీ నా ఇంటికి వస్తున్నాయి. ఇదంతా వారి ప్రేమకు నిదర్శనం.

'రాజుగారి గది-2' ఎంతవరకూ వచ్చింది?

చిత్రీకరణ పూర్తయిపోయింది. కొంత ప్యాచ్ వర్క్ మాత్రమే మిగులుంది. వెన్నెల కిశోర్ చాలా బిజీగా ఉన్నాడు. ఆయన డేట్స్ ఇవ్వగానే ప్యాచ్‌వర్క్ పూర్తవుతుంది. ఇక.. రీ రికార్డింగ్ జరుగుతోంది. వచ్చే నెల రెండో వారంలో మొదటి కాపీ రావాలి. సినిమా కూడా చాలా బాగా వచ్చింది. ఎన్నాళ్లగానో హార్రర్ కామెడీ జానర్లో ఒక సినిమా చేయాలని అనుకుంటున్నా. అది ఈ సినిమాతో సాధ్యపడింది. ఇందులో థ్రిల్లింగ్ అంశాలు కూడా ఉంటాయి.

ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?

నాది మెంటలిస్ట్ పాత్ర. అంటే మనిషిని చూడగానే వాళ్ళ మనసులో మాటల్ని కనిపెట్టగల శక్తి నాకుంటుంది. అలాంటి వాళ్ళు మనం మాట్లాడుతున్నది నిజమా? అబద్ధమా? అనేది ఇట్టే చెప్పేస్తారు. పైగా 20 ఏళ్ళ క్రితం జరిగిన విషయాన్ని టక్కున చెప్పేస్తారు. నా పాత్రలో పెద్దగా కామెడీ ఉండదు. కానీ డ్రామా ఎక్కువ.

ఇప్పటి వరకూ మీరు అలాంటివారిని కలిశారా?

ముగ్గుర్ని కలిశాను. వారికి సంబంధించిన వివరాలు తీసుకున్నా. ఇది ఒరిజినల్ మెంటలిస్ట్ క్యారెక్టర్. 'ప్రియతమ్' అనే మలయాళ చిత్రాన్ని ఇన్‌స్పైర్ అయి తీశారు. నేను అలాంటి వారిని కలిసినప్పుడు చేయాలనిపించింది.

సమంత పాత్రకు, మీకు సంబంధం ఉంటుందా?

అస్సలు ఉండదు. కానీ మా ఇద్దరి మధ్య డ్రామానే సినిమా. ఆమె ఆత్మగా నటిస్తుంది.

ఈ చిత్రం 'రాజుగారి గది'కి ఏవిధంగా కొనసాగింపు?

దానికి దీనికి సంబంధమే లేదు. పాపులర్ అయిన పేరు కాబట్టి టైటిల్ అలా పెట్టారు.

ఓంకార్ దర్శకత్వం ఎలా అనిపించింది?

తను చాలా కచ్చితమైన దర్శకుడు. చిన్న చిన్న లోపాలను కూడా వదలడు. జుట్టు సరిగ్గాలేకపోయినా పట్టుకుని మరీ సరిచేస్తాడు. అతనికి ప్రతీ సీన్ అనుకున్నట్టు పర్‌ఫెక్ట్‌గా రావాలి. అలా వచ్చే వరకూ చేస్తూనే ఉంటాడు. అతనితో పనిచేయటం చాలా

'యుద్ధం శరణం' సినిమా ఏ తరహాలో ఉంటుంది?

మైండ్ గేమ్ కథ. సోషల్ మీడియాను ఎలా వాడుకోవచ్చు అన్నదే సినిమా. సోషల్ మీడియా ద్వారా ఎవరినైనా కిందికి దించేయవచ్చు. అదే ఆయుధం.

చైతన్య సమంతల వివాహం ఎలా ప్లాన్ చేస్తున్నారు?

అక్టోబర్ 6న చేయాలని అనుకుంటున్నాం. ఆరోజే క్రిస్టియన్, హిందూ పద్ధతిలో పెళ్లి జరుగుతుంది. పెళ్లి వేడుకను చిన్నదిగా చేద్దామని వాళ్లే అన్నారు. ఆ తర్వాత కార్యక్రమాన్ని మాత్రం గ్రాండ్‌గా ఉండేలా నేనే ప్లాన్ చేస్తున్నాను.

'బిగ్‌బాస్'లో తారక్ ఎలా చేస్తున్నాడు?

చాలా ఎనర్జిటిక్‌గా చేస్తున్నాడు. బయట తారక్ ఇలాగే ఉంటాడు. సినిమాలో పాత్ర చేయాలంటే అతన్ని కంట్రోల్ చేయాలి.

మీ సినిమాల్ని ఇతర భాషల్లో కూడా రిలీజ్ చేస్తారా?

ఇంకా ఏం అనుకోలేదు. గతంలోనే ఆరు సినిమాలు ఇతర భాషల్లో కూడా రిలీజ్ చేశాం. కానీ వర్కవుట్ కాలేదు. అందుకే నాకు నమ్మకం తక్కువ. ముందు తెలుగులో చేసి ఆ తర్వాత చూద్దామని అనుకుంటున్నాను.

'బంగార్రాజు' ఎంతవరకు వచ్చింది?

నాక్కూడా ఆ పాత్ర చేయాలని చాలా కోరిక. కళ్యాణ్ కృష్ణ ఒక లైన్ చెప్పాడు కానీ అది నచ్చలేదు. అతను మంచి కథ చెప్తే చేసేస్తాను. కానీ అది 'సోగ్గాడే చిన్ని నాయనా'కు సీక్వెల్‌లా ఉండకూడని మాత్రం అనుకుంటున్నా.

మలయాళం 'మహాభారతం'లో ఏ పాత్ర చేస్తున్నారు?

వాళ్ళు నన్ను కాంటాక్ట్ అయిన మాట నిజమే. కానీ చేస్తానా? చేయనా? అనేది మాత్రం కచ్చితంగా చెప్పలేను. అందులో కర్ణుడి పాత్ర కోసం నన్ను అప్రోచ్ అయ్యారు. ఆ ప్రాజెక్ట్ 2018లో మొదలవుతుంది.

'అర్జున్ రెడ్డి' సినిమా చూశారా?

నేను చూడలేదు. ట్రెండ్ సెట్ సినిమా అని తెలిసింది. హిందీలో ఈ తరహా వస్తున్నాయి. తెలుగులో అప్పట్లో 'సత్య' వచ్చింది. 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. బోల్డ్‌గా మాట్లాడారు అని అన్నారు. మనం బయట మాట్లాడుకునే మాటలే సినిమాలో పెట్టారు. అది ఎంతవరకు యూత్‌కు కరెక్ట్ అనేది సినిమా చూశాక అడిగితే చెబుతా.

ఆ అందాలు సెట్ వే(చే)సి



రామ్ చరణ్

రామ్ చరణ్, సమంత జంటగా 1985 కాలంనాటి కథను 'రంగస్థలం 1985' తెరకెకిస్తున్నాడు దర్శకుడు సుకుమార్. ఈ డైరెక్టర్ గోదావరి జిల్లా వాసి కావడంతో అక్కడ అందాలన్నీ అతనికి ఒడిసిపట్టినవే. ఈ సినిమా షూటింగ్ కూడా ఇప్పటి వరకూ పశ్చిమ గోదావరి జిల్లాలో అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించారు. చాలా భాగం గోదావరి అందాలను, అక్కడ ప్రాంతాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. అయితే ఇప్పటి వరకూ ఏవి అయితే ఆ పచ్చని అందాల్లో చిత్రీకరించారో...ఇక నుంచి అలా ఉండే సెట్‌లో తీయబోతున్నారు. అదేనండీ...గోదావరి అందాలను ఓ సెట్‌గా వేసి ఇక నుంచి అక్కడే చిత్రీకరణ జరపనున్నారు. దీన్ని కోసం ఇప్పటి వరకూ ఎవరూ వేయని ఖరీదైన సెట్ వేస్తున్నారట. అది రామోజీ ఫిల్మ్‌సిటీకి, మౌంట్ ఒపెరా రీసార్ట్‌కి మధ్యలో వేస్తున్నారు. ఎందుకంటే ఇప్పుడు సమంత, రామ్ చరణ్ ఇద్దరూ బిజీ అయిపోయారు. ఇప్పటి వరకూ మాత్రం ఖాళీగా ఉన్నారా? అంటే కాదు గానీ, త్వరలో సమంత వివాహం, ఈ ఏడాదిలోనే పూర్తి చేయాల్సిన ఎనిమిది ప్రాజెక్టులు ఉన్నాయి. రామ్ చరణ్‌కు చిరంజీవి చిత్రం 'సైరా నరసింహారెడ్డి' నిర్మాణ పనులు చూసుకోవాల్సి ఉంది. అందుకనే గోదావరి జిల్లాలో షూటింగ్ అంటే కష్టమవుతుందని ప్రత్యేకంగా సెట్ వేస్తున్నారట.

'ఆక్సిజన్' లాంటి కబురు



గోపీచంద్, అనుఇమ్మానుయేల్

గోపీచంద్ కథానాయకుడిగా, ఎ.ఎం. జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపొందుతోన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఆక్సిజన్'. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమై చాలా కాలమైంది. దీని తర్వాత మొదలైన గోపీచంద్ సినిమా 'గౌతమ్‌నంద' కూడా విడులైపోయింది. కానీ ఈ గురించి ఎటువంటి కబురూ లేదు. ఇప్పుడు ఈ మాస్ హీరో అభిమానులకు 'ఆక్సిజన్' లాంటి కబురు చెప్పారు. ఎట్టకేలకు ఈ సినిమా అక్టోబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు చిత్రబృందం సోమవారం ప్రకటించింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. గోపీచంద్ సరసన రాశీ ఖన్నా, అను ఇమ్మానుయేల్ కథానాయికలుగా నటించారు. శ్రీ సాయిరామ్ క్రియేషన్స్ పతాకంపై ఎస్.ఐశ్వర్య నిర్మిస్తున్నారు. త్వరలో ఆడియో విడుదల చేయనున్నారు. చిత్ర నిర్మాత ఎస్.ఐశ్వర్య మాట్లాడుతూ 'గోపీచంద్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బడ్జెట్‌తో తెరకెక్కిన సినిమా ఇది. ముంబై, గోవా, సిక్కిం, చెన్నై లాంటి ప్రదేశాల్లో నిర్మాణ విలువల విషయంలో ఎక్కడా రాజీపడకుండా రూపొందించాం. యువన్ శంకర్ రాజా స్వరాలు సమకూర్చారు" అని తెలిపారు. ఈ చిత్రానికి యాక్షన్ : పీటర్ హైన్స్-స్టంట్ సిల్వ.





ఎన్టీఆర్

తమన్నా ప్రత్యేక గీతం

ఈ మధ్య స్టార్ హీరోల చిత్రాలకు స్టార్ హీరోయిన్లతో ప్రత్యేక గీతాలు చేయిస్తున్నారు. ఆవిధంగా ఎన్టీఆర్ చేసిన 'జనతా గ్యారేజ్'లో కాజల్ చేసింది. ఇప్పుడు 'జై లవ కుశ'లో తమన్నాతో ఓ ప్రత్యేక గీతం చేయిస్తున్నట్టు తెలిసింది. ఈ పాట చేసేందుకు ఈ మిల్కీబ్యూటీ అంగీకరించినట్టు సమాచారం. ఇప్పటి వరకు వచ్చిన వాటితో పోల్చితే చాలా విభిన్నంగా ఉంటుందని, తమన్నా కొత్త అవతారంలో కనిపిస్తారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. తమన్నా ఇప్పటికే 'జాగ్వార్', 'అల్లుడు శీను' తదితర చిత్రాల్లోని ప్రత్యేక గీతాల్లో ఆడిపాడింది. గతంలో ఎన్టీఆర్, తమన్నా జంటగా 'ఊసరవెల్లి' చిత్రంలో నటించారు. త్వరలో ఆమె కళ్యాణ్ రామ్ హీరోగా చేస్తున్న సినిమాలో కథానాయికగా చేయనుంది. 'జై లవకుశ'లో చిత్రం ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కళ్యాణ్‌రామ్ నిర్మిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు. సెప్టెంబరు 21న చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.



దిశా పటాని

గుండుతో చేస్తే..!

బాలీవుడ్ అంటే ప్రయోగాలకు వేదిక. ఇటీవల హీరోయిన్లు కూడా లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు చేస్తున్నారు. హెయిర్ స్టయిల్‌ను విభిన్నంగా ప్రదర్శించి అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఇలా ప్రదర్శించడం మోడలింగ్‌లో ఓ ట్రెండ్ కూడా. కానీ జుట్టుతో పెద్దగా పనేముంటుందిలే అనుకుందో...ఏదొక ప్రయోగం చేయాలనుందో ఏమో కానీ కథానాయిక దిశాపటానికి ఓ ఆలోచన వచ్చిందట. గుండు(బాల్డ్ హెడ్)తో ఉన్న పాత్ర చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించింది. ఆ ప్రకటన చేశాక తన స్నేహితులందరినీ ఆ క్యారెక్టర్ చేస్తే ఎలా ఉంటుందని అభిప్రాయం అడుగుతుందట. కానీ ప్రయోగాలు చేస్తేనే అవకాశాలు కూడా పెరుగుతాయని గట్టిగా నమ్ముతున్నట్టు చెబుతోంది. ఒకవేళ కేన్సర్ బాధితురాలు తరహా పాత్రలో ఈమె నటించబోతుందో ఏమో. దిశా ఎం.ఎస్. ధోని, కుంగ్ ఫూ యోగా చిత్రాల్లో చేసింది. ప్రస్తుతం చాలా మంది చేతినిండా సినిమాలు వివిధ కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్స్‌గా వ్యవహరిస్తున్న తరుణంలో దిశా మాత్రం మంచి పాత్రలు వస్తేనే సినిమా చేసేందుకు నిశ్చయించుకున్నానని చెప్పింది.

'మహానుభావుడు'కి అరకోటి



శర్వానంద్

శర్వానంద్, మెహరిన్ హీరోయిన్‌గా రూపొందుతోన్న సినిమా 'మహానుభావుడు'. మారుతి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇందులో శర్వా అబ్సెసివ్ కంప్లెసివ్ డిజార్డర్ (ఓసీడీ)అనే వ్యాధితో బాధపడుతున్న కుర్రాడులా దర్శనమివ్వబోతున్నాడు. మెహరిన్ క్యూట్‌గా గ్లామర్‌తో కనిపించింది. ఈ చిత్రం టీజర్‌ని ఈనెల 24న విడుదల చేశారు. విడుదలైన క్షణం నుండి అనూహ్య స్పందన లభించింది. ఇప్పటికి అరకోటికిపైగా డిజిటల్ వ్యూస్‌ని సాధించింది. ఈ టీజర్‌లో హీరో శర్వానంద్ శుభ్రతను కోరికునే యువకుడు అంటే మిస్టర్ క్లీన్‌గా కనిపించాడు. ముఖ్యంగా టీజర్‌లో వచ్చిన "నా పేరు ఆనంద్ నాకో ఓసీడీ ఉంది.. ఓసీడీ అంటే బీటెక్, ఎంటెక్ లాంటి డిగ్రీలు కాదు ఇదొక డిజార్డర్. ఈ లక్షణాలు అతి శుభ్రం, విపరీతమైన నీట్‌నెస్.." అంటూ వాయిస్ ఓవర్‌తో ఆకట్టుకున్నారు. ఈ సినిమా దసరాకు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



నీరు చాలా అవసరమైన పోషకం. ఎవరికైనా. రోజూ నీళ్లు ఎక్కువగా తాగితే శరీరంలో ఉన్న మలినాలన్నీ బయటకు వెళ్లిపోయి, ఎలాంటి అనారోగ్యం దగ్గరకు రాదని, అన్ని వ్యాధులూ నయమైపోతాయంటూ ప్రచారం చేస్తుంటారు. కానీ ఇందులో ఏ మాత్రం నిజం లేదని వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. మనిషి శరీరంలో అసలు ఎన్ని నీళ్లు కావాలో నిర్ణయించుకునే వ్యవస్థ ఉంటుంది. ఎక్కువ నీళ్లు తాగకుండా మెదడు హెచ్చరికలు చేసి ఆపుతుంది. అయినా సరే ఆ హెచ్చరికలను పట్టించుకోకుండా అవసరానికి మించి ఎక్కువ నీళ్లు తాగితే 'హైపోనెట్రీమియా' అనే సమస్య వస్తుంది. ఇది మెదడు పనితీరుని దెబ్బతీస్తుంది. అంతేకాదు రక్తంలోని సోడియం గణనీయంగా పడిపోతుంది. దానివల్ల వాంతులు, వికారంతో మొదలుపెట్టి ఒక్కోసారి మనిషి ఏకంగా కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదం కూడా ఉంది. హైపోనెట్రీమియా సమస్య ఎలా వస్తుంది? దానిని ఎలా అధిగమించాలన్న విశేషాలే ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్'



అతిగా నీరు తాగితే.. అనర్థమే!

ఎన్నో శతాబ్దాల నుంచీ నీటి ప్రాముఖ్యత గురించి, ఆరోగ్యకరమైన జీవనశైలిలో పరిశుభ్రమైన నీటి అవసరం గురించి అంతా చెబుతూనే ఉన్నారు. అయితే నీటి అవసరం శరీరానికి ఎంత ఎంత ఉంది? అని ఒకసారి గమనిస్తే...శరీరంలో దాదాపు 80 శాతం బరువు నీటిదే. శరీరంలోకి నీరు మనం తినే ఆహారపదార్థాలు, సేవించే ద్రవపదార్థాల ద్వారా చేరుతుంది. సాధారణంగా శరీరం ఎంత నీరు గ్రహిస్తుందో అంత నీటిని విసర్జిస్తుంది. రోజులో శరీరం గ్రహించే 2,600 మిల్లీలీటర్ల నీటిలో సుమారు 1,500 మిల్లీలీటర్ల నీరు మూత్రం ద్వారా బయటకు వచ్చేస్తుంది. చెమటరూపంలోను, పీల్చిన గాలి వదిలేటప్పుడు ఆవిరిరూపంలోను మరొక 1, 000మిల్లీలీటర్ల నీరు శరీరం నుండి బయటకు వెళ్లి పోతుంది. మిగిలిన వంద మిల్లీలీటర్ల నీరు మల విసర్జనలో బయటకు పోతుంది.

మనిషి తాగే నీటి పరిమాణం అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని సీజన్లలోనూ ఒకేలా ఉండదు. ఇది రకరకాలుగా, సీజన్లని, ప్రాంతాలనీ ఆనుసరించి మారుతూ ఉంటుంది. ఉష్ణ ప్రాంతాల్లో ఉండేవారు, వేసవి కాలంలో కూడా ఎక్కువగా నీరు తీసుకుంటారు. ఈ సమయంలో మనిషి కొన్ని లీటర్ల నీటిని చెమటరూపంలో విసర్జిస్తాడు. శరీరంలో నీటికి సమతౌల్యం అవసరం. ఈ బాధ్యతని శరీరంలోని మూత్రపిండాలు ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయి.

నీరు శరీరంలోకి వెళ్లగానే

సాధారణంగా శరీరం మీద చన్నీరు పోస్తే చెమట గ్రంథులు మూసుకుపోతాయి. వేడినీరు పోస్తే స్వేదగ్రంథులు విశాలంగా తయారై ఎక్కువగా నీరు చెమటగా బయటకు వచ్చేస్తుంది. ఇది అందరికీ అనుభవమే. నీరు తాగితే అన్నవాహిక సులువుగా నీటిని పీల్చుకుంటుంది. కాని జీర్ణాశయానికి గల పలుచని పొర నీటిని అత సులువుగా చొచ్చుకుని పోనీయదు. చిన్న ప్రేవుల్లో భాగమయిన డుయోడినమ్‌లోకి పోయిన నీటిని వేగంగా చిన్న ప్రేవులు పీల్చుకుంటాయి. మిగిలిన నీటిని పెద్దప్రేవు పీల్చుకుంటుంది.

నీటి ప్రయోజనం

వేడినీరు కొంచెం, కొంచెంగా తాగితే జీర్ణ వ్యవస్థకి మేలు చేస్తుంది. హిస్టీరియా వ్యాధిగల వారు వ్యాధి వల్ల తెలివి తప్పినపుడు వారి ముఖం మీద నీళ్లు జల్లితే వారు తెలివిలోకి వస్తారు. అదే విధంగా మంచుముక్కలు చప్పరించడం వల్ల దాహం, వాంతులు తగ్గుతాయి. అంతేకాదు ఈ మంచు మూత్రనాళంలో వచ్చే ఇన్‌ఫెక్షన్ తీవ్రతను కూడా తగ్గిస్తుంది. భోజన సమయంలో మధ్య మధ్య కొంచెం ఎక్కువగా నీరు తాగితే గాల్‌స్టోన్స్ ఏర్పడకుండా ఉంటాయి. ఇక మిగిలిన ప్రయోజనాలన్నీ అందరికీ తెలిసినవే.

అతిగా నీటిని తాగితే?

నీరు ఎంత ఎక్కువ తీసుకుంటే అంత మేలనే ప్రచారాన్ని నమ్మి అవసరం లేకపోయినా ఎక్కువగా తీసుకుంటే ప్రయోజనం ఉంటుందనే భ్రమతో మరీ ఎక్కువగా నీరు తాగితే ఆరోగ్యానికి సమస్యే . ఆ నీటిని శరీరం తనలో ఇమిడ్చుకోలేక బయటకు నెట్టేయడానికి ప్రయత్నిస్తుంది, ఫలితంగా వాంతి అవుతుంది. అయితే సమస్య దానితో ఆగదు మత్తువస్తుంది. తలనొప్పి, మగత, మానసికంగా గాబరా, శక్తి హీనత, అడుగుతీసి అడుగు వేయడానికి ఓపిక లేకపోవడం వంటి సమస్యలు ఒకదాని తర్వాత మరొకటి వస్తాయి. ఇవన్నీ మెదడు చేసే హెచ్చరికలే. ఈ లక్షణాలు కన్పిస్తే అధికంగా నీటిని తాగడాన్ని మానుకుని డాక్టర్‌ని కలవాలి. అయితే మెదడు చేసే హెచ్చరికలు కాదని ఇంకా అధికంగా నీరు తాగితే మెదడు పనితీరు అస్తవ్యస్థమౌతుంది. ఫలితంగా శరీరం వణకడం, కాళ్లూ, చేతులు, చివరికి శరీరం వంకర్లు పోవడం, కిడ్నీలు విఫలం కావడం, కోమాలోకి వెళ్లి, చివరికి ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుంది.




దీనినే హైపోనేట్రీమియా లక్షణాలు అంటారు.

ఎలా జరుగుతుంది?

తాగిన నీరంతా అన్న వాహిక గుండా శరీరంలోకి వెళ్తుంది. అన్నవాహిక సులువుగా నీటిని పీల్చుకుంటుంది. నిముషాల్లో ఈ నీరు రక్తాన్ని చేరుతుంది. అందువల్ల రక్తం ఘన పరిమాణం బాగా పెరుగుతుంది. రక్తం విలీనమై హైపోటానిక్‌గా మారుతుంది. అంటే ఉండాల్సిన పీడనం కన్నా ఎక్కువగా ఈ ద్రవం ఉందన్నమాట. ఈ రక్తం ప్రసరణం అధిక పీడనం వల్ల శరీరంలో జలతుల్యతను కాపాడే మెదడు భాగాన్ని చేరి దాని పనికి ఆటంకం కలిగిస్తుంది. మెదడు దిగువభాగంలో గల హైపోథాల్మస్‌లో ఉండే ఆస్మోరెసిస్టర్లు చురుకుతనంలోకి వస్తాయి. ఫలితంగా పిట్యూటరీగ్రంథి విడు దల చేసే యాంటీ డైయురేటిక్ హార్మోను పరిమాణాన్ని తగ్గించేటట్లు చేయడంగాని లేదా ఆ హార్మోను విడుదల కాకుండా చేయడంగా గానీ పరిణామం చెందుతుంది. సామాన్యంగా ఈ హార్మోను మూత్రపిండాలు నీరు గ్రహించే ప్రక్రియను ప్రోత్సహిస్తుంది. అందువల్ల సాధారణ పరిస్థితుల్లో అయితే తక్కువ పరిమాణంలో మూత్రం తయారవుతుంది. ఈ కానీ హార్మోను విడుదల తగ్గిపోవడం వల్ల అధికంగా మూత్రం ఉత్పత్తి జరిగి, శరీరం నుంచి అధికంగా ద్రవాలు బయటకు వెళ్లిపోతాయి. ఉదాహరణకు ఆరోగ్య వంతుడైన ఒక యువకుడికి నీరు తాగాలి అన్పించకపోయినా బలవంతంగా ఒకేసారి 1.5 లీటర్ల నీటిని తాగిస్తే అందులో 75శాతం మూత్రం రూపంలో కేవలం రెండు గంటల్లోనే విసర్జిస్తాడు. నాలుగు గంటల వ్యవధిలో 90శాతం నీటిని మూత్రంగా విసర్జిస్తాడు. దీనివల్ల కణజాలం స్వభావానికి పెద్ద నష్టం అంతగా ఉండదు. కానీ అంతకన్నా ఎక్కువ మొత్తంలో నీరు మళ్లీ తాగితే ఈ నీటిని మూత్రపిండాలు శుద్ధి చేయలేవు. వాటి పనితీరు కుంటుపడుతుంది. ఎందుకంటే కిడ్నీలు నిమిషానికి 16 మిల్లీ లీటర్ల మూత్రాన్ని మాత్రమే ఉత్పత్తి చేస్తాయి.

మెదడుపై ప్రభావం

ఎక్కువగా తాగిన నీటిలో రక్తం బాగా విలీనం కావడం వల్ల అందులోని సోడియం గాఢత బాగా తగ్గిపోతుంది. అనేక కణజాలాలు నీటిని పీల్చుకుని



బాగా ఉబ్బిపోతాయి. మెదడు లోని కణాలు, రక్తనాళాల చుట్టూ ఉండే కణజాలం ఉబ్బడంవల్ల మనిషికి మత్తు మొదలవుతుంది. అందుకే మితిమీరి మంచినీళ్లు తాగకూడదు. నీరు శరీరంలో ప్రధాన కణప్రవాహంలోనూ, అంతరకణ ప్రవాహంలోనూ ఉంటుంది. ఈ రెండు ప్రవాహలలో సోడియం అయానులు, పొటాషియం అయానులు సమృద్ధిగా ఉంటాయి. ఈ రెండు ప్రవాహాలు వేర్వేరుగా కణకవచం వల్ల ఉంటాయి. ఈ కణకవచం గుండా లోపలకు, వెలుపలకు నీరు స్వేచ్ఛగా వ్యాపనం చెందుతుంది. అయితే అయానులు మాత్రం వెళ్లలేవు. శరీరం నష్టపోతున్న నీటిని తగిన సమయంలో భర్తీ చేయకపోతే 'డీ హైడ్రేషన్' తప్పదు. డీహైడ్రేషన్ సంకేతాలు రావడానికి ముందే దాహం వేస్తుంది. మంచినీళ్లు తాగడం కోసం ప్రయత్నిస్తాడు. అయితే అధికంగా నీరు తాగినప్పుడు మెదడు చురుకుదనం తగ్గిపోతుంది, తగిన సంకేతాలు ఇవ్వలేదు.

సమస్య తీవ్రమైతే

నీరు అతిగా తాగడం వల్ల ద్రవాలు బయటకి వెళ్లిపోయి శరీరంలో సోడియం లోపిస్తే సీరమ్ సోడియం సాధారణ స్థాయి కన్నాతక్కువగా పడిపోతుంది. ఈ స్థితే హైపోనేట్రీమియా అంటారు. అతిసారం (డయేరియా), వాంతులు దీర్ఘకాల మూత్రనాళ సంబంధిత రోగాలు వంటివి సోడియం లోపానికి దారితీస్తాయి. సోడియమ్ లోపం వలన రక్తపీడనం తగ్గడం, ప్రసరణ వ్యవస్థ దెబ్బతినడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. కొన్ని సార్లు అధిక స్థాయిలో సోడియం ఉంటే సీరమ్ సోడియం స్థాయి పెరుగుతుంది. ఈస్థితినే హైపర్ నేట్రీమియా అంటారు. సామాన్యంగా దీని వలన కొన్ని హార్మోనులలో అసమతుల్యతలు ఏర్పడతాయి.రక్త పీడనంపెరగడం (హైపర్ టెన్షన్), శరీరంలో నీరు చేరడం తో ఎడిమా రావడం. వంటి లక్షణాలు హైపర్ నేట్రీమియాలో కన్పిస్తాయి. కొంత వరకు మూత్రపిండాల సమస్యలు కూడ ఏర్పడతాయి. హైపో నేట్రీమియా సమస్యకు పరిష్కారంగా నీటిలోకరిగిన ఉప్పును తీసుకుంటే సామాన్యంగా శరీరం తేరుకుంటుంది. అప్పటికీ ఫలితం కన్పించక పోతే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి.



డాక్టర్ వజ్రపు రాజేంద్ర
ఎం.డి., ఎఫ్.ఎన్.బి., ఇ.డి.ఐ.సి.
సీనియర్ కన్సల్టెంట్, క్రిటికల్ కేర్,
డైరెక్టర్ - ఎమ్ఐసియు, ఎల్.బి.నగర్,
హైదరాబాద్.

రోజుకి ఎంత నీరు తాగాలి?



ఒక మనిషి రోజుకు 8 నుంచి 10 గ్లాసుల మంచినీరు తాగొచ్చు. కానీ ఇది కూడా ఒకేసారి తాగకూడదు. రోజంతా విస్తరిస్తూ తాగాలి. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవారు అధికంగా నీరు తాగడం వల్ల మూత్రపిండాల వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంటుంది. పేగుల ప్రక్షాళనకు ఉదయాన్నే ఖాళీకడుపుతో 250 మిల్లీలీటర్లు లేదా ఓ గ్లాసు గోరువెచ్చని నీటిని తాగడం మంచిది. భోజనం చేసేటపుడు 100 లేదా 150 మిల్లీలీటర్ల నీటిని తాగితే పర్వాలేదు. భోజనం తర్వాత ప్రతీ గంటకు లేదా రెండు గంటలకు ఓ గ్లాసునీటిని తాగితే ఎలాంటి సమస్య ఉండదు. దాహం వేస్తే శీతల పానీయాలు, ఫ్రిజ్‌లో ఉండే చల్లటి నీరు కన్నా 200మిల్లీలీటర్ల గోరువెచ్చని నీటిని తాగితే ఆరోగ్యానికి చాలా మంచిది. ★



పొడుపు కథ

ఊరంతటికీ ఒక్కటే దుప్పటి ఏమిటది?

(సమాధానం: ఆకాశం)

జోక్:

చంటి : నాన్నా..! నేను మంచివాడ్నా..? తమ్ముడు మంచివాడా..?

తండ్రి : నన్ను ఎవరు డబ్బులు అడగరో వాళ్ళు మంచివాళ్ళు.

చంటి : అయితే రేపటి నుంచి అమ్మకు ఎక్కువ డబ్బులు ఇవ్వండి

తండ్రి : ఆ..!!??



చుక్కలు కలపండి !

పిల్లలూ..! పైనున్న ఫోటోలో చుక్కల ఆధారంగా బొమ్మ గీసి, రంగులు వేయండి.

ఇదీ.. ట్రయాంగిల్ మిస్టరీ



ప్రపంచంలో ఎన్నో కొత్త విషయాలు తెలుస్తున్నా, కొన్ని విషయాలు మాత్రం ఇంకా మిస్టరీగానే మిగిలిపోతున్నాయి. అలాంటి వాటిలో పేరుగాంచింది బెర్ముడా ట్రయాంగిల్. కొన్ని శతాబ్దాల కాలం నాటి నుంచి బెర్ముడా ట్రయాంగిల్ ఓ మిస్టరీగానే మారిపోయింది. కానీ దాన్ని ఎవరూ ఛేదించలేక పోయారు. అయితే సైంటిస్టులు ఈ ట్రయాంగిల్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని కనిపెట్టేశారు. మియామి, ప్యూర్టోరికో, బెర్ముడాల మధ్య విస్తరించి ఉన్నదే బెర్ముడా ట్రయాంగిల్. ఎన్నో వందల సంవత్సరాల కాలం నుంచి ఇదొక మిస్టరీగా మారిపోయింది. కారణం అక్కడ సంచరించే షిప్పులు, విమానాలు ట్రయాంగిల్‌లో పడి అదృశ్యమవుతుండడమే. అయితే అలా అవి ఎందుకు మిస్ అవుతున్నాయో ఎవరూ కూడా ఇప్పటి వరకు చెప్పలేకపోయారు. దాని రహస్యాన్ని ఛేదించాలని వెళ్ళిన కొందరైతే ఏకంగా తమ ప్రాణాలనే పోగొట్టుకున్నారు. అయితే దీని వెనుక ఉన్న రహస్యాన్ని ఎట్టకేలకు శాస్త్రజ్ఞులు ఛేదించేశారు. షడ్భుజి (హెగ్జాగాన్) ఆకారంలో కూడిన మేఘాలు బెర్ముడా ట్రయాంగిల్ ప్రదేశంలోని వాతావరణంలో సుమారు 20 నుంచి 50 మైళ్ల పొడవున ఒక్కొక్కటి విస్తరించి ఉన్నాయి. నిజానికి సైంటిస్టులు చెబుతున్నదేమిటంటే ఇవి సాధారణ మేఘాలు కావట. వీటిని ఎయిర్ బాంబ్స్ అని పిలుస్తారట. అంటే ఇవి గాలి శక్తితో కూడిన పెద్ద పెద్ద బాంబులన్నమాట.



సాధారణ బాంబులలాగే ఇవి కూడా విస్ఫోటన శక్తిని కలిగి ఉంటాయి. అయితే అది గాలి రూపంలో ఉంటుంది. అలా విస్ఫోటనం చెందినప్పుడు అక్కడి వాతావరణంలో ఉండే గాలి అప్పటికప్పుడే 170 మైళ్ల వేగాన్ని అందుకుంటుందట. దీంతో ఆ ప్రదేశానికి సమీపంలో ఉన్న షిప్పులు, విమానాలు కూడా ఆ గాలి శక్తికి నిలవలేవట. అందుకే అవి ట్రయాంగిల్‌లో అదృశ్యమవుతున్నాయని సైంటిస్టులు తేల్చేశారు. ★

వజ్రాలమూట - 2

కథ: శాఖమూరి శ్రీనివాస్ (సెల్: 94410 73753)
బొమ్మలు: తుంబలి శివాజీ (సెల్: 98498 27509)



ప్రజాశక్తి
www.prajasakti.com

శక్తివంతంగా భారత్ మహిళా క్రికెట్ జట్టు

- ఇంటా, బయటా వివిధ పర్యటనలు
- అండర్-16 జట్టుకు జోనల్ టోర్నీలు
- 30న సమావేశంలో బిసిసిఐ తుది నిర్ణయం

న్యూఢిల్లీ: భారత మహిళా క్రికెట్ జట్టును మరింత శక్తివంతంగా తయారు చేసేందుకు బిసిసిఐ సరికొత్త ప్రణాళికలకు రూపకల్పన చేసింది. దేశ, విదేశాల్లో వివిధ టూర్‌లు, జోనల్ మ్యాచ్‌ల ద్వారా టీనేజ్ నుంచి జట్టు పటిష్టానికి కార్యాచరణను సిద్ధం చేస్తోంది. బిసిసిఐ పాలక మండలి సభ్యురాలు డయనా ఎదుల్జీ సారథ్యంలో భారత్ మహిళా జట్టు కెప్టెన్ మిథాలీరాజ్, సీనియర్ పేసర్ జుహ్లన్ గోస్వామి, బిసిసిఐ జిఎం(గేమ్ డెవలప్‌మెంట్) రత్నాకర్ శెట్టి ఓ కమిటి కింద ఏర్పడ్డారు. ఈ కమిటీ బుధవారం సమావేశమై పలు కీలక నిర్ణయాలను తీసుకోనుంది. ఇప్పటి వరకు ఆల్ ఇండియా స్థాయిలో జూనియర్ టోర్నీలను అండర్-19, 23 కేటగిరుల్లోనే దేశవాళీ మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. ఇక మీదట అండర్-16 నుంచే దేశవాళీలో జోనల్ టోర్నీలకు విస్తరించనున్నారు. ఇండియా- ఎ టూర్‌లను దేశీవాళీ స్థాయిలో నిర్వహించి జట్టును మరింత శక్తివంతంగా తయారు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఎదుల్జీ తెలిపారు. ఐసిసి మహిళా ప్రపంచ కప్‌లో భారత్ అద్వితీయంగా రాణించడంతో భారత్ జట్టు బలాన్ని మరింత పెంచాల్సిన అవసరాన్ని గుర్తించామన్నారు. 15 ఏళ్ల క్రితం చివరగా భారత్ పాకిస్తాన్‌లో పర్యటించింది. భారత పురుషుల క్రికెట్ జట్టుకు 10 ఏళ్ల నుంచే ఐపిఎల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ లీగ్‌ను మహిళా జట్టుకు ప్రవేశపెట్టడం వలన దేశం వరకు ఉపయోగం ఉండదన్న అభిప్రాయం వ్యక్తం కావడంతో ప్రస్తుత సమీక్షలో ఈ అంశాన్ని పరిశీలించే అవకాశమే లేదు. వచ్చే ఏడాది ఐసిసి టి20 ప్రపంచకప్ జరగనుండటంతో అప్పటికి కొంత మంది యువ మహిళా క్రికెటర్లను సమాయత్తం చేసే దిశగా ప్రయత్నాలను మొదలెట్టనున్నారు. ఈ టోర్నీకి ముందే దేశంలోనే ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలతో ద్వైపాక్షిక సిరీస్‌లను నిర్వహించడానికి బిసిసిఐ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. దీంతో మహిళా జట్టు మరింత పటిష్టానికి చర్యలు చేపట్టడం సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టినట్లే.



క్వార్టర్స్‌కు గౌరవ్

ప్రపంచ బాక్సింగ్‌లో శివ, మనోజ్ ఔట్



హాంబర్గ్: ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో సీనియర్ బాక్సర్లు శివ థప, మనోజ్‌కుమార్ పేలవమైన ప్రదర్శనతో ఇంటి ముఖం పట్టారు. 56 కేజీల విభాగంలో ఎవరి ఊహించని విధంగా గౌరవ్ బిదూరి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరి పతకంపై ఆశలు రేపాడు. ప్రి క్వార్టర్స్‌లో గౌరవ్ ఉక్రెయిన్‌కు చెందిన మికోలా బట్సెనెకోపై వరుస పంచ్‌లతో చిత్తుగా ఓడించాడు. ఐదో సీడ్‌గా బరిలో దిగిన శిశ (60 కిలోలు) ఎర్సొస్యాన్ (జార్జియా) రెండో రౌండ్ బౌట్‌లో పరాజయం పాలయ్యాడు. తొలి రౌండ్ శివకు బై లభించిన విషయం తెల్సిందే. 2015లో ప్రపంచ ఛాంప్‌లో శివ కాంస్యం సాధించాడు. 31 ఏళ్ల మనోజ్ కుమార్(69 కిలోలు) 2013 ప్రపంచ ఛాంప్ కాంస్య పతక విజేత గాబ్రియెల్ పెరెజ్(వెనిజులా) చేతిలో ఓడాడు.

30, 31న శాప్ అకాడమీలకు ఎంపికలు

ప్రజాశక్తి - విజయవాడ

గుంటూరు, కాకినాడలో ఏర్పాటు చేయనున్న శాప్ శిక్షణా అకాడమీలకు ఈనెల 30, 31 తేదీల్లో ఎంపికలు నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వి.రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తైక్వాండో, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాలకు కాకినాడలో ఎంపికలు నిర్వహించనున్నామని తెలిపారు. శాప్ అకాడమీలో ప్రవేశం కోసం జిల్లా స్థాయిలో ఎంపికైన బాలబాలికలు రాష్ట్ర స్థాయి ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విజయవాడలోని శాప్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

అల్ హసన్ పాంచ్ పటాకా

తొలి టెస్ట్‌లో ఆసీస్‌పై 'బంగ్లా'కు ఆధిక్యం



మీర్‌పూర్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్ 88 పరుగుల ఆధిక్యం సాధించింది. 50వ టెస్ట్ ఆడుతున్న బంగ్లా ఆల్ రౌండర్, లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ షకీబ్ అల్ హసన్ ఆసీస్ ఇన్నింగ్స్‌ను పాంచ్ పటాకా5/68తో తో కుప్పకూల్చేశాడు. దీంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్ 217కు తెరపడింది. బంగ్లాకు 43 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లా జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 45/1తో నిలిచింది. 15 పరుగుల వద్ద సౌమ్య సర్కార్ తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఇక్బాల్ 30, ఇస్లామ్ పరుగులేమి చేయకుండా క్రీజులో నిలిచారు. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ 260 పరుగులకు ఆలౌట్ అయ్యిన విషయం తెల్సిందే.

యూఎస్ రెండో రౌండ్‌కు ముగురుజ, ఎడ్మండ్





న్యూయార్క్ సిటీ: ప్రతిష్టాత్మకమైన యూఎస్ ఓపెన్ తొలి రౌండ్ పోరులో టెన్నిస్ తారలు సునాయాస విజయంతో సత్తా చాటారు. గార్బైన్ ముగురుజ(స్పెయిన్) లెప్‌చెన్‌కోవా(అమెరికా)పై 6-0,6-3తోను,పెట్రో క్విటోవా (చెక్) జకోవిక్(సెర్బియా)పై 7-5, 7-5తోను, కరోలినా ప్లిస్కోవా (చెక్) ఇగుచి(జపాన్)పై 6-2,6-2, కోర్‌నెట్(ఫ్రాన్స్) వాట్సన్(బ్రిటన్)పై 6-4,6-4తో విజయం సాధించి రెండో రౌండ్లోకి చేరారు. పురుషుల విభాగంలో కె ఎడ్మండ్ (బ్రిటన్) హస్సే(నెదర్లాండ్స్)పై 6-3, 7-5,6-3తోను, ఎఫ్ మేయర్ (జర్మనీ) డిఆర్ సిల్వా(బ్రెజిల్)పై 7-5,0-6,6-3,6-4తో విజయం సాధించి రెండో రౌండ్‌కు చేరారు.

కాక పుట్టిస్తున్న కొత్త జట్లు

- ప్రొ కబడ్డీలో గుజరాత్,ఉత్తరప్రదేశ్ హవా
- నెలరోజులు - 50 మ్యాచ్‌లు పూర్తి


ప్రదీప్ నర్వాల్

లక్నో: ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో కొత్త జట్లు కాక పుట్టిస్తున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్లపైనే విజయదుందుభితో చెలరేగుతున్నాయి. ఇటీవల కాలంలో వరుస విజయాలతో కబడ్డీ కోర్టులో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్, ఉత్తరప్రదేశ్ యోధ జట్లు దుమ్మురేపుతున్నాయి. ఆయా జోన్లలో ఆరు జట్ల పోరులో అగ్రస్థానాల్లో ఈ జట్లు కొనసాగుతున్నాయి. గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ ఆడిన 10 మ్యాచ్‌ల్లో ఏడు విజయాలు, రెండు మ్యాచ్‌లు డ్రా, ఒక్క ఓటమితో 41 పాయింట్లతో జోన్ ఎలో ప్రథమ స్థానంలో కొనసాగుతోంది.ఉత్తరప్రదేశ్ యోధ 11 మ్యాచ్‌లు ఆడి నాలుగు విజయాలు ఐదు ఓటములు,రెండు మ్యాచ్‌ల డ్రాతో మొత్తం 30 పాయింట్లతో జోన్ బిలో టాప్ స్థానంలో నిలిచింది. ఈ సీజన్‌లో కొత్తగా నాలుగు జట్లు హర్యానా స్టీలర్స్, బెంగాల్ వారియర్స్, ఉత్తరప్రదేశ్ యోధ, గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ బరిలో దిగిన విషయం తెల్సిందే. జూలై 28 నుంచి ఆగస్టు 28 వరకు నెలరోజుల్లో 50 మ్యాచ్‌లు పూర్తి అయ్యాయి. హైదరాబాద్, ఉత్తరప్రదేశ్, ముంబయి వేదికలుగా మ్యాచ్‌లు జరిగిన విషయం తెల్సిందే. సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ తమిళ్ తలైవాస్‌పై 32-27 పాయింట్ల తేడాతో తొలి విజయాన్ని సాధించింది. తర్వాత సొంత నగరంలోనే వరుసగా ఐదు ఓటములతో కష్టాల్లో కూరుకుపోయింది. ఉత్తరప్రదేశ్ వేదికగా యు ముంబాపై 37-32తో రెండో విజయాన్ని సాధించింది. జోన్ బిలో 11 మ్యాచ్‌లు ఆడి రెండు విజయాలు 8 ఓటములు, ఓ మ్యాచ్ డ్రా ద్వారా 18 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. రెండుసార్లు టైటిల్ సాధించిన జైపూర్ పింక్ పాంథర్స్ కేవలం ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు గెలిచి, రెండు ఓడి 22 పాయింట్లతో జోన్ ఎలో నాలుగో స్థానంలో నిలిచింది.


రాహుల్ చౌదరీ


గుజరాత్ టీం

కెప్టెన్లే టాప్ రైడర్లు..

ప్రొ కబడ్డీలో ఇప్పటి వరకు ముగ్గురు రైడర్లు టాప్ పాయింట్లతో ముందంజ వేశారు. భారత కబడ్డీ జట్టులో ఫిటెనెస్ కలిగిన రౌడర్,పాట్నా జట్టు సారథిగా ప్రదీప్ నర్వాల్ 83 పాయింట్లను సాధించి టాప్-వన్‌లో నిలిచాడు.తెలుగు టైటాన్స్ జట్టు కెప్టెన్ రాహుల్ చౌదరీ కూడా జట్టును గెలిపించలేకపోయినప్పటికీ ప్రతీ మ్యాచ్‌లో 10 పాయింట్ల తగ్గకుండా తన హవాను చాటుతున్నాడు. 83 పాయింట్లతో రెండోస్థానంలోనే ఉన్నాడు. ఇటీవలే 500 రైడ్ పాయింట్ల సాధించిన తొలి క్రీడాకారుడిగా రాహుల్ చరిత్రకెక్కాడు. బెంగళూరు బుల్స్ కెప్టెన్ రోహిత్ కుమార్ 82 పాయింట్లుతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. వివిధ జట్లలో ఉన్న విదేశీ ఆటగాళ్ల రాణింపు అంతంత మాత్రంగానే ఉంది. యు ముంబా జట్టుకు ప్రధానంగా ఇదే శాపంగా పరిణమించింది. విదేశీ ఆటగాళ్లను జట్టును ఆదుకోవాలని ప్రాంఛైజి విజ్ఞప్తి చేయడం విశేషం.

టాప్ డిఫెండర్లు : సురేంద్ర నాడా 33 పాయింట్లు, అబ్జార్ మొహజర్ మిఘాని 30, విశాల్ భరద్వాజ్ 29 పాయింట్లు

ఆల్ రౌండర్లు: మీరజ్ షెకాయ్ 48 పాయింట్లు సందీప్ నర్వాల్ 36 పాయింట్లు, విశాల్ భరద్వాజ్ 29


మహిళా సర్పంచ్‌తో వాగ్వివాదానికి దిగిన అధికార పార్టీ నాయకులు

దళిత మహిళా సర్పంచ్‌పై దౌర్జన్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

దళిత మహిళా సర్పంచ్‌పై అధికార పార్టీకి చెందిన పాలకవర్గ సభ్యుడు లోకనాథం దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం అద్దెపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. ఉపాధి హామీ పథకం 14వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు పనులు జరిపించాల్సి ఉంది. అయితే సర్పంచ్‌గా తనకు తెలియకుండా ఈ రహదారి పనులు ఏవిధంగా జరిపిస్తారని గ్రామ సర్పంచ్ కంభం మరియమ్మ ఉప సర్పంచ్ సాయిబాబును నిలదీశారు. వారిరువురి మధ్య దూషణల పర్వం మొదలయ్యింది. ఈ నేపథ్యంలో సర్పంచ్ మరియమ్మపై పాలకవర్గ సభ్యుడైన లోకనాథం చెయ్యెత్తి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. మహిళా సర్పంచ్‌పై దురుసుగా ప్రవర్తించడం, ఆమెను దుర్భాషలాడడం సరైంది కాదని సాయిబాబు, లోకనాథం చర్యలను ఆ ప్రాంత గ్రామస్తులు ఖండించారు. దీంతో టిడిపి మాజీ పట్టణ అధ్యక్షులు కుక్కల భూషణరావు కలుగజేసుకుని ఈ పని ఎవరు చేయాలనేది మంత్రి ఆనందబాబు వద్ద తేల్చుకునేంత వరకు ఎవరు ప్రారంభించంకూడదని, పనిని నిలిపివేయాలని చెప్పడంతో ఇరువురు సమ్మతించారు. ఈమేరకు మంత్రిని కలిసి తేల్చుకునేందుకు వెళ్ళారు.

పోలవరంలో పురావస్తు తవ్వకాలు

- బయటపడ్డ 257 పురాతన కట్టడాలు,శిలలు
- 2,500 ఏళ్ల నాటి సమాధుల తవ్వకాలకు అనుమతులు కోరుతూ కేంద్రానికి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ముంపు ప్రాంతాల్లోని గిరిజనుల చరిత్ర, సంస్కృతి, అలవాట్లు తెలుసుకోవాలంటే అక్కడి శిలలు, పురాతన కట్టడాలు తదితర ఆనవాళ్లే ఆధారం. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఆ ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలోగా ముంపు ప్రాంతాల్లోని పురాతన కట్టడాలు, శాసనాల్ని భద్రపరిచేందుకు పురావస్తు శాఖ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా పోలవరం ప్రాజెక్టు పరిధిలోని 8 ముంపు మండలాల్లో తవ్వకాలు చేపట్టింది. తూర్పు గోదావరి జిల్లాలోని దేవిపట్నం, విఆర్ పురం, కూనవరం, ఏటపాక అలాగే పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, బూర్గంపాడు మండలాల్లో ఈ ఏడాది జనవరి నుంచి పురావస్తు శాఖ తవ్వకాలు చేపడుతోంది. ఇప్పటివరకు ఆ శాఖ చేపట్టిన తవ్వకాల్లో 257 పురాతన కట్టడాలు, శిలలు, కాకతీయుల కాలంనాటి పలు శాసనాలు బయటపడ్డాయి. ఇక పోలవరం ప్రాజెక్టు పరిధిలో కాకతీయుల కాలం నాటి రామయ్యపేట, పట్టిసీమ వీరభద్రేశ్వర దేవాలయాలను కూడా పరిరక్షించాల్సిన అవసరముందని పురావస్తు శాఖ అధికారులు చెప్తున్నారు. వాటికి పర్యాటకంగా కూడా ఆదరణ ఉంది. ఆ దేవాలయాలు నది మధ్యలో ఉన్నందున వాటిని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఆ విగ్రహాలను పురావస్తు మ్యూజియంలోగానీ, ఒకవేళ ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక చిహ్నంగా తమ వద్దే ఉంచాలని కోరితే అక్కడే ఉంచుతారు.


సప్తమాత్రిక



తూర్పుగోదావరి జిల్లా ఏటిపాక మండలంలో బయటపడిన పురాతన సమాధులు


ఆ చుట్టుపక్క గిరిజన ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని రుద్రమకోట, రాయునిపేట, జిన్నెలగూడెం, చినమెట్లపల్లి గ్రామాల్లో దాదాపు 2500 నుంచి 3వేల ఏళ్ల క్రితం ఖననం చేసిన వారి సమాధులున్నట్లు పురావస్తు శాఖ గుర్తించింది. వాటిని తవ్వితే ఆ కాలంనాటి గిరిజనుల అస్థిపంజరాలు, వారు వాడిన పరికరాలు, పనిముట్లు భద్రపరచవచ్చని భావిస్తోంది. దీని ద్వారా ఆ కాలంలో అప్పటి సంస్కృతిని తెలుసుకోవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఆ నాలుగు గ్రామాల్లో తవ్వకాలు చేపట్టాలంటే కేంద్ర పురావస్తు శాఖ అనుమతి తప్పనిసరి. అందువల్ల ఇప్పటికే ఆ ప్రాంతాల్లో తవ్వకాలకు అనుమతివ్వాల్సిందిగా కేంద్రానికి లేఖ రాశామని పురావస్తు శాఖ అధికారులు తెలిపారు. అలాగే రెడ్డిగూడెం, కౌండిన్యముక్తి మండలాల్లో కాకతీయుల కాలం నాటి శాసనాలున్నాయని, ఆ ప్రాంతంలో కూడా తవ్వకాలకు అనుమతి కోరామని చెప్పారు. ముంపు ప్రాంతంలో 370 మారుమూల గ్రామాలున్నట్లు తమ సర్వేలో గుర్తించామని తెలిపారు. ఆ ప్రాంతాల్లో తవ్వకాలు చేపడితే పదో శతాబ్దం నాటి శాసనాలు, ఆ కాలంలో ఉపయోగించిన పరికరాలు బయటపడే అవకాశముందని చెప్పారు. తవ్వకాల్లో బయటపడ్డ వాటిని రాజమండ్రి మ్యూజియంకు గాని త్వరలో ప్రారంభించే ఏలూరు మ్యూజియంకు కాని తరలిస్తామన్నారు.



పురావస్తు పరిశోధనలకు నిధుల కొరత

గత చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను వెలుగులోకి తీసుకువచ్చే పురావస్తు శాఖ పరిశోధనలకు ప్రభుత్వం నుంచి నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పోలవరం ప్రాంతంలో తవ్వకాలకు కాని, పురాతన శాసనాలు, వస్తువుల తరలింపు, తదితర ఖర్చులకు ప్రభుత్వం రూ 4.5 కోట్లు కేటాయించిందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఈ నిధులు ఏ మాత్రం సరిపోవని, అదనపు నిధుల కోసం ప్రభుత్వాన్ని కోరతామన్నారు. రాష్ట్ర విభజన తరువాత రాజధానిని విజయవాడ, గుంటూరుకు తరలించే సమయంలో పురావస్తు శాఖకు నష్టం వాటిల్లిందని అధికారులు చెప్పారు. తరలింపులో చాలా వరకు ఏపికి రావాల్సినవి ఇంకా హైదరాబాద్‌లోనే ఉన్నాయని, వాటిని తరలిస్తే అవి నాశనమయ్యే అవకాశముందని, అందువల్ల కనీసం అక్కడైనా ఆ పురాతన సంపదను భద్రంగా ఉంటే చాలని భావిస్తున్నామని వారు అభిప్రాయపడుతున్నారు.


వీరగల్లు


వడ్డి గూడెంలోని రుద్ర కోటేశ్వర స్వామి దేవాలయం


సూర్య

ఇక సొంతంగానే ఆర్టీసి పార్సిల్ సర్వీసు

- ఎఎన్‌ఎల్‌తో ముగిసిన ఒప్పందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ బస్‌స్టాండ్లలో సొంత పార్సిల్ సర్వీసును ఎపిఎస్ ఆర్టీసి సోమవారం నుంచి పూర్తి స్థాయిలో చేపట్టింది. ఈ సేవలను ఎఎన్‌ఎల్ (అల్లాయ్ నైట్రెడ్స్ లిమిటెడ్) చేస్తుండేది. ఆర్టీసితో ఎఎన్‌ఎల్‌కు ఒప్పందం ముగియడంతో ఆ పార్సిల్ కార్యాలయాలు మూతపడ్డాయి. ఇకపై ఆర్టీసి బస్సుల్లోనే సరుకు రవాణా కూడా చేపడతారు. ఎఎన్‌ఎల్ కాంట్రాక్టును పునరుద్ధరించకుండా సొంతంగా పార్సిల్, కొరియర్ సర్వీసును నడపటం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని ఆర్టీసి యాజమాన్యం భావించింది. ఆర్టీసి సొంతంగా పార్సిల్ సేవలను అందించడానికి వీలుగా ప్రాంఛైజీలను ఏర్పాటు చేసుకునే సన్నాహాలు కూడా పూర్తయ్యాయి. ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్ (ఎటిబి) ఏజెంట్ల ద్వారా, ఆన్‌లైన్ పాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (ఒపిఆర్‌ఎస్) కౌంటర్లలోనూ ఆర్టీసి పార్సిల్ సర్వీస్ కేంద్రాలను ఏర్పాటు చేసి టికెట్ రిజర్వేషన్ సహా పార్సిల్ సర్వీసుకూ వాటిని వినియోగించుకోనున్నారు. రాష్ట్రంలో 1300 మంది ఎటిబి ఏజెంట్లున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 12 వేల బస్ సర్వీసుల్లో పార్సిళ్ల రవాణా ఉంది. కొరియర్లను ప్రజలకు అందించేందుకు ప్రయివేట్ ప్రాతిపదికన బిజినెస్ ఫెసిలిటేటర్లను కూడా ఆర్టీసి నియమించుకుంది. ప్రయివేట్ ప్రాంఛైజీలను నియమించడంతో కొత్తగా గ్రామీణ ప్రాంతాల్లో పార్సిల్ సర్వీసును నడిపేందుకు 600 గ్రామాలను ఆర్టీసి ఉన్నతాధికారులు గుర్తించారు. పార్సిల్ సేవలను పర్యవేక్షించేందుకు ఆర్టీసి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా రూపొందించింది.



పార్సిల్ సేవా రుసుము

25 కిలోల లోపు పార్సిల్‌కు 50 కిలోమీటర్లలోపు సర్వీసుకు రూ.30, 51-100 కిలోమీటర్ల సర్వీసుకు రూ.35, 101-150 కిలోమీటర్ల సర్వీసుకు రూ.40, 151-200 కిలోమీటర్ల సర్వీసుకు రూ.55, 201-300 కిలోమీటర్ల సర్వీసుకు రూ.65, 301 కిలోమీటర్ల పైనున్న సర్వీసులకు రూ.80 వసూలు చేయాలని ఆర్టీసి నిర్ణయించింది. 500 గ్రాముల వరకూ ఉన్న కొరియర్‌కు 200 కిలోమీటర్ల లోపు ఉన్న సర్వీసుకు రూ.30, 200 కిలోమీటర్ల పైనున్న సర్వీసులకు రూ.35 వసూలు చేయనుంది.

ఎస్‌డబ్ల్యూఎఫ్ హర్షం

ఆర్టీసి సొంత పార్సిల్ సర్వీసును ప్రారంభించడం పట్ల ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా సంస్థకు మరింత ఆదాయం సమకూరే అవకాశముందని తెలిపారు.

'తెలుగుకు సాధికారత కల్పించాలి'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగు భాషకు సాధికారత లేనప్పుడు మనది తెలుగు రాష్ట్రం ఎలా అవుతుందని తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు సామల రమేష్‌బాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు బాషకు సంబంధించిన సమస్యలపై ముఖ్యమంత్రికి సోమవారం లేఖ రాశారు. రాష్ట్రంలో ఇంగ్లీష్ పూర్తి అధికార భాషగా చెలామణి అవుతోందన్నారు. సిఎం కార్యాలయం నుంచే తెలుగు భాషలో ఉత్తర ప్రత్యుత్తరాల ఆచరణ మొదలు కావాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తొలగించారని, రెండు మాధ్యమాలూ ఉంటాయని ఒక పక్క చెబూతూనే తెలుగు మాధ్యమంలో ప్రవేశాల్లేకుండా చేస్తున్నారని విమర్శించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68